హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 48
6, ఆదివారం
ఆగస్టు, 2017

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Mana Telangana

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్ 9

కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం 10



వెంకయ్య విజయం

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నిక

పోలైన ఓట్లు 771, వెంకయ్యకు 516, గోపాలకృష్ణ గాంధీకి 244, చెల్లనివి 11



న్యూఢిల్లీ : గణాంకాలను బట్టి ముందుగా అనుకున్న విధంగానే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎం.వెంకయ్యనాయుడు జయభేరి మోగించారు. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై భారీ తేడాతో గెలుపొందారు. శనివారం జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం పోలైన 771 ఓట్లలో వెంకయ్యకు 516, గోపాలకృష్ణకు 244 ఓట్లు వచ్చాయి. మొత్తం 771 ఓట్లలో 11 ఓట్లను చెల్లనివిగా ప్రకటించారు. పార్లమెంటులోని ఉభయసభల్లో 785 మంది ఎంపిలు ఉన్నప్పటికీ, 14 మంది ఎంపిలకు సహేతుకమైన కారణాల వల్ల ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితాలను వెల్లడించిన అనంతరం తనపై గెలుపొందిన వెంకయ్యకు గోపాలకృష్ణ అభినందనలు తెలిపారు. తనకు మద్దతిచ్చిన అందరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వెంకయ్య మాట్లాడుతూ 'ఒక వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన నేను ఇంత గొప్ప పదవిని అందుకుంటానని ఎన్నడూ ఊహించలేదు. భారత రాజకీయ చిత్రంలో వ్యవసాయానికి తగిన గొంతుక లేదు' అని ఆయన పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. 'నేను చాలా నిగర్విని. నాకు మద్దతిచ్చినందుకు ప్రధాని మోడీతో పాటు పార్టీ నాయకులందరికీ నా కృతజ్ఞతలు. రాష్ట్రపతికి మద్దతుగా నిలిచే విధంగా ఉప రాష్ట్రపతి కార్యాలయాన్ని నేను ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాను. ఎగువ సభ హోదాను కూడా నిలబెడుతాను' అని ఆయన అన్నారు. దేశంలోని రెండో అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరించనున్న 13వ వ్యక్తి వెంకయ్య కావడం విశేషం. పార్లమెంటులోని ఉభయ సభల బలం 790. కాగా, లోక్‌సభలో రెండు, రాజ్యసభలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. న్యాయ విచారణను ఎదుర్కొంటున్నందు వల్ల ఒక బిజెపి లోక్‌సభ ఎంపికి ఓటు హక్కు లేదు. కాగా, 2007 ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో, ప్రస్తుత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీకి 456 ఓట్లు వచ్చాయి. అప్పట్లో ఆయనపై పోటీ చేసిన నజ్మా హెప్తుల్లాకి 222 ఓట్లు, రషీద్ మసూద్‌కి 75 ఓట్లు వచ్చాయి. 2002 ఎన్నికల్లో, అన్సారీకి 490 ఓట్లు, ఎన్‌డిఎ అభ్యర్థి జశ్వంత్ సింగ్‌కి 238 ఓట్లు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు ఉప రాష్ట్రపతిగా గెలిచిన వెంకయ్యకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, తరువాయి 6లో

జిఎస్‌టిపై కోర్టుకు

సిఎం కెసిఆర్ నిర్ణయం

నడుస్తున్న ప్రాజెక్టులపై జిఎస్‌టి రద్దుకు నిరాకరణపై అసంతృప్తి

నేడు ప్రధానికి లేఖ




మన తెలంగాణ/ హైదరాబాద్: జిఎస్‌టి విధానం అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష విధానానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని సిఎం కె. చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు సిఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయంపై సిఎం కెసిఆర్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రధాని మోడీకి ఆదివారం లేఖ రాయాలని నిర్ణయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులకు జిఎస్‌టి వర్తింప చేయడం వల్ల కేవలం తెలంగాణకే కాకుండా అన్ని రాష్ట్రాలకూ అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. గతంలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఈ విషయాన్ని లేవనెత్తారు. తాజాగా శనివారం జరిగిన సమావేశంలో తరువాయి 6లో



ఢిల్లీ భేటీలో కెటిఆర్ నిరసన

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: అభివృద్ధి పనులపై జిఎస్‌టిని 18శాతం రద్దు చేయకపోవడంపై కేంద్రానికి రాష్ట్రం తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. శనివారం ఇక్కడ జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ 20వ సమావేశంలో మంత్రి కెటి రామారావు పాల్గొన్నారు. ఇరిగేషన్‌లో లక్ష కోట్లుకు పైగా, మిషన్‌కాకతీయలో రూ.20 వేల కోట్లు, మిషన్ భగీరథలో రూ.40 వేల కోట్లుకు పైగా, డబుల్ బెడ్ రూం స్కీంలో 18 వేల కోట్లు పైగానూ ఇంకా ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, మునిసిపల్ శాఖలు కలుకొని దాదాపు 30 వేల కోట్ల పనులు జరుగుతున్నాయి. ఈ పనులపై తరువాయి 6లో

గొర్రెకు 2 వేలు



పశు వైద్యుల చేతివాటం

మన తెలంగాణ/ వరంగల్: కులవృత్తిదారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గొర్రెల పథకానికి అవినీతి చీడ పట్టింది. గొర్రెల కొనుగోళ్లలో గోల్‌మాల్ చేస్తున్నారు. గొర్రెల అమ్మకందారులతో వెటర్నరీ డాక్టర్లు మిలాఖతై లబ్ధిదారుల అమాయకత్వాన్ని సొమ్ముచేసుకుంటున్నారు. ఒక్కో గొర్రెపై రూ.వెయ్యి నుండి రూ.2వేల వరకు దండుకుంటున్నారు. గొర్రెలు కొనుగోలు చేయాలంటే వెటర్నరీ డాక్టర్ సర్టిఫై చేయాల్సి ఉంటుంది. దీనిని ఆసరా చేసుకొని ఆ డాక్టర్లు కొత్త వ్యాపారానికి తెరదీశారు. ఈ వ్యవహారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో లబ్ధిదారులకు గొర్రెలు కొనుగోలు చేసే విషయంలో చోటు చేసుకుంటోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది 50,657 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలనుకున్నారు. అయితే ఇప్పటివరకు అందులో 10శాతం యూనిట్లను మాత్రమే పంపిణీ చేశారు. ఈ జిల్లాలకు సంబంధించి అనంతరపురంలో గొర్రెలను కొనుగోలు చేస్తున్నారు. వెటర్నరీ డాక్టర్లు ముందే అనంతరపురానికి వెళ్ళి గొర్రెల అమ్మకందారులను కలిసి, తరువాయి 6లో



జలరాలు కాని జూరాల

జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయల్‌సాగర్ ఆయకట్టు భవిష్యత్తు ప్రశ్నార్థకం

మన తెలంగాణ/ గద్వాల /ధరూరు: బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తున్న కర్నాటక యథేచ్ఛగా జల చౌర్యానికి పాల్పడుతుంది. ప్రసుత్తం ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో పూర్తిస్థాయి నీటి మట్టాలు ఉన్నప్పటికీ అదనంగా ఉన్న నీటిని దిగువనున్న జూరాలకు విడుదల చేయకుండా అక్కడే ఎత్తిపోతలు, పవర్ హౌస్‌లకు వినియోగించుకుంటుంది. ప్రసుత్తం వానాకాలంలో ఆగస్టు మొదటి వారం ముగుస్తున్నా జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రాజెక్టులతో పాటు, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయి నీరు వచ్చి చేరలేదు. తెలంగాణలో తొలి ప్రాజెక్టు అయిన జూరాలలో శనివారం కేవలం 5.65 టిఎంసిలు ఉండగా, 1.98 టిఎంసిలు మాత్రమే వినియోగించుకునే వీలుంది. దీంతో తరువాయి 6లో

కేశవరం, లక్ష్మాపూర్‌లకు నిధులు

• సిఎం హామీ మేరకు 24 గంటల్లో విడుదలైన జిఒలు

మన తెలంగాణ/ మేడ్చల్ : ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలకు రూ.27.75 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలలో గ్రామసభ నిర్వహించిన సిఎం రెండు గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.27 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం మధ్యాహ్నానికి జిఒలు జారీ చేసి ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో రెండు గ్రామాలలో మౌలిక వసతులతో పాటు వివిధ తరువాయి 6లో

కరీంనగర్‌లో మెడికల్ కాలేజీ కోసం పొన్నం ప్రభాకర్ దీక్ష



• సంఘీభావం ప్రకటించిన జానారెడ్డి 6

యశోదా ఆసుపత్రిలో మంత్రి తుమ్మలకు పలువురి పరామర్శ

కలుసుకున్న హరీశ్, ఈటల, తలసాని తదితరులు 3

కుంచెపోటు



ఐటి మత్తుపై కన్ను

కమింగో లింకులపై ఆరా తీస్తున్న సిట్

మన తెలంగాణ/ హైదరాబాద్ : టాలీవుడ్‌ను ఒక కుదుపు కుదిపిన డ్రగ్స్ కేసు ఐటి రంగం వైపు మళ్ళింది. డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్‌కు నెదర్లాండ్ నుంచి డ్రగ్స్ దిగుమతి చేస్తున్న మైక్ కమింగో విచారణను ప్రారంభించిన సిట్‌కు అనేక ఆసక్తికరమైన అంశాలు తెలిసినట్లు సమాచారం. నెదర్లాండ్‌కు చెందిన కమింగో గత కొన్నేళ్ళుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నాడని, స్థానిక యువతిని వివాహం చేసుకున్నాడని గుర్తించారు. డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు దిగుమతి చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడని తెలిసింది. ఐటి నిపుణుడైన కమింగో పలు సాఫ్ట్‌వేర్ సంస్థలకు కన్సల్టెంట్‌గా ఉన్నాడని, ఆయా సంస్థలకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేసి ఇచ్చేవాడని కూడా గుర్తించారు. పలు ఐటి సంస్థలకు చెందిన కీలకులతో పాటు ఆయా సంస్థలలో పని చేసే ఎంతో మందికి కమింగో డ్రగ్స్ సరఫరా చేసినట్లు విచారణలో సిట్ గుర్తించింది. కమింగో నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో ఐటి రంగంలోని పలువురి వివరాలున్నాయని, కొందరితో జరిపిన చాటింగ్ కూడా ఉన్నట్లు గుర్తించారు. అయితే పూర్తి సమాచారాన్ని రాబట్టేందుకు విచారణ మొదటి రోజు అధికారులు చేసిన ప్రయత్నాలకు కమింగో సహాయ నిరాకరణ చేసినట్లు సమాచారం. ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తమైన సమాచారాన్ని సేకరించేందుకు పాస్‌వర్డ్ అడ్డం వస్తుందని, పాస్‌వర్డ్‌ను చెప్పేందుకు కమింగో నిరాకరిస్తున్నట్లు అధికారులంటున్నారు. ఫోన్‌లో దాదాపు 1500 మందికి చెందిన ఫోన్ నంబర్లున్నాయని, తరువాయి 6లో

భారత్‌పై స్వల్ప సైనిక చర్యకు సిద్ధమవుతున్న చైనా 11

చిత్తూరు వద్ద ప్రమాదంలో నలుగురు స్పెయిన్ పౌరుల దుర్మరణం 11

ముంబయి వద్ద సముద్రంలో మునిగి ముగ్గురు విద్యార్థులు మృతి 10

చర్చలే శరణ్యం

సంప్రదింపుల ద్వారానే సమస్యలకు పరిష్కారం : ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : సమస్యల పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని ప్రధాని మోడీ అన్నారు. లోతుగా నాటుకుపోయిన మతపరమైన జాడ్యాలు, దురభిమానాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల మధ్య కుల, మతపరమైన విభేదాలు తలెత్తుతున్నాయి. ఇలాంటివి దేశాలు, సమాజాల మధ్య తగాదాలకు బీజం వేస్తున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని మోడీ చెప్పుకొచ్చారు. మయన్మార్‌లోని యాంగాన్‌లో నిర్వహించే తరువాయి 6లో



సంక్షేమంపై ట్రంప్ ఆంక్షలు

11లో

• వలసదారులకు ఐదేళ్లపాటు వర్తించదని వీకెండ్ ప్రసంగంలో స్పష్టీకరణ

దళిత అభివృద్ధి సంస్థ లక్ష్యాల అమలుపై నివేదిక



మన తెలంగాణ/హైదరాబాద్ : దళిత అభివృద్ధి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల అమలు తీరుపై పూర్తి నివేదికను అందించాలని సంస్థ వైస్‌ఛైర్మన్, ఎండి లచ్చిరాం భూక్యా జిల్లా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌లో శనివారం దళిత అభివృద్ధి సహకార సంస్థ చేపడుతున్న పలు కార్యక్రమాలపై లచ్చిరాం భూక్యా సమీక్ష నిర్వహించారు. సంస్థ నిర్దేశించుకున్న వార్షిక కార్యచరణ అమలు, గుడుంబా తయారీ పునరావాస స్వయం ఉపాధి పథకాలు, భూమి కొనుగోలు తదితర కార్యక్రమాలపై ఆరా తీశారు. భూమి కొనుగోలు పథకం ద్వారా 2014–15 నుంచి 2016–17 వరకు 551.10 ఎకరాలను లబ్ధిదారులకు అందజేశామన్నారు. మెట్ట భూముల్లో బోర్లు వేసేందుకు భూగర్భ జల శాఖాధికారుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఆర్థిక సహాయ పథకాలను ఈ నెల 20 పూర్తి చేయాలన్నారు. గుడుంబా తయారీ దారుల పునరావాస పథకం 2017–18 వార్షిక సంవత్సరానికి నిర్దేశించుకన్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్కీములో ఇప్పటి వరకు ఐదు జిల్లాలో 142 మంది లబ్ధిపొందారని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు వివిధ వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు.

'కారుణ్య ఉద్యోగం' వద్దనుకుంటే రూ.5 లక్షల ఆర్థిక ప్రయోజనం

మన తెలంగాణ / హైదరాబాద్ : కారుణ్య నియమాల పథకం కింద ఇచ్చే ఉద్యోగం వద్దనుకునే ఉద్యోగుల కుటుంబాలకు 'అదనపు ఆర్థిక ప్రయోజనం' (ఎఎంబి) రూ.5 లక్షలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రస్తుత ఆగస్టు 4వ తేదీ అనంతరం మరణించిన కుటుంబ సభ్యులకు మాత్రమే వర్తిస్తుందని ఆర్‌టిసి స్పష్టం చేసింది. ఇప్పటివరకు కారుణ్య నియామకాల పథకం కింద ఉద్యోగం వద్దనుకునే కుటుంబానికి నాలుగు కేటగిరిల వారిగా రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆర్‌టిసి చెల్లిస్తున్నది. ఈ పథకంలో ఎఎంబి నిబంధనను 1999లో సవరించారు. దాదాపు 17 ఏళ్ల తరువాత ఎఎంబి నిబంధనను సవరిస్తూ రూ.5 లక్షలు చెల్లించే విధంగా టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణ రావు శనివారం సర్క్యులర్ (18/2017) ను జారీ చేశారు. కాగా ఎఎంబిని రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్, ఎన్‌ఎంయు హర్షం వ్యక్తం చేశాయి. ఉద్యోగం వద్దనుకునే వారికి ఎఎంబిని రూ.5 లక్షలకు పెంచాలని ఇటీవల ఇయు, ఎన్‌ఎంయు యాజమాన్యానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

లెక్క తేలని గొర్రెలు



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల అధికారిక సంఖ్య 41,139. అయితే ఈ లెక్కకు ఒక ప్రాతిపదికత మాత్రం లేదు. కారణం క్షేత్రస్థాయిలో పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లు సంఖ్య నిజమా ? కాదా? అనేది తేలడం లేదు. చాలా జిల్లాలలో కొనుగోలు చేసిన యూనిట్ల కంటే అధిక సంఖ్యను నివేదిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఇతర రాష్ట్రాలలో కొనుగోలు చేద్దామంటే ఒక రోజు కనిపించని గొర్రెలు, అదే ప్రాంతంలో మరుసటి రోజు ప్రత్యక్షమవుతున్నాయని లబ్ధిదారులు పేర్కొనడం గమనార్హం. అసలు గొర్రెల రీసైక్లింగ్ జరగకుండా ప్రభుత్వం ముందుగానే రాష్ట్రంలో ఉన్న గొర్రెలన్నింటికి చెవిపోగులు కుట్టించాలని ఉత్తర్వులు (జిఓ నంబర్ 52) జారీ చేసింది. ఇప్పుడు ఈ ఉత్తర్వులు తుంగలో తొక్కారు. స్వయంగా ఆ శాఖ మంత్రి చెవిపోగులు వేస్తామని చెప్పలేదు అని శుక్రవారం మీడియా సమావేశంలో పేర్కొనడం గమనార్హం. ఈ రకంగా పోగులు వేయకుండానే గొర్రెలను కొనుగోలు చేసి మళ్లీ వాటిని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇష్టారీతిన గొర్రెలు రీసైక్లింగ్ అవుతున్నాయనేది స్పష్టమౌతోంది. శనివారం జగిత్యాల్ జిల్లాలో 156 యూనిట్లు అంటే 3276 గొర్రెలను కొనుగోలు చేసినట్లు నివేదించారు. ఒక్కో గొర్రెకు ఇన్సూరెన్సు చెవిపోగు వేయడానికి కనీసం మూడు నిమిషాలు తీసుకుంటుంది. ఈ లెక్కన వీటన్నింటికి చెవిపోగులు వేయాలంటే కనీసం 160 గంటలు పడుతుంది. ఒకే రోజులో ఇన్ని గొర్రెలకు ఎలా ఇన్సురెన్సు చెవిపోగులు వేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ మన రాష్ట్రానికి వచ్చాక వేసుకోవచ్చు అనుకుంటే మార్గమధ్యంలో గొర్రె చనిపోతే బీమా రాదు. పైగా ప్రభుత్వం ఒక్క యూనిట్‌కు రహదారి బీమా కింద రూ. 2515 భరిస్తోంది. ఈ క్రమంలో సొసైటీ అధ్యక్షులు, వెటర్నరీ డాక్టర్లు పెద్ద మొత్తంలోఅవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసింది. గొర్రెల కొనుగోలు విషయంలో ఆడ గొర్రెల సరాసరి బరువు 20 కిలోలకు తక్కువ ఉండకూడదని నిబంధనలు విధించారు. ఈ లెక్కన మరీ చిన్న పిల్లలు కూడా కొనుగోలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వమే కల్పించినట్లవుతోంది.

వ్యవసాయ రంగంలో అగ్రభాగానికి కృషి



మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో తెలంగాణ అగ్రభాగాన నిలబెట్టడం కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అహర్నిశలు శ్రమిస్తున్నారని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు ఇప్పటికే కనిపిస్తున్నాయని, వచ్చే ఏడాది నుంచి అమలయ్యే ఎకరాకు ఎనిమిది వేల రూపాయల పంపిణీతో వ్యవసాయ రంగంలో సరికొత్త శకానికి నాంది పడగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రైతుల దీనావస్థకు గత పాలకులు వ్యవసాయ రంగంపై చూపిన నిర్లక్ష్యం ఫలితమేనని ఆయన వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో కడపలో జరిగే పీపుల్స్ పార్లమెంట్ సదస్సు బ్రోచర్‌ను పాతూరి శాసనమండలిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పీపుల్ అగైనెస్ట్ కరప్షన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వినూత్న సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించడం శుభపరిణామన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభ నివారణ చర్యలు, పౌర హక్కుల సేవా చట్టం అమలుపై పీపుల్స్ పార్లమెంట్ దృష్టి సారిస్తున్నందుకు నిర్వాహకులను పాతూరి అభినందించారు. పీపుల్స్ పార్లమెంట్ నిజమైన పార్లమెంట్ తరహాలోనే జరుగుతుందని సదస్సు నిర్వహణ సలహాదారు మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ సదస్సులో చేసే తీర్మానాలను పార్లమెంటు స్టాండింగ్ కమిటీలు, అన్ని రాజకీయ పార్టీలకు పంపుతామని, వాటి అమలు కోసం ఒత్తిడి పెంచుతామన్నారు. పీపుల్స్ పార్లమెంట్‌కు వివిధ రంగాలకు చెందిన వంద మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, సమస్యల పరిష్కారానికి ఈ సదస్సు ఓ దిక్సూచిగా నిలవగలదన్నా ఆశాభావాన్ని పీపుల్ అగైనెస్ట్ కరప్షన్ ప్రతినిధి, పీపుల్ పార్లమెంట్ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది పీపుల్స్ పార్లమెంట్‌ను ఢిల్లీలో నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

దాడులు చేయడం మా సిద్ధాంతం కాదు : బిజెపి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై జరిగిన దాడికి బిజెపికి ముడిపెడుతూ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, బిజెపి కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడం, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం పట్ల బిజెపి తీవ్రంగా ఖండించింది. గుజరాత్‌లో తలెత్తిన వరదలతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతుంటే వారిని ఆదుకునేందుకు ముందుండాల్సిన కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను అధిష్ఠానం కర్నాటకకు తరలించి రిసార్టులలో ఉంచి జల్సాలు చేసేలా ప్రోత్సహించడం వల్లే రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై ప్రజలు దాడి చేశారని పార్టీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కేవలం ప్రచారం కోసమే బిజెపి కార్యాలయంపైకి వచ్చారన్నారు. ఇలాంటి వాటికి బిజెపి భయపడదని, మరోసారి ఇలాంటివి పునరావృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

మౌనం వీడితేనే లైంగిక వేధింపులకు అడ్డుకట్ట



మన తెలంగాణ/హైదరాబాద్ : పని చేసే చోట లైంగిక వేధింపులకు గురయ్యే మహిళలు మౌనం వీడితేనే వేధింపులకు అడ్డుకట్ట పడుతుందని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.యతిరాజులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం అధ్యక్షతన నగరంలో శనివారం ''పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013''పై సంప్రదింపుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని చేసే కార్యాలయంలో ఒక మహిళ లైంగిక వేధింపులకు గురైతే ఆ ఒక్క మహిళ ఫిర్యాదు చేసి పోరాడితే ప్రయోజనం ఉండదన్నారు. అలాంటి సందర్భాల్లో మహిళలంతా కలిసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఉమ్మడి ఫిర్యాదు, సంఘటిత పోరాటం ఫలితాన్నిస్తుందన్నారు. నిరోధక చట్టాన్ని అమలు చేసేందుకు ప్రతి కార్యాలయంలో అంతర్గత శాశ్వత కమిటీలను వేయాలని ఆయన అన్నారు. అంతర్గత కమిటీలతో న్యాయం జరగనప్పుడు మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలను గుర్తించాలని, వాటికి ఆర్థిక సహకారం అందించాలని ఆయన సూచించారు. ప్రతి కార్యాలయంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ఏవేవి నేరాల క్రిందికి వస్తాయో, ఆ నేరాలు చేతే ఎలాంటి పర్యవసనాలు ఎదురౌతాయో ఉద్యోగులందరికి కనిపించేలా కార్యాలయాల్లో పెట్టాలన్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్య కార్యదర్శి సత్‌బీర్ బేడి మాట్లాడుతూ, లైంగిక వేధింపుల చట్టం క్రింద మహిళలు ఫిర్యాదు చేసి విజయం సాధిస్తే అది చిన్నదైనా దానికి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకురాలు విజయేంద్ర, త్రిపురాన వెంకటరత్నం, హైదరాబాద్ ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రశాంతి, మహబూబ్‌బాద్ కలెక్టర్ ప్రీతి మీనా, నిజామాబాద్ కలెక్టర్ యోగితా రాణా పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంలో సంబరాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : భారత ఉప రాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు ఎన్నికైన నేపథ్యంలో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తలు, నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే కార్యాలయంలోని నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా బయటకు వచ్చి జయజయ నినాదాలు చేస్తూ టపాకాయలను పేల్చారు. పరిసర ప్రాంతాలలోని రహదారులలో వెళ్తున్న ప్రయాణికులకు మిఠాయిలను పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. బిజెపికి వెంకయ్యనాయుడు చేసిన సేవలు ఎనలేనివని, ఎన్నో కీలక పదవులను అలంకరించిన ఆయన వాటన్నింటికీ వన్నె తెచ్చారని ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సామాన్య కార్యకర్తల అత్యున్నత స్థానాలను అధిరోహించడం కేవలం బిజెపి వల్లే సాధ్యమవుతుందన్న విషయం మరోసారి రుజువైందన్నారు. చాయ్ అమ్మిన వ్యక్త ప్రధాని, సామాన్య కార్యకర్త రాష్ట్రపతి, గోడల మీద స్లోగన్‌లు రాసి, బ్యానర్‌లను కట్టిన చిన్న కార్యకర్త ఉప రాష్ట్రపతి అయ్యారన్నారు.అనేక పదవులను అలంకరించి పార్టీలో కీలకుడైన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి కావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషిస్తున్నారని బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి అన్నారు. పార్టీ పదవులకు వన్నె తెచ్చిన విధంగానే ఉప రాష్ట్రపతి పదవికి వెంకయ్యనాయుడు వన్నె తెస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. వెంకయ్యనాయుడుకు ఉప రాష్ట్రపతి పదవి కట్టబెట్టడం వల్ల ప్రపంచంలోని తెలుగు వారు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. దేశ సేవకు వెంకయ్యనాయుడు పునరంకితమవుతారని, ఆయనను ఉప రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసిన అమిత్‌షా, నరేంద్ర మోడీతో పాటు వెంకయ్యనాయుడుకు ఓటేసిన అందరికీ ధన్యవాదాలన్నారు. ఈ సంబరాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోరేటి ఆనంద్‌గుప్త, కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గసభ్యుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిసి బిల్లుపై పార్టీల విధానమేంటి?

మన తెలంగాణ/హైదరాబాద్ : బిసి బిల్లుపై అన్ని రాజకీయ పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బిసిల ఓట్లతో గెలిచి రాజకీయాలు చేస్తున్న పార్టీలు, బిసి బిల్లుపై మాత్రం తమ పాలసీని ప్రకటించకుండా గోడమీద పిల్లిలా వ్యవహరిస్తూ నాన్చివేత ధోరణి పాటిస్తున్నారని వైఖరి మార్చుకోవాలన్నారు. ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తెచ్చేందుకు వందలాది మందితో ఈ నెల 7వ తేది నుంచి 10వ తేది వరకు ఢిల్లీలో బిసిల లొల్లి పేరిట మూడు రోజులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ బిసి భవన్‌లో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమ నిర్వహణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ చట్ట సభలలో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కులాల వారీగా జనాభాను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన వెంటనే జాతీయ స్థాయిలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి ఏకాభిప్రాయం తీసుకురావాలని ఆయన కోరారు.

పైసలిస్తేనే ఫైలు కదిలేది

- యుఎల్‌సి రద్దయినా దరఖాస్తులు పరిష్కారం కావు
- మూడు జిల్లాల ఆఫీసులు ఒకే భవనంలో

మన తెలంగాణ/హైదరాబాద్ : పట్టణ భూ గరిష్ట పరిమితి (యుఎల్‌సి) చట్టం రాష్ట్రంలో రద్దయి తొమ్మిదేళ్లు కావస్తున్నది. అయినా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గతేడాది నాంపల్లిలోని యుఎల్‌సి కార్యాలయాన్ని కూడా రద్దు చేశారు. ఈ కార్యాలయాన్ని మూడు ముక్కలుగా చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన ఫైళ్లను ఆ జిల్లాల కలెక్టర్లకు అప్పగించారు. వాటిని పర్యవేక్షించే బాధ్యతలను డిప్యూటీ కలెక్టర్లను అప్పగించారు. యుఎల్‌సి కార్యాలయాన్ని రద్దు చేసిన ప్రభుత్వం ఆ ఫైళ్లను సంబంధిత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించక పోవడం మూలంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే అదనుగా వచ్చే ప్రజలను డబ్బుల కోసం కొంత మంది ఉద్యోగులు పీక్కు తింటున్నారు. డబ్బులు చెల్లిస్తేనే ఫైళ్లు పై అధికారులకు పంపిస్తామని లేదంటే ఇక్కడే ఉండిపోతాయని కొందరు, అంతా మేమే చేస్తాం ఎంతో కొంత ఇవ్వాలంటూ మరికొందరు ఆల్టిమేటం ఇస్తున్నారు. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినా పనులు కావడం లేదంటూ పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.



మేడ్చెల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం కీసరప్రాంతంలో ఉండగా, ఆ జిల్లాకు చెందిన ఫైళ్లు నాంపల్లిలోని పాత యుఎల్‌సి కార్యాలయంలో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఫైళ్లు అక్కడ ఉండాల్సి ఉండగా అవి కూడా ఇక్కడే ఉన్నాయి. దీంతో అధికారులు ఫైళ్లు వెంట తీసుకుని సంబంధిత కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తున్నది. రాష్ట్రంలో యుఎల్‌సి భూముల క్రమబద్ధీకరణ కోసం 455, 456, 92, 747 జిఒలు ఇప్పటి వరకు జారీ అయ్యాయి. ఈ జిఒల కింద వేలాది దరఖాస్తులు రాగా పరిష్కరించినవి మాత్రం స్వల్పంగానే ఉన్నాయి. ఏ ఒక్క జిఒ కింద పూర్తిస్థాయిలో దరఖాస్తులు పరిష్కరించలేదంటే అధికారుల పని తీరు ఎంత ఘోరంగా ఉందో ఊహించుకోవచ్చు. దరఖాస్తు పెండింగ్‌లో ఉందని ఎవరైనా వెళ్లే జలగల్లా వెంటపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాంపల్లిలోని యుఎల్‌సి కార్యాలయంలో మూడు జిల్లాల పరిధిలో సుమారు 70 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాలకు ఒకరు చొప్పున, హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున మొత్తం నల్గురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. స్పెషల్ ఆఫీసర్ స్థానంలో వీరు నియమితులయ్యారు. ఇంత మంది ఉద్యోగులు ఉన్నా ఫైళ్లు మాత్రం నత్తను తలపించే విధంగా కదులుతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సంతకం కోసం పంపిస్తే, నెలల తరబడి ఆమోదానికి నోచుకోవడం లేదు. ఇలా పలు కారణాలతో ఫైళ్లు పరిష్కారం కాకపోవడంతో దరఖాస్తుదారులు తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. కలెక్టర్‌ను కలిస్తే నాంపల్లిలోని కార్యాలయానికి వెళ్లాలని అంటున్నారు. వాళ్లను అడిగితే కలెక్టర్‌ను కలవాలని అంటూ ఎవరికి వారుగా తప్పించుకుంటున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను కలిస్తే పరిశీలిస్తామని చెబుతున్నారు తప్పితే శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు.

తుమ్మలకు పరామర్శ

మన తెలంగాణ/హైదరాబాద్: యశోధ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శనివారం పలువురు పరామర్శించారు. మంత్రులు టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్, ఇంద్రకరన్ రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపి కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్ రెడ్డిలు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

రాహుల్‌పై కుట్రపూరిత దాడి

మన తెలంగాణ/హైదరాబాద్: ఎఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై కుట్రపూరితంగా దాడి చేశారని, దీనిపై సిబిఐ విచారణ చేయాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలో రాహుల్ పర్యటిస్తే ఇలాగే వ్యవహారిస్తారా అని ప్రశ్నించారు. మోడి మార్క్ పాలన అంటే ఇదేనా అని అన్నారు. కేంద్రంలో పెద్ద మోడీ, రాష్ట్రంలో చిన్న మోడీ పాలన కొనసాగు తుందని ఎద్దేవా చేశారు. పంజాబ్ నుంచి వచ్చిన అధికారులు అబద్దాలు చెప్పారని, తమను కలిస్తే వాస్తవాలను వారికి వివరించేవాళ్లమన్నారు. మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ నిరాహారదీక్ష చేసేందుకు కూడా పోలీసులు అనుమతి ఇవ్వరా అని ప్రశ్నించారు.

వంటగ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ తొలగింపును నిలిపివేయాలి

మన తెలంగాణ/హైదరాబాద్: వంటగ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర శాఖ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిలిండర్‌పై నెలకు రూ.4 పెంచాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో 14.2 కేజీల సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్‌పై నెలకు రూ.2 చొప్పున పెంచాలని ప్రభుత్వరంగ పెట్రోలియం సంస్థలను ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెట్టింపు చేయడాన్ని ఆయన ఖండించారు. ఒక వైపు కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీలు ప్రకటిస్తూ వంటగ్యాస్ సిలిండర్ ధర పెంచడం దుర్మార్గమైన చర్య అని ఆయన దుయ్యబట్టారు. కార్మికుల కనీస వేతనాన్ని పెంచడానికి నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. రోజువారీ పెట్రోల్, డీజిల్ ధరల పెంపుదలతో లీటర్‌కు పెట్రోల్ రూ.70, డీజిల్ రూ.61 పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా భవిష్యత్ ఉద్యమాల కోసం ఆగస్టు 8న ఢిల్లీలో జరుగనున్న కేంద్ర కార్మిక సంఘాల సదస్సులో పాల్గొనాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

'డిటెన్షన్'తో పేదలకు విద్య దూరం

మన తెలంగాణ/హైదరాబాద్ : డిటెన్షన్ విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పేద, బడుగు,బలహీన వర్గాల పిల్లలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని బాలల హక్కుల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే కేవలం 6070 శాతం అక్షరాస్యత ఉండని, ఇంకా కొన్ని రాష్ట్రాల్లో 50 శాతం కూడా అక్షరాస్యత మించలేదని తెలిపింది. ఈ తరుణంలో డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెడితే అక్షరాస్యత శాతం మరింత పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులు 5,8 తరగతుల పరీక్షల్లో ఫెయిల్ అయ్యారనే సాకుతో ఇంటికి పంపించాలనే యోచనతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ డిటెన్షన్ చట్టం చేయాలని కుట్ర పన్నుతున్నదని ఆరోపించింది. డిటెన్షన్ విధానం అమలులోకి వస్తే చిన్న వయసులోనే పిల్లలు బాల కార్మికులుగా లేదా బాల్య వివాహం చేసుకున్న అమ్మాయిలుగా దుర్భర జీవితం గడపాల్సిన పరిస్థితి దాపురిస్తుందని పేర్కొంది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను బాల సంఘం అభినందించింది.

ఛత్తీస్‌గఢ్‌తో పర్యాటక ఒప్పందం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర పర్యాటకాభివృద్ధిలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఛత్తీస్‌గఢ్ పర్యాటక శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరిగిన తెలంగాణ పర్యాటక శాఖ రోడ్‌షోలో ఈ మేరకు ఒప్పందం పై తెలంగాణ టూరిజం కమిషనర్ సునీత ఎం.భగవత్, ఛత్తీస్‌గఢ్ టూరిజం జిఎం సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ పర్యాటక శాఖ మంత్రి దయాల్ దాస్ భగల్, కార్యదర్శి నిహారిక బారిక్ సింగ్, ఛత్తీస్‌గఢ్ టూరిజం బోర్డు ఎండి ఎం.టి.నంది, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎస్‌టిడిసి) ఇ.డి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్యాటక ప్రత్యేకతలను, వారసత్వ కట్టడాలను వివరించారు. ఛత్తీస్‌గఢ్ పర్యాటకలు తెలంగాణలో పర్యటించాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్ టూరిజం రోడ్‌షోను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 31లోగా మెరిట్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు చేసుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్: ఇంటర్ విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్‌ఆర్‌డి) అందించే మెరిట్ స్కాలర్‌షిప్‌కు అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2017 మార్చిలో ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై, 201718 విద్యాసంవత్సరంలో ఉన్నత విద్యలో చేరిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పులకు http://scholarships.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను తమ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించారు. 2016–17 బ్యాచ్ ఫస్ట్ రెఫ్యైవల్‌కి, 201516 బ్యాచ్ సెకండ్ రెన్యువల్‌కి ఆగస్టు 31 చివరి తేదీ అని అన్నారు.

కార్యనిర్వాహక బోర్డు ఏర్పాటు

మన తెలంగాణ/హైదరాబాద్: మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల (సెమీ అటానమస్)కు ప్రభుత్వం కార్యనిర్వాహక బోర్డును నియమించింది. బోర్డుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఉపాధ్యక్షుడు, ఛైర్మన్‌గా, సంబంధిత కళాశాల డైరెక్టర్/ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా ఉంటారు. బోర్డులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, వైద్యవిద్య సంచాలకులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ సభ్యులుగా ఉంటారు.

నేడు తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక ఆవిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ తహశీల్దార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల మాసపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరగనుందని అసోసియేషన్ అధ్యక్షులు కె.గౌతమ్ కుమార్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఆవిష్కరణ సభకు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాసపత్రిక సంపాదకులు వి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథులుగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ, ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ప్రకాష్ రావు హాజరు కానున్నారు. కార్యక్రమంలో మన తెలంగాణ దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వరరావు, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, సాక్షి దినపత్రిక సంపాదకులు వి.మురళి, నమస్తే తెలంగాణ దినపత్రిక సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి పాల్గొంటారని గౌతమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పిఆర్‌ఎస్‌ఐ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్‌ఎస్‌ఐ) హైదరాబాద్ చాప్టర్ తలపెట్టిన రెండవ తెలంగాణ పిఆర్‌ఎస్‌ఐ కాన్ఫరెన్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సదస్సును హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆఇదివారం ప్రారంభించనున్నారు. చిన్న రాష్ట్రాల్లో సమర్థ ప్రజా పాలన, పటిష్టంగా సమాచార ప్రసారం తెలంగాణ దృక్కోణం ప్రధానంశంగా జాతీయ ప్రజా సంబంధాల విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో కాన్ఫరెన్సు జరగనుంది. దీనిలో కేంద్రమంత్రి దత్తాత్రేయ, జిహెచ్‌ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి, పిఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షులు అజిత్ పాఠక్, పిఆర్ వాయిస్ పత్రిక సంపాదకుడు డా.సి.వి నరసింహా తదితరులు పాల్గొనున్నట్లు పిఆర్‌ఎస్‌ఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

అంతర్జాతీయ భాషగా తెలుగు

వక్తల ఆశాభావం

మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: తెలుగు రాష్ట్రాలలోని విద్యా విధానంలో మాతృభాష తెలుగు వెనుకంజలో ఉందని, భాషా మనుగడకు విద్యా విధానం మౌలిక అవసరమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శనివారం తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు భాష పై స్వాభిమానం ఉన్నప్పుడే జాతికేతనాన్ని ఎగురవేయవచ్చని, ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో తెలుగు పీఠాలను నెలకొల్పడానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. తెలుగు అంతర్జాతీయ భాషగా ఎదగాలన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి మాట్లాడుతూ తెలుగు భాషను మనకు మనమే పరిరక్షించుకోవాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. తెలుగు వర్సిటీ అందజేస్తున్న సంస్కృతి పురస్కారం తెలుగు సంస్కృతికి దర్పణమని అన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిల వికాసానికి విశేషమైన సేవలందిస్తూ ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ విశేషమైన కృషి చేస్తున్న వ్యక్తులు, తెలుగు సంస్థలకు అందించే సంస్కృతి పురస్కారాన్ని 2017 సంవత్సరానికి గాను "ది బొంబాయి ఆంధ్రా మహాసభ జింఖానా, ముంబాయి వారికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ పురస్కారం కింద రూ.25వేల నగదు, శాలు వాను సంస్థ అధ్యక్షులు మంతెన రమేష్, ట్రస్టీ చైర్మన్ సంగెం ఏకనాథ్ స్వీకరించారు. సభకు



అధ్యక్షత వహించిన తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ మండలి బుద్ధప్రసాద్ సౌజన్యంతో ప్రతీ యేటా అందిస్తున్న సంస్కృతి పురస్కారాన్ని ఒక యేడాది విదేశాంధ్ర సంస్థలకు, మరో యేడాది రాష్ట్రేతాంధ్రుల సంస్థలకు అందజేస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాష వ్యాప్తికి తెలుగు వర్సిటీ ఎప్పుడూ తనవంతు కృషి చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగువర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి సత్తిరెడ్డి, అంతర్జాతీయ తెలుగుకేంద్రం ఆఫీసర్ ఇంచార్జి డాక్టర్ గీతావాణి, విస్తరణ సేవా విభాగం ఇంచార్జి ఆర్ రామం తదితరులు పాల్గొన్నారు.

మోడీ రాష్ట్ర పర్యటన అడ్డుకుంటాం

మన తెలంగాణ/హైదరాబాద్: గుజరాత్ ప్రజ పరిస్థితులు, బిజెపి ప్రభుత్వ అసమర్థ పాలన దేశమంతా తెలుస్తుందనే భయంతోనే బిజెపి గుం డాలు ఎఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీపై దాడికి పాల్పడ్డారని టిపిసిసి అధికార ప్రతినిధి కొనగాల మహేష్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్‌పై జరిగిన దాడి పిరికిపందల చర్యగా అభివర్ణించారు. బిజెపి నేతల గుండాగిరిపై ఆ పార్టీ అధ్యక్షులు అమిత్‌షా రాహుల్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే అమిత్‌షాను రాష్ట్రంలో పర్యటించకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

అన్ని మున్సిపాలిటీల్లో స్వచ్ఛ ఆటో



మన తెలంగాణ/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో అమలు చేస్తున్న "స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్ కమ్ ఓనర్"ను అన్ని మున్సిపాలిటీలలో అమలు చేసేందుకు పురపాలక శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందుకోసం ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు స్థానిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ లబ్ధిదారులను గుర్తించడంతో పాటు వారు ప్రతి నెలా రూ.22 వేల నుంచి రూ. 25 వేలు ఆదాయం వచ్చే విధంగా ఈ పథకాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని అమలును స్థానిక మున్సిపాలిటీలు పర్యవేక్షిస్తాయి. చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఒక్క టిప్పర్‌కు కనీసం 650 నుంచి 750 గృహాలు కేటాయిస్తారు. మొత్తం టిప్పర్‌కు అయ్యే ఖర్చులో 10 శాతం దళిత, గిరిజన లబ్ధిదారులు, 20 శాతం వరకు మిగతా లబ్ధిదారులే మార్జిన్ మనీగా ముందుగా చెల్లించాలి. మిగతాది బ్యాంక్‌ల నుంచి రుణంగా ఇస్తారు. ప్రస్తుతం చెత్త సేకరణ చేస్తున్న దళిత, గిరిజనులకు అ పథకం అమలులో ప్రాధాన్యత ఇస్తారు. చెత్తసేకరణ, వాహనాలు ఇతర పనులకు వెళ్లకుండా చూడడంతో పాటు ప్రతి నెలా బ్యాంకుకు వాయిదాలు సక్రమంగా చెల్లించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.

ప్రత్యేక కమిటీ

'స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్ కమ్ ఓనర్' అమలు చేసేందుకు ప్రతి మున్సిపాలిటీలు, నగర పంచాయతీ, కార్పొరేషన్లు కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా మేయర్ లేదా ఛైర్‌పర్సన్ ఉంటారు. మెంబర్ కన్వీనర్లుగా మున్సిపల్ కమిషనర్లు, సభ్యులుగా మెప్మా, ఎస్‌ఇ లేదా ఇఇలు, సాని టరి ఇన్‌స్పెక్టర్లు, మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ మేనేజర్, మున్సిపల్ కమిషన్ నామినెట్ చేసిన ఒకరు ఉంటారు.

ప్రతి ఇంటిపై రూ.40 భారం

చెత్త సేకరణ పేరుతో ప్రతి ఇంటి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు మున్సిపల్ శాఖ సన్నద్ధమైంది. చెత్తను సేకరించినందుకు ప్రతి ఇంటి నుంచి రూ.40లు వసూలు చేయాలని నిర్ణయించింది. వంద శాతం చెత్త సేకరణ చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించిన మున్సిపల్ శాఖ ఆ ఆర్థిక భారాన్ని మున్సిపాలిటీలపై పడకుండా 'స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్ కమ్ ఓనర్' స్కీమ్ ద్వారా చెత్తను సేకరించే ఇళ్ల నుంచే వసూలు చేయనుంది. వాణిజ్య, ఇతర వ్యాపార సంస్థల నుంచి చెత్త సేకరణకు ప్రత్యేకంగా చార్జీలను నిర్ణయిస్తారు. ఈ స్కీమ్ అమలు ద్వారా ఒక వైపు ఉపాధి అవకాశాలు, మరోవైపు వంద శాతం చెత్త సేకరణ లక్ష్యం నెరవేరుతుందని అధికార యంత్రాంగం భావిస్తున్నది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ప్రకారం వంద శాతం ఇంటింటి చెత్తసేకరణ చేపట్టాలని పురపాలక శాఖ నిర్ణయించింది.



స్టేట్ క్యాడర్‌లో 90% ఉద్యోగాలు స్థానికులకే

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టిజిఒ)విజ్ఞప్తి

మన తెలంగాణ/ హైదరాబాద్ : జోనల్ వ్యవస్థ స్థానంలో కొత్తగా తీసుకురానున్న రెండంచెల విధానంలో భాగంగా స్టేట్ క్యాడర్ ప్రభుత్వ ఉద్యోగాలను 90 శాతం స్థానికులకు రిజర్వ్ చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టిజిఒ)లు విజ్ఞప్తి చేశారు వచ్చే ఏడాది జూన్ 6 నాటికి పిఆర్‌ఎస్ ముగియనందున వెంటనే కొత్త పిఆర్‌సి వేయాలని డిమాండ్ చేశారు. నాంపల్లిలోని గెజిటెడ్ భవన్‌లో శనివారం టిజిఒ అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగిది. టిజిఒ రాష్ట్ర అధ్యక్షులు వి.మమత అధ్యక్షతన జరిగిన సమావేశానికి టిజిఒ చైర్మన్, ఎంఎల్‌ఏ వి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ తొలుత ప్రసంగించారు. సమావేశంలో చేసిన పలు తీర్మానాలను అనంతరం మీడియా సమావేశంలో వారు వెల్లడించారు. జిల్లాల పునర్విభజన తరువాత ఉద్యోగులపై భారం పెరిగిందని, కాబట్టి ఖాళీలను తక్షణమే ప్రమోషన్‌లు, భర్తీ ద్వారా నింపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పదవీకాలాన్ని ఎట్టి పరిస్థితుల్లో పొడగించవద్దన్నారు. ఇటీవల ఆంధ్రాకు చెందిన ఒక ఐఎఎస్ అధికారి మహబూబ్‌నగర్ జాయింట్ కలెక్టర్, అదే జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగిపై చేయి చేసుకోవడం పట్ల సమావేశం తీవ్రంగా పరిగణించింది. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్య సదుపాయాన్ని కల్పిస్తున్న వెల్ నెస్ సెంటర్‌లను అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరింది. సిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సమావేశం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెంటనే స్వరాష్ట్రానికి తీసుకురావాలని తీర్మానించింది.


ప్రభుత్వంపై నమ్మకముంది : హోంగార్డ్స్ అసోసియేషన్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తమకిచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తుందన్న విశ్వాసం తమకుందని, ఉద్యోగాలను శాశ్వతం చేయడం కానీ అందుకు తగినట్లుగా గుర్తింపు ఇవ్వడం కానీ చేస్తుందని తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం అధ్యక్షులు రాజేందర్, హైదరాబాద్ నగర అధ్యక్షులు కోత్వాల్ దయానంద్, సైబరాబాద్ అధ్యక్షులు అశోక్, నేతలు కుమారస్వామి, ఏడుకొండలు, హరిలు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొంత మంది తమలోని ఐక్యతను దెబ్బ తీసేందుకు సమ్మెకు వెళ్తున్నామని ప్రకటిస్తున్నారని, ఆ ప్రకటన చేసిన వారికి తమకు ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు పూర్తి న్యాయం చేస్తుందన్న విశ్వాసంతో ఉన్నామని పేర్కొన్నారు.

రైతులను పట్టించుకోని కెసిఆర్ ప్రభుత్వం

కిసాన్ మోర్చా వర్క్‌షాప్‌లో లక్ష్మణ్

మన తెలంగాణ/హైదరాబాద్: ఫసల్ భీమా యోజన కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చు చేసి ఉంటే 10 లక్షల మంది రైతులు లబ్ధి పొందేవారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వారికి మేలు చేయాల్సిన ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వచ్చే సంవత్సరం నుంచి ఎకరాకు ఎనిమిది వేల రూపాయలు ఇస్తామనడం దారుణమని విమర్శించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన కిసాన్ మోర్చ వర్క్‌షాప్‌లో లక్ష్మణ్ ప్రసంగించారు. గడచిన మూడేళ్ళుగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచేందుకు అన్ని విధాలా పాటుపడుతోందని, ఈనామ్ (ఈ మార్కెటింగ్ విధానం), ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన, రైతులకు బ్యాంక్ అకౌంట్లు,



రుణాల పంపిణీ, కొరతలేని యూరియా సరఫరా తదితర నిర్ణయాలు తీసుకున్నారని లక్ష్మణ్ గుర్తు చేశారు. ఎరువుల ధరలను తగ్గించడం, భూసార పరీక్ష కార్డుల జారీ లాంటి పలు చర్యలను తీసుకుందన్నారు. రైతులకు ఎంతో మేలు చేసే ఫసల్ భీమా యోజనను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వ తన వాటాగా రూ. 100 కోట్లను ఖర్చు చేసి ఉంటే దాదాపు 10 లక్షల మంది రైతులు లాభపడేవారన్నారు. విడతల వారీ రుణ మాఫీ రైతుల పాలిట శాపంలా మారిందని, బ్యాంకులు రైతులకు రుణాలివ్వడం లేదని, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. రైతులకు భరోసా కల్పించేందుకు కిసాన్ మోర్చా ముందుండాలన్నారు. రైతేరాజు అంటున్న రాష్ట్ర ప్రభుత్వ వారికి బేడీలు వేసి కుంగిపోయేలా చేస్తోందన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోలి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ, ఫసల్ భీమా యోజన రైతులందరికీ కల్పించాలంటూ వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి పి. సుగుణాకర్‌రావు, జాతీయ కార్యవర్గసభ్యులు ఎస్. జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పాపయ్యగౌడ్, కె. నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు సర్కారు ప్రణాళికలేంటి?

మన తెలంగాణ/హైదరాబాద్ : వర్షాభావ పరిస్థితులలో పంటలను కాపాడటానికి ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటో చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉంటే టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను దూషిస్తూ కాలయాపన చేస్తోందన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావుల మాట్లాడారు. పంటలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు లేవన్నారు. సిఎంకు రాష్ట్రంలోని వ్యవసాయ పంటల పరిస్థితులపై సమీక్ష చేసే సమయం కూడా దొరకడం లేదని, మరోవైపు మంత్రులకు వ్యవసాయంపైనే అవగానే లేదన్నారు. నిర్మాణంలో ఉన్న దేవాదుల, ఎస్‌ఆర్‌ఎస్‌పి ఆధునీకరణ, వరద కాలువ వంటి 34 ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. మూడు సంవత్సరాల టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రీ డిజైనింగ్ పేరుతో అంచనాలను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటిస్థాయి డెడ్‌స్టోరేజిగా ఉందన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే ఈ నెల 15 లోపు నేరెళ్ల ఘటన బాధితులను ప్రభుత్వం ఆదుకోకపోతే సిరిసిల్లలో ప్రభుత్వం కళ్లు తెరిపించే విధంగా టిడిపి ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.మీడియా సమావేశంలో టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్ కూడా పాల్గొన్నారు.



"న్యాయం తిరస్కృతికి గురైనప్పుడు, నిర్లక్ష్యం రాజ్యమేలుతున్నప్పుడు, వ్యక్తి హక్కును తృణీకరిస్తున్నప్పుడు వ్యక్తికికానీ, సమాజానికి కానీ రక్షణ ఉండదు.
–ఫ్రెడరిక్ డగ్లస్, ఆఫ్రోఅమెరికన్ రచయిత"

యు.పి. ఎమ్మెల్సీల ఫిరాయింపు

సంపాదకీయం

ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం కొత్తరకం రాజకీయం నడుస్తోంది. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు నలుగురు ఈ వారంలో రాజీనామా చేసి బిజెపిలో చేరారు. వారిలో ముగ్గురు అఖిలేశ్‌యాదవ్ సమాజ్‌వాది పార్టీకి చెందిన వారు కాగా, ఒకరు మాయావతి బిఎస్‌పికి చెందినవారు. ఇది బిజెపి అధ్యక్షుడు అమిత్ షా వ్యూహం. కొద్దిరోజులక్రితం ఆయన లక్నో సందర్శనకు వచ్చినపుడు ముగ్గురు రాజీనామా చేశారు. మొత్తం ఐదుగురు దారిలో ఉన్నారన్న వార్తల గూర్చి ప్రశ్నించగా ప్రస్తుతానికి ముగ్గురు అని ముక్తసరిగా సమాధానమిచ్చారు. సమాజ్‌వాది పార్టీకి చెందిన సరోజిని అగర్వాల్ శుక్రవారం రాజీనామా సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరి, అసెంబ్లీకి ఎన్నికై మంత్రివర్గంలో చోటు సంపాదించుకున్న యుపిసిసి పూర్వాధ్యక్షురాలు రీటా బహుగుణ సమేతంగా ఆమె మండలి అధ్యక్షుణ్ణి కలిసి రాజీనామా పత్రం అందజేయగా వెంటనే ఆమోదించారు. కొద్ది రోజుల్లో మరొకరు రాజీనామా చేయవచ్చు.

ఏమిటీ ఐదు సంఖ్య? ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రులు కేశవ మౌర్య, దినేశ్ శర్మ, సహాయమంత్రులు స్వతంత్రదేవ్‌సింగ్, మొహిసిన్ రజా శాసనసభ, శాసనమండలి–దేనిలోనూ సభ్యులు కారు. ఆదిత్యనాథ్, కేశవమౌర్య లోక్‌సభ సభ్యులు. రాష్ట్రంలో పదవులు నిలుపుకోవాలంటే లెజిస్లేచర్‌లోని ఏదోక సభలో సభ్యులయి ఉండాలన్న రాజ్యాంగ ఆదేశాన్ని సెప్టెంబర్ 18 లోపు ఆ ఐదుగురు నెరవేర్చాల్సి ఉంది. అందుకుగాను ప్రత్యక్ష ఎన్నికల రహదారిని విడిచిపెట్టి శాసనమండలి మార్గాన్ని ఎంచుకున్నారు. రాష్ట్రపతి ఎన్నికలో ఓటు చేసే నిమిత్తం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్‌తో పాటు యోగి, మౌర్యల లోక్‌సభ సభ్యత్వాన్ని బిజెపి కొనసాగించింది.

నాలుగు మాసాల క్రితం అద్భుతమైన విజయంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి తమ ముఖ్యమంత్రి సహా ఐదుగురు మంత్రులకు చట్టసభలో ప్రాతినిధ్యం కొరకు శాసనమండలి మార్గాన్ని ఎంచుకోవటం రాజ్యాంగ విరుద్ధం కాకపోయినా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమే. అంతేగాక, తమ ఎమ్మెల్సీల చేతగాక ప్రతిపక్ష ఎమ్మెల్సీలను ప్రలోభపెట్టి రాజీనామా చేయించటం అవినీతికరం, అనైతికం. అయితే మండలిలో తమ సభ్యులసంఖ్య అతి తక్కువగా ఉన్నందున ప్రతిపక్ష సభ్యులకుగాలం వేసినట్లు భావించవచ్చు. పాలకవర్గ పార్టీలకు ఇదేమీ కొత్తకాదు. యుపిఎ రెండు ప్రభుత్వాల ప్రధానిగా పదేళ్లు పనిచేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ రాజ్యసభ సభ్యుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన భవనం వెంకట్రాం శాసనమండలి సభ్యుడు. అయితే ఆ సందర్భాల్లో కాంగ్రెస్‌ను ఘాటుగా విమర్శించిన బిజెపి ఇప్పుడు యుపిలో అదే త్రోవలో వెళ్లటం హాస్యాస్పదంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నంతకాలం తమది భిన్నమైన పార్టీ అని చెప్పుకుంటూ వచ్చిన బిజెపి, అధికారం చేతికి అందివచ్చాక అడ్డదారులు తొక్కుతోంది. ఫిరాయింపులు ప్రోత్సహిస్తోంది.

యుపిలో ఈ అడ్డదారి ప్రయాణానికి కారణం ఊహించవచ్చు. ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులు అసెంబ్లీ ఉప ఎన్నికలకు వెళితే అది యోగి నాలుగు మాసాల పాలనపై రిఫరెండంగా పరిగణించబడే అవకాశముంది. శాంతి–భద్రతల నిర్వహణలో వైఫల్యం ఇప్పటికే తీవ్రవిమర్శలకు గురవుతోంది. రెండోవైపున, కలిసి పని చేయాలన్న భావాలు వ్యక్తం చేస్తున్న మాయావతి, అఖిలేశ్ యాదవ్‌లు పరస్పర సహకారంతో అభ్యర్థులను నిలబెట్టవచ్చు. అందువల్ల సురక్షితమైన శాసనమండలి మార్గాన్ని వ్యూహాత్మకంగా ఎంచుకున్నప్పటికీ, ప్రతిపక్షపార్టీల నాయకత్వంతో విసుగెత్తి వాటి సభ్యులు రాజీనామా చేసి బిజెపిలో చేరారని ప్రచారం చేసుకోవచ్చు. తమ పరిపాలనను మెచ్చి వారు బిజెపిలో చేరినట్లు చెబుతున్న నేతలు అనైతికతను నైతిక విజయంగా చెప్పుకోవచ్చు. అదే అమిత్ షా రాజకీయం!

'మచ్చ'గల జడ్జి సిజెఐ కావచ్చా?

చూపు


జస్టిస్ దీపక్ మిశ్రాను కేవలం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తి అయినందువల్ల తదుపరి ప్రధాన న్యాయమూర్తిని చేయడం తగునా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే ఆయనపై కూడని ఆరోపణలు ఉన్నాయి.

ఈ నెల 27న ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జెఎస్ ఖేహర్ పదవి నుంచి వైదొలగుతారు. ఆయన స్థానే తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మిశ్రా రానున్నారు. అయితే కేవలం సీనియారిటీ నిబంధన మేరకు ఆయనను ఆ ఖాళీలో నియమించడం తగునా అనే ప్రశ్న వస్తోంది. సిజెఐ రాజ్యాంగపరమైన ఉన్నత అధికారి. ఆయన 31మంది సుప్రీం కోర్టు జడ్జీలు, సుమారు 1000 మంది హైకోర్టు జడ్జీలు, దాదాపు 16,000మంది దిగువ స్థాయి జడ్జీలతో కూడిన దేశ న్యాయవ్యవస్థకు పెద్ద. సంక్లిష్టమైన, రాజ్యాంగ పరమైన అంశాలలో ఆయన అత్యున్నత న్యాయస్థానంలో తీర్పులు ఇస్తూ ఉంటారు. ప్రజాపాలనపై ప్రభావం చూపగల అంశాలు కూడా వాటిలో ఉంటాయి. 1.3 బిలియన్ ప్రజల జీవితాలతో ముడిపడిన బాధ్యతలు ఆయనవి. నిత్యం సివిల్, క్రిమినల్ అప్పీళ్లలో తీర్పులు ఇస్తూ ఉంటారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా న్యాయవ్యవస్థ పాలనా వ్యవహారాలు, న్యాయ వ్యవహారాలను పర్యవేక్షించే అత్యున్నతాధికారి ఆయన. ఒకోసారి రాజకీయంగా కీలకమైన అంశాలను కూడా బెంచ్‌లకు అప్పగిస్తారు.

సిజెఐ పదవి అత్యంత కీలకం

'న్యాయమూర్తులు కఠినంగా వ్యవహరించాల్సిన వారు. రాజకీయ, ఆర్థిక అధికారం ముందు తలవంచకుండా ఉండాలి. నియమాల ప్రకారం పాలన అనే కీలక సూత్రానికి బద్ధులై పనిచేయాలి' అని జడ్జీలకు సంబంధించిన మొదటి కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అటువంటి రెండో కేసులో 1993 ఇలా వ్యాఖ్యానించింది. 'ఉన్నత న్యాయమూర్తి పదవులలోకి పరిపక్వ వయస్కులను, మంచి నేపథ్యం న్యాయ వృత్తిలో ఖ్యాతి గలవారినుంచి ఎంపిక చేస్తారని మనందరకూ తెలుసు. విమర్శలకు తావు లేకుండా, నిజాయితీతో పనిచేసే వ్యక్తులు కావాలనే అత్యున్నత రాజ్యాంగ అధికారులకు జడ్జీల ఎంపికలో ప్రమేయం కల్పించారు. సందేహాలకు తావు లేనివారినే ఉన్నత పదవులకు ఎంపిక చేస్తారు. అందుచేత అత్యున్నత న్యాయమూర్తి పదవికి సందేహాస్పద నియామకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రాజ్యాంగ పెద్దలపై ఉంది.'

సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు న్యాయమూర్తుల నియామకం ప్రక్రియలో సిజెఐకి ఆ విధంగా అత్యంత ప్రధాన పాత్ర ఉంది. ప్రస్తుతం కాబోయే ప్రధాన న్యాయమూర్తిగా పేరు వినబడుతున్న జస్టిస్ దీపక్ మిశ్రా రుజువర్తనుడు కాదని వస్తున్న వార్తలు అచ్చెరువు గొలుపుతున్నాయి. 1979లో ఆయన రెండెకరాల వ్యవసాయ భూమి లీజుకు ఇవ్వాలని ఒడిషా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని కేటాయింపు పొందారు. అప్పుడు ఆయన న్యాయవాదిగా ఉన్నారు. అప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో తాను బ్రాహ్మణ కులస్థుడనని తెలిపారు. తనపేర, తన కుటుంబం పేర సొంత భూమి లేనే లేదని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆ తరువాత 1985లో కటక్ అదనపు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేటు ఆయనకు వ్యతిరేకంగా ఉత్తర్వు వెలువరించడంతో ఆ కేటాయింపు రద్దు అయింది.



మిశ్రా భూమిలేని వ్యక్తి కాదన్న ఎడిఎం

1962 ఒడిషా ప్రభుత్వ భూమి వివాదాల పరిష్కార చట్టం క్రింద ఉత్తర్వు వెలువడింది. భూమిలేని వ్యక్తి ఎవరు అన్న దానికి చట్టం చెబుతున్న నిర్వచనం క్రింద మిశ్రా అఫిడవిట్ చెల్లదన్నది ఆ ఉత్తర్వు సారాంశం. భూమి లేని వ్యక్తి, రెండెకరాలకు మించని వ్యవసాయ భూమిగల వాడు, వ్యవసాయం తప్ప వేరే జీవికలేనివాడు అన్న చట్టం నిర్వచనాన్ని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆ నియమాల ప్రకారం జస్టిస్ మిశ్రా భూమిలేని వారు కాదని పేర్కొన్నారు. ఆ విధంగా తహసీల్దార్ భూ కేటాయింపు ఉత్తర్వును కటక్ అదనపు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ (ఎడిఎం)1985 నవంబరు 2న రద్దు చేశారు. అయితే తహసీల్దార్ ఉత్తర్వుపై రికార్డులు 2012 జూన్ 1న సవరించారు. సిబిఐ ఇంకా ఏమని కనుగొన్నదంటే '1977–80లో కటక్ తహసీల్దార్ కార్యాలయం మౌజాలోని విద్యాధర్‌పురంలో కొన్ని తప్పుడు లీజు కేటాయింపులు జరిపిందని దర్యాప్తులో వెల్లడైంది. వాటిలో కొన్ని అక్రమ కేటాయింపులను కటక్ ఎడిఎం రద్దు చేశారు కాని లీజుదారులు ఆ యా భూములను ఖాళీ చేయలేదు. 1984–85లోనే ఆ లీజులు రద్దయినా రికార్డులు సరిదిద్దడం 2012లోనే జరిగింది'.

అనంతరం హైకోర్టు విచారణలు ఏమయ్యాయన్నది అస్పష్టంగా మిగిలింది. డిక్లరేషన్‌లో చేసిన తప్పుడు ప్రకటనను చట్ట ప్రకారం సాక్ష్యంగా స్వీకరించవచ్చు. తెలిసీ అటువంటి తప్పుడు ప్రకటన చేసి ఉంటే అది తీవ్రమైన నేరం. పిసి 200 సెక్షన్ క్రింద జరిమానాతో ఏడేళ్ల జైలు శిక్ష విధించదగ్గనేరమది. ఆ విధంగా జస్టిస్ మిశ్రా అటువంటి అఫిడవిట్ దాఖలు చేయడం తీవ్ర నేరం. మరో తీవ్రమైన అంశంలో కూడా జస్టిస్ మిశ్రా పేరు వినపడుతోంది. అది అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కాలిఖో పుల్ ఆత్మహత్య కేసు.

ఆ అంశంపై ఎటువంటి దర్యాప్తు జరగకపోయినా ఆ ఆత్మహత్యా లేఖ మాత్రం నిజం. సాక్ష్యాల చట్టం సెక్షన్ 32 క్రింద ఆత్మహత్య లేఖ బయటపడ్డాక విధిగా దర్యాప్తు జరిపి, అవసరం వస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి. ఒడిషా హైకోర్టులో ఇద్దరు సిటింగ్ జడ్జీలపై దర్యాప్తులో కూడా జస్టిస్ మిశ్రా పేరు ప్రస్తావనకు వచ్చినట్లు వార్తా పత్రికలు రాశాయి. ఈ వివాదాల నేపథ్యంలో అటువంటి వ్యక్తి అత్యంత బాధ్యతాయుత మైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి తగునా అన్న ప్రశ్న ఉదయిస్తోంది.

– శాంతి భూషణ్

సిరిసిల్ల చిందోళ్ళ దీనగాథ



గడ్డం దేవదాసు
అంబేద్కరిస్టు
96666 51179

పూర్వం నుండి మాదిగలకు చిందోళ్లకు అవినాభావ సంబంధం ఉంది. చిందోళ్ల యక్షగాన కళ సాంస్కృతిక జీవన విధానంలోనే మాదిగల జీవన విధానం ఆవిష్కరించబడింది. ఇందుకు జాంబవ పురాణమే నిలువెత్తు సాక్ష్యం. జాంబవంతునికి ఇద్దరు భార్యలైతే మొదటి భార్య కొడుకులు మాదిగలుగా, రెండవ భార్య కుమారులు చిందో ళ్లు (చిందు జింహ్వాడు) అని ఇతిహాస, పురాణ, భాగవత గ్రంధాలు తెలియజేస్తున్నాయి. దీని ప్రకారమే అయితే వీరిద్దరు అన్నదమ్ములు కావాలి. ప్రతి గ్రామంలో కూడా పెద్ద మాదిగ, చిన్నమాదిగ అని ఇరువురు ఉంటారు. నేడు చిందోళ్లను చిందుమాదిగలుగా పిలుస్తారనేది అన్ని జాతుల వారికి సుపరిచతమే. తోళ్ళ శుద్ధిలోగాని, చెప్పు లు కుట్టి, డప్పులు మూసే వాటిలో గాని, తాళ్ళు, తనుగులు, పగ్గాలు అల్లే ఏ పనుల్లో కూడా భాగస్వాములుగా చేరలేదు. దొరలు, పటేళ్లు, కాపుదానపు రైతులు, ఆసాముల కోసం వ్యవసాయ, సామాజిక, సాంస్కృతిక ఏ ఇతర ఉత్పత్తి పనులను, ఉత్సవాలను కూడా చిందులు చేసేవారు కాదు. ఒక విధంగా సవతి తల్లిబిడ్డలనే భావంతో ఈ వృత్తిలోనికి వారిని నిరాకరించి ఉండవచ్చు. అందువల్ల ప్రత్యేక వృత్తిగా యక్షగానాన్ని ప్రదర్శిస్తూ, మాదిగల పంచన జీవించాలనే ఆనాటి సామాజిక నియమానికి గురైయుండి ఉంటారు. ఇలా గుప్తుల కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు గత 1700 వందల సంవత్సరాలకు పైగా వివక్ష అనుభవిస్తున్నారు. కంచం పొత్తు తప్ప, మంచం పొత్తు లేని ఈ జాతి మాదిగల నుండి ప్రత్యేక జాతిగా ఆవిర్భవించడానికి ఈ పరిస్థితులే కారణం. బుద్ధుని కాలంలో మాదిగలు మగధ రాజులు, చిందోళ్లు (ఎస్‌సి, ఎస్‌టి, బిసి బిక్షాటకజాతుల వారు) బౌద్ధ భిక్షువులుగా ఉండేవారు కావచ్చు. భిక్ష, భిక్షువులు, భిక్షగాల్లు అనేవి బుద్ధుని కాలం నాటి పదాలు. మౌర్య సామ్రాజ్య పతనం తో బ్రాహ్మణ జాతి అధికృతలోకి వచ్చిన తర్వాత తీవ్రమైన అణిచివేత వలన మాదిగలు నిమ్నజాతులై (అంటరానివారు) చిందోళ్ళు ఇతరత్రా భిక్షాటన కులాల వారు కూడా (ఆ స్థాయికి సంబంధించిన) భిక్షగాళ్లుగా ఉనికిలోకి వచ్చారు. మన ముఖం మంచిగా లేక అద్దాన్ని పగలగొట్టుకున్నట్లు రామచంద్రపురంలోని కొంతమంది మాదిగలు చిందోళ్లపై వ్యవహరిస్తున్న తీరు అమానుషం. రాష్ట్రంలో చిందోళ్ల జనాభా లక్షకు పైగా ఉంటారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం చిందులను కూడగట్టితే రెండు గ్రామాల నిర్మాణానికి సరిపడేంత జనాభా ఉంటుంది. ఇలా ప్రతి జిల్లాలో లెక్కిస్తే 30 జిల్లాలలో 60 గ్రామాలు నిర్మాణమై 60 మంది సర్పంచ్‌లు, 120 మంది ఉపసర్పంచ్‌లు, డజను మంది యంపిటిసిలు, ఒక్కరో ఇద్దరో జడ్‌పిటిసిలు, వేలసంఖ్యల్లో వార్డు మెంబర్లుగా చిందోళ్ళు పంచాయితీరాజ్ వ్యవస్థలో ఉండేవారు. దూరదృష్టిలేని జాతులు నశించిపోతాయని డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగానే, ఏ రోజుకు ఆరోజే పొట్టనింపుకునే చిందోళ్లు (దగ్గరి దృష్టివల్ల) చైతన్యవంతులు కాకుండా, పోరాడకుండా దూరదృష్టిని కోల్పోతున్నారు. ఈ జాతి వారికి రాష్ట్రంలో విద్య తప్ప ఉద్యోగాలు లేవు, చట్టసభల్లోకి రాజకీయ ప్రవేశం లేదు. వ్యవసాయ భూములు లేవు, నివసించేందుకు చోటు కూడా లేక సంచార , అర్ధ సంచార జీవితాన్ని గడుపుతూ మాదిగల ఇండ్ల పంచన తలదాచుకుంటారు. రామచంద్రపురంలో చిందోళ్లకు చెందిన ఒక అమాయక వ్యక్తి భార్యను ఇద్దరు పిల్లల తర్వాత జిల్లెలకు చెందిన మాదిగ కులస్థుడు లేపుకొని బొంబాయికి పారిపోయాడు. 10 సం॥రాలు అక్కడే దాంపత్యం చేసి ఆ తర్వాత జిల్లెల్ల ఊరిలోకి వచ్చి దర్జాగా జీవిస్తున్న ఆ వ్యక్తి గురించి రామచంద్రపురం మాదిగలకు ఫిర్యాదు చేస్తే, తమ కులస్థుడని అతనికే మద్దతు ఇచ్చి, చిందోళ్ల కుటుంబానికి అన్యాయం చేశారు. మాదిగ, మాదిగ ఒక్కటేనని చాటుకున్నారు. జరిగిన అన్యాయాన్ని సిరిసిల్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తే నక్సలైట్ ఉద్యమంలో ఉన్న నీ తమ్ముడిని పట్టిస్తే నీ సమస్యను పరిష్కరిసా మని వారు షరతు పెట్టారు, బెదిరించారు. భార్యకన్న తమ్ముడే ముఖ్యమని భావించిన ఆ వ్యక్తి ఫిర్యాదును విరమించుకున్నాడు. రామచంద్రపురంలో చిందోళ్లు 20 కుటుంబాలు, 50 మంది జనాభా గల ఈ ఊరిలో తొలిసారిగా 2006 సం॥ లో గ్రామ పంచాయితీ ఎన్నికలలో ప్రేమానందం అనే వ్యక్తి వార్డుమెంబర్‌గా గెలిచాడు. ఎస్‌సిలలోని వార్డుమెంబర్ గా గెలిచిన వాళ్ల తప్ప సబ్బండ కులాలు కలసి ప్రేమానందం ఉపసర్పంచ్‌గా ఉండాలని ప్రతిపాదన చేస్తే, మమ్ములను అడుక్కొని తినేవాడివి, మమ్ములను ఏలుతావా! ఊరిలో ఉండాలనుకుంటే ఉపసర్పంచ్‌గా పోటీచేయ కూడదు, ఆ అవకాశం మా మాదిగలకే ఉండాలని బెదిరించగానే, తన అవ కాశాన్ని జారవిడుచుకొని బిసి కులానికి చెందిన పెద్దొళ్ల కిష్టయ్యకు ఆయన మద్దతు పలకడం మాదిగలు జీర్ణించు కోలేదు. రోక బలం, మూక బలం లేని చిందోళ్ల ప్రేమానందంకు తోటి కమ్యూనిటీ వాళ్లే వెన్నుతట్టి ఉండలేకపోయారు.

1996 లో రామచంద్రపురంలోని చిందోళ్ల నర్సయ్య అనే వ్యక్తి జిల్లెల్ల మాదిగలతో కలిసి ఆ గ్రామంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని సాధించుకొని 15 సం॥రాలు సాగుచేసుకున్నాడు. ప్రస్తుతం నర్సయ్య చనిపోయాడు. ఆయన భూమిని దౌర్జన్యంగా నవనింద దేవయ్య అనే మాదిగ వ్యక్తి 2014లో కబ్జా చేసుకున్నాడు. నర్సయ్యకు భార్య బిడ్డ తప్ప కుటుంబం లో ఎవరూ మిగలలేదు. 2 సంవత్సరాల వ్యవధిలోనే 5గురు కుటుంబీకులు వరుసగా మరణించారు. ఈ విషాద ఘట్టం నుండి ఆ కుటుంబం నేటికీ తేరుకోలేదు. మంత్రి కె.టి.ఆర్. స్పందించి, ఆ కుటుంబానికి తన పర్యవేక్షణలో అధికారులు తక్షణమే ఒక ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించడం వల్ల నీడ దొరికింది. కాని బువ్వ దొరకలేదు. మొత్తం ఆ ఊరి చిందోళ్లకు ఇండ్ల స్థలాలతో పాటు వ్యవసాయ భూమి సాధించుకోవాలనే సంకల్పాన్ని నేరవేర్చాలని మంత్రి కె.టి.ఆర్. కు ఆ కులస్థులు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసుకుంటున్నారు. రామచంద్రపురం గ్రామ వార్డు మెంబర్‌గా ఉంటూ, ప్రజాసేవకు అంకితమైన ప్రేమానందం ఆ ఊరి ఆవల సమా ధుల ప్రక్కన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ, వర్షాధార పంటలను అనుభవించే వాడు. చిన్నలింగ పురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థుడైన పిట్టల బాబు బెదిరింపులకు గురిచేసి ఆ 2 ఎకరాల ప్రభుత్వ భూమిని తన పట్టా భూమిలో కలుపు కొని అనుభవిస్తున్నాడు. జరిగిన అన్యాయానికి రామచంద్ర పురం మాదిగలను ఆశ్ర యిస్తే పిట్టల బాబుకు పరోక్షంగా మద్దతు ఇచ్చారు. ఆర్థిక, రాజకీయ, కుల, అంగబలం లేని ప్రేమానందంను క్షోభకు గురిచేసి అంటీఅంటనట్లుగా వ్యవహరించారు.

1989 లో రామచంద్రపురం సర్పంచి బొడ్డు ఎల్లయ్య మాదిగ అనే వ్యక్తి గ్రామంలో చిందోళ్లతో ప్రభుత్వ భూమి లో గుడిసెలు వేయించాడు. ఇది ఎంతో అభినందనీయం, బిసిల లోని అగ్రకుల దురహంకారానికి ఆ గుడిసెలు నేలమట్టమై నాయి. జనశక్తి పార్టీ జోక్యంతో బత్తుల మల్లయ్య కు మరి కొంతమంది పెత్తందారులకు చురకలు వేయగానే తగ్గి, చిందోళ్ల కాలనీ నిర్మాణానికి సహకరించారు. ఇప్పుడు ఎల్లయ్య మరణించి 12 సం॥రాలు గడిచింది. ఇతని పాలి వర్గీయులు, ఎల్లయ్య అంటే గిట్టని వాళ్లు చిందోళ్లకు సహక రించవద్దని, మరణిస్తే డప్పులు కొట్టవద్దని తీర్మా నించు కున్నారు. డప్పులు కొట్టడం కళనా, లేదా ?అవమానామా? కళ అయితే చిందోళ్లకు సహకరించాలి. అవమానమే అయితే ఏ కులానికి కూడా డప్పులు కొట్టకూడదు. చిందోళ్లకన్న తాము ఎక్కువ అనే భావం సరి యైంది కాదు. ఎస్‌సిలకు వచ్చే సబ్సిడీ రుణాలు సంక్షేమ పథకాలు చిందోళ్లకు అందకుండా ఆ పథకాలను ఆపుతున్నా రనే ఆరోపణ మాదిగలపై ఉన్నది. కాలనీకి వెళ్లే 30 ఫీట్ల రోడ్డుకు అడ్డంగా గౌడ కులానికి చెందిన తాళ్లపెల్లి కనకంబ రానికి రేకులషెడ్డు నిర్మాణానికి మాదిగలు సహకరించి, చిందోళ్లపైకి బిసిలను ఉసికొల్పారు. ఎస్‌సి, ఎస్‌టి కేసు పెడితే తన్ని ఊర్లోనుండి వెళ్లగొడతామని మాదిగలు బెదిరిం చారు. సిరిసిల్ల తహశీల్దార్ జోక్యంతో చిందోళ్ల కాలనీకి 30 ఫీట్ల రోడ్డు పునర్‌నిర్మాణం అయింది. ఇంత దారుణంగా చిందోళ్లపై ప్రవర్తించిన కొంతమంది మాదిగల తీరు బాధాకర మైనది. మాటల్లో చెప్పలేము. చిందోళ్ల కాలనీలో మాదిగల పెత్తనం పెట్రేగిపోతోంది. ఈ విషయం అంబేద్కర్ సంఘా లకు, బహుజన సమాజ్‌పార్టీకి, ఎం.ఆర్.పి.యస్. వాళ్లకు తెలి యజేసినా స్పందించ లేదు. నిమ్న కులానికి చెందిన ఈ చిందోళ్లపై అదే స్థాయికి చెందిన కొంతమంది మాదిగలు చేస్తు న్న అరాచకాలు, దౌర్జన్యకర సంఘటనలు ఆగకపోతే, ఆపకపోతే భవిష్యత్ పరిణామాలు ఎంతో తీవ్రంగా ఉండవచ్చు.

గత 20 సం॥రాలుగా జిల్లెల్ల గ్రామ పరిధిలో ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూములనుండి స్వంతంగా గృహ నిర్మాణ సముదాయం, తల రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వమని గత ప్రభుతావలను కోరినా ఇప్పుడు టి.ఆర్.యస్. ప్రభుత్వాన్ని కోరుతున్నా సర్కార్ కనికరించడంలేదు. ప్రభుత్వం భూమి ఇవ్వడం దేవుడు ఎరుగును కాని జిల్లెల్ల, రామచంద్ర పురం మాదిగలే మాకు అవరోధంగా మారినారు. డా॥ అంబేద్కర్ స్ఫూర్తితో జీవిస్తున్న చిందోళ్లు రాష్ట్ర వ్యాప్తంగా వృత్తికి స్వస్తి పలికి ఉన్నత మైన విద్యను అభ్యసిస్తున్నప్పటికీ వారిలో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. వ్యవసాయ భూములు లేవు. సరిగ్గా ఇండ్లు లేని వారి సంఖ్య వేల సంఖ్య లోనే ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా ఉంటే రామచంద్ర పురంలో స్త్రీ, పురుషులు దరిదాపు అందరు విద్యావంతులై ఉన్నారు. 9వ తరగతి నుండి మొదలుకొని పి.జి. డిగ్రీ, ఇంజ నీరింగ్ వరకు 20 మంది పిల్లలు చదువుతూనే ఉన్నారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ పుణ్యాన ఈ అవ కాశం చిందోళ్లకు లభించింది. చదువుకున్న ఈ విద్యావంతులు, శుచి, శుభ్రతను పాటిస్తే, తెల్ల చొక్కాలు ధరిస్తే, కుర్చీలపై కూర్చుం టే, బండ్లేసుకొని తిరిగితే ఎలా అనే ఈర్ష్య భావంతో మాదిగలు ఈ కులస్థులను దూషిస్తున్నారు, బెదిరిస్తున్నారు.

విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక తదితర రంగాలలో మాదిగల ద్వారా చిందోళ్లకు అన్యాయం జరిగితే, నేను చిందోళ్ల పక్షం ఉండి న్యాయం కోసం మాదిగలను ఎదిరిస్తాను. చిందోళ్ల ద్వారా మాస్టిన్ కులం వారికి అన్యాయం జరిగితే, నేను మాస్టిన్‌ల పక్షం ఉండి చిందోళ్లను ఎదిరిస్తాను. మాస్టిన్ కులం వారి ద్వారా డెక్కలి కులస్థులకు అన్యాయం జరిగితే, డెక్కలి కులం వారి పక్షం ఉండి న్యాయం కోసం మాస్టిన్ లను ఎదిరిస్తానని ఎస్‌సి వర్గీకరణ కోసం పోరాడు తున్నమాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాప కులైన మాన్యులు, గౌరవనీయులు శ్రీ మంద క్రిష్ణ మాదిగ వాగ్దానం చేశారు అని ఇది మాదిగ, మాదిగ లోని ఉపకులాల వారందరికీ తెలిసిన విషయమే. రామచంద్ర పురం మాదిగలు చిందోళ్లపై అనుసరి స్తున్న నీతిమాలిన వ్యవహారంలో ఆయన ఎవరి పక్షం వహిస్తారని ప్రశ్నిస్తు న్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల పరిధి లోని తంగళ్లపల్లి (సిరిసిల్ల) మండలంలోని రామచంద్ర పురం చిందోళ్ల దీనగాథను ప్రభుత్వం, ఎస్‌సి, ఎస్‌టి, కమిషన్ వారు ముఖ్యంగా మాదిగ జాతి నేత గౌ॥ శ్రీ మంద కృష్ణ మాదిగ, సామాజిక ఉద్యమ కారులు జోక్యం చేసుకొని ఈ ఆగడాన్ని నివారించాలని చిందులు కోరుతున్నారు.

ప్రజాసంబంధాల శిక్షణ మృగ్యం



డా. సి.వి.నరసింహారెడ్డి
సమాచార, ప్రజాసంబంధాల శాఖ మాజీ సంపాదకులు,
9246548901

''ప్రజాసంబంధాల వృత్తి విషయకమైన విద్య, శిక్షణ, అనుభవంతో తమ యాజమాన్యానికి లేదా క్లయింటుకు లేదా ప్రజలకు మార్గదర్శనం చూపే నిజమైన ప్రజా సంబంధాల వృత్తి నిపుణులని'' అమెరికన్ పబ్లిక్‌రిలేషన్స్‌కు ఆద్యుడైన ఎడ్వర్డ్ ఎల్. బెర్నేస్ అన్నారు. భారత్‌లో పి.ఆర్.వృత్తి నిపుణులు ఈ కొలమానాన్ని అంగీకరిస్తారా? అంటే నా సమాధానం అవును, కాదు రెండూ.

భారతదేశంలో ప్రజాసంబంధాల రంగం పరిమాణం ఆరు బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ॥ 35,000 కోట్లు. ఇది ఏటా 32 శాతం పెరుగుతుందని అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సర్వే తేల్చింది. భారతదేశంలో ప్రజా సంబంధాల రంగం స్థాయిని గురించి చెప్పాలంటే మిశ్రమమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. ఒక వైపు ప్రపంచంలో ఎవరికీ తీసిపోని రీతిలో అత్యంత నైపుణ్యం కలిగిన వారున్నారు. అదే సమయంలో తగిన ప్రజాసంబంధాల విద్యార్హత, శిక్షణ, అనుభవం లేని వారు కూడా గణనీయంగా వున్నారు. 40 శాతం మంది వృత్తి, నిపుణులకు మాత్రమే పి.ఆర్ విద్యార్హత వున్నట్లు ఒక విశ్వ విద్యాలయం చేసిన సర్వేలో తేలింది. అటువంటి వారు ప్రజా సంబంధాల వృత్తికి మంచి పేరు తేగలవారు సంఖ్యలో తక్కువగా వున్నారు. విద్యార్హత లేని వారిని 'స్పిన్ డాక్టర్స్‌గా' లేక 'మ్యానిపులేటర్స్' గా పరిగణిస్తారు. పి.ఆర్. నాణ్యత దృష్టితో చూస్తే నిలిచే వారు కారు. ఇప్పుడు కావలసింది వృత్తి పరమైన శ్రేష్టత, నైపుణ్యం. ప్రజా సంబంధాల వృత్తిలో రాణించడానికి విద్య, శిక్షణ, పరిశోధనలు త్రిగుణీకృతం గా సాగవలసిన అవసరం వుండగా, ఆ మాటే కానరావడం లేదు.

పి.ఆర్.విద్య: ఈనాడు మన ప్రజాసంబంధాల వ్యవస్థలో పి.ఆర్. విద్య, ''జర్నలిజం కోర్సులో ఒక భాగంగా వున్న పబ్లిక్ రిలేషన్స్ ఈనాడు విస్తారంగా, ప్రత్యేకమైన వృత్తిగా అభివృద్ధి చెందింది. ఇది జర్నలిజంలో భాగం ఎంత మాత్రం కాదు. ప్రజాసంబంధాలకోసం ప్రత్యేకమైన, స్వతంత్ర్యమైన కోర్సు చాలా అవసరం'' అన్నారు ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ డీన్ ఆచార్య పి.ఎల్. విశ్వేశ్వరరావు. మన దేశంలో ప్రజా సంబంధాల విభాగాలు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు మొదలుకొని జిల్లా కలెక్టరు వరకు విస్తరించాయి. ప్రభుత్వ ప్రతిష్టను పెంచడానికి ప్రజా సంబంధాల వ్యవస్థను ఇతోధికంగా వినియోగించుకుంటున్నప్ప టికి, ప్రజాసంబంధాల విద్య మాత్రం ఇంకా శైశవ దశలోనే వుంది. ప్రభుత్వ సహకారం ఏ మాత్రం లభించడం లేదు. 100కు పైగా విశ్వవిద్యాలయాల్లో కమ్యూనికేషన్, జర్నలిజం శాఖలు న్నాయి. ప్రజాసంబంధాలను జర్నలిజం కోర్సులో ఒక అధ్యయనాంశంగా మాత్రమే బోధిస్తున్నారు. ఒక అంశంగా చదువుకొన్న వ్యక్తి ఎవరైనా పూర్తిస్థాయి పి.ఆర్.ఓ.గా రాణించగలడా? అనేది ఒక పెద్ద ప్రశ్న. ఒక అంశాన్ని ఇక్కడ ప్రస్తావించక తప్పదు. హైదరాబాద్‌లోని డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఎ మాస్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కోర్సు ప్రారంభిస్తామని ప్రతిపాదన పంపితే ఆ కోర్సు తన ఆమోదిత కోర్సు జాబితాలో లేదని యు.జి.సి అందుకు తిరస్కరించింది. పాశ్చాత్యదేశాల్లో ప్రధానంగా అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనూ ఒక మేజర్ పాఠ్యాంశంగా, పి.జి స్థాయిలోనూ ఎం.ఎ పి.ఆర్, ఎం.ఎస్. సి.పి. ఆర్ వంటి కోర్సులను నిర్వహిస్తున్నారు. కాబట్టి మన దేశంలోని విశ్వవిద్యాలయాలు కూడా ఆ పద్ధతిలో పబ్లిక్ రిలేషన్స్ కోర్సులను ప్రవేశపెట్టాలి. ఆ కోర్సులకు అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠ్య పుస్తకాలు కూడా తేవాలి.

శిక్షణ : భారతీయ ప్రజాసంబంధాల్లో మరొక లోపమేమంటే ప్రజా సంబంధాల అధికారులకు ఉద్యోగ ప్రవేశ కాలంలోగాని, తర్వాత గాని ఎటువంటి శిక్షణ లేదు. నిజానికి అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలంటే వాళ్ళకు కావలసింది ప్రధానంగా శిక్షణ, తత్సంబంధిత పరిజ్ఞానం. దీనివల్ల మెరుగైన పనితీరుకు నాణ్యత మెరుగుదల, కార్యదక్షత సాధ్యమవుతుంది. ప్రజాసంబంధాల అధికారులు పంపే 90శాతం పత్రికా ప్రకటన లు, పత్రికల్లో ప్రచారయోగ్యంగా ఉండటం లేదని ఒక ప్రధాన సంపాదకుడు అన్నారు. ప్రతి కాపీని తిరగరాసుకోవాల్సి వస్తోంద న్నారు. ప్రజా సంబంధాల వృత్తి నిపుణులకు తగిన శిక్షణ ఉండాలనే ఆవశ్యకతను పై మాటలు సూచిస్తున్నాయి. సుమారు లక్షమంది ప్రజా సంబంధాల వృత్తి నిపుణులే కాకుండా వివిధ శాఖల పరిధిలో సుమారు మరో 40 లక్షలమంది కమ్యూనికేటర్స్ తమ విధి నిర్వాహణలో భాగంగా ప్రజలకు సమాచార అనుసంధాన కర్తలుగా ఉంటూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో, అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్రియాశీలంగా ప్రజలను ప్రభా వితం చేస్తున్నారు. ఇంతటి బృహత్తర విధుల్లోవున్న వీరికి తగిన శిక్షణ లేకపోతే తగిన ప్రభావం చూప లేరు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, న్యూఢిల్లీ తరహాలో రాష్ట్ర రాజధానుల్లో మాస్ కమ్యూనికేషన్ అకాడమీలను ఏర్పాటు చేసి ప్రజాసంబంధాల శిక్షణ, పరిశోధన కోసం కృషి చెయ్యాలి. కార్పోరేట్లు కూడా తమ పి.ఆర్. కమ్యూనికేషన్ సిబ్బంది శిక్షణ కోసం నిధులు కేటాయించాలి.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ అమెరికా ఒక ''ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ గైడ్'' ను వెలువరిస్తుంది. అందులో తమ సభ్యుల ప్రయోజనార్థం వృత్తివిద్యాకోర్సుల సమస్త సమాచారాన్ని, వాటిల్లో శిక్షణ వివరా లను ప్రచురిస్తుంది. అందులో సభ్యులు, శిక్షణ శిబిరాలు, ప్రసంగాలు, అంతర్జాతీయ పి.ఆర్. కాన్ఫరెన్సులు, టెలీ సెమినార్లు, ఇ–లెర్నింగ్ మొదలైన వివరాలుంటాయి. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా కూడా అటువంటి ట్రైనింగ్ మోడల్‌ను రూపొందించి అందజేస్తే, సభ్యు లు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం వుంటుంది.

పరిశోధనః మన దేశంలో ప్రజాసంబంధాల రంగంలో పరిశోధన, కార్యక్రమాల ప్రభావ విశ్లేషణ లేకపోవడం పెద్ద లోటు. నిజానికి ప్రజాసంబంధాల యావత్ ప్రక్రియ పరిశోధన, ప్రణాళిక, కమ్యూనికేషన్, మదింపు ఆర్‌పి సిఇ మోడల్ ప్రాతిపదికపై నడుస్తుంది. వీటిలో ప్రణాళిక, కమ్యూనికేషన్ వరకు పూర్తిగా వినియోగించుకుంటున్నారు. కాని పరిశోధనను మరియు మదింపును పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రతిష్టను పెంచుకొనేందుకు ప్రభుత్వాలు, కార్పోరేట్లు కోట్ల కొలది రూపాయలను అడ్వర్టయిజింగ్‌కు ఖర్చు చేస్తున్నాయి. కాని ప్రజలపై వాటి ప్రభావం గురించి అధ్యయనం లేదు. పి.ఆర్ క్యాంపెయిన్లను కూడా విశ్లేషించి అవి ఏ మేరకు ఫలితాలనిచ్చాయో మదింపు చెయ్యడం కూడా చాలా అవసరం.

పబ్లిక్ రిలేషన్స్ రంగం తన ప్రభావాన్ని గణాంకాల్లో సైతం వివరించనంతకాలం ఆ రంగానికి పూర్తి గౌరవం లభించదని బిబిడిఓ అనే ఒక అంతర్జాతీయ సంస్థ తన సర్వేలో తేల్చిచెప్పింది. కాబట్టి పరిశోధన పరిశ్రమతో కూడుకున్నదే కావచ్చు కాని పి.ఆర్ స్వభావాన్ని, ప్రభావాన్ని బట్టి సామర్థ్యాన్ని అంచనాగట్టే వాతావరణంలో అవరోధాలన్నిటినీ దాటి అద్భుత వృత్తి నిపుణులని పేరు పొందాలంటే దారి చూపేది పరిశోధన ఒక్కటే. ప్రతి ప్రజా సంబంధాల శాఖ, ప్రతి పి.ఆర్ సంస్థ ప్రజాసంబంధాల కార్యక్రమాల విజయాలను చాటి చెప్పడానికి పరిశోధనా విభాగాన్ని తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, విశ్వ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న మన దేశంలో ప్రజా సంబంధాల వృత్తికి ఉజ్వల భవిషత్తు ఉంది. అయితే ప్రభుత్వం, కార్పోరేట్లు ఒకవైపు, విద్యాసంస్థలు, పి.ఆర్ వృత్తి నిపుణుల సంఘాలు పి.ఆర్ విద్య, శిక్షణ, పరిశోధనకు తగిన నిధులిచ్చి వాటిని చేపట్టినప్పుడే ఆ భవిష్యత్తును అందుకోవడం సాధ్యం.

(నేడు జాతీయ ప్రజాసంబంధాల విద్యాదినోత్సవం)

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం

మన తెలంగాణ

మన

www.manatelangana.news

మనపేజీ మనందరిపేజీ

హైదరాబాద్ | ఆదివారం | 6 ఆగస్టు | 2017

మల్లన్న పట్నాల ఒగ్గు పూజారులు

కొంరెల్లిమల్లన్న, అయిలోని మల్లన్న పట్నాల సమయంలో ప్రధాన పూజారులుగా ఒగ్గు పూజారులే వ్యవహరిస్తారు. వీరు కురుమకులానికి చెందిన ఒగ్గుపూజారులు. మల్లికార్జునుని ఏ దేవాలయంలోనైనా ఈఒగ్గు పూజరులే కనిపిస్తారు. కురుమ కులస్థులు తప్ప వేరే కులం వారు ఒగ్గు పూజరులుగా వ్యవహరించలేరు. స్నానాదికాలు చేయకుండా సంప్రదాయ దుస్తులు, నుదుట పసుపు కుంకుమలు ధరించకుండా మల్లన్నపూజలు చేయరు.



మన తెలుగు వారి సంస్కృతిని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శనలిస్తుంటారు ఒగ్గు పూజరులు. తెల్లనిధోవతి. అంగీధరించీ.నడుముకు ఎర్రని వస్త్రము కట్టుకొని. బండారిపసుపును నుదుట దిద్దుకొని మల్లన్న పూజలు చేసేవీరు గొప్పకళాకారులు. గీతాలాపనలుచేస్తూ. మల్లన్న పట్నాలు వేస్తారు. వీరు ఢమరుకాన్ని పోలిన ఒగ్గువాద్యాన్ని ప్రధానంగా ఉపయోగిస్తూ. మధ్యమధ్యలో పిల్లనగ్రోవితో శ్రావ్యంగాశబ్దం చేస్తూ పాటలు పాడుతుంటారు. కాళ్ళకుగజ్జెలు , చేతిలోతాళాలు కంజీర మొదలయిన వాద్యాలను ఉపయోగిస్తూ పూజలో నలుగురి నుండి ఆరుగురు సభ్యుల వరకు ఉంటారు. మల్లన్న పట్నాలు వేసి చివరకు శివసత్తుల చేతపట్నం మొత్తాన్ని తొక్కిస్తారు. ఉదయం పూట స్నానమాచరించి ఎంతో నియమనిష్ఠలతో మాంసాహారాన్ని ముట్టకుండా ఉపవాసంచేస్తూ ఒగ్గుపూజరులు మల్లన్నపట్నాలు వేస్తారు. ఇంట్లోనే మల్లన్నదేవున్నినిలుపుకునే సమయంలో ప్రతిసంవత్సరం మల్లన్నబోనాల సమయంలో, బోనాల సంస్కృతిని మనం చూడగలం. మల్లన్న దేవుని పట్నాలు వేయడానికి పచ్చ, తెల్ల, పసుపు ద్రవ్యాలనుపయోగిస్తారు. తంగేడు చెట్టు ఆకులను సేకరించి ఎండబెట్టి పొడిచేసి పచ్చని ద్రవ్యాన్ని తయారుచేస్తారు. అలాగే తెల్లద్రవ్యంకోసం బియ్యంతో పిండిని తయారుచేస్తారు. పసుపు పిండి కోసం పసుపు కొమ్ములు తీసుకొని శుచి శుభ్రతతో పసుపును తయారుచేసి పట్నాలు వేయడానికి ఉపయోగిస్తారు. కోరుకున్నవారి ఇంటిముందు, ఇంటిలోపల, మల్లన్నగుడిలోపల, గుడిముందు పట్నాలు వేయడం ఉంటుంది. దేవుని ఆరాధనకు కొంరెల్లిమల్లన్న, అయిలోనిమల్లన్న, పట్నాల సమయంలో ప్రధాన పూజరులుగా ఒగ్గు పూజరులే వ్యవహరిస్తారు. వీరు కురుమకులానికి చెందిన ఒగ్గుపూజరులు. మల్లిఖార్జునుని ఏ దేవాలయంలోనైనా ఈఒగ్గు పూజరులే కనిపిస్తారు. కురుమ కులస్థులు తప్ప వేరే కులం వారు ఒగ్గు పూజరులుగా వ్యవహరించలేరు. స్నానాదికాలు చేయకుండా సంప్రదాయ దుస్తులు, నుదుట పసుపు కుంకుమలు ధరించకుండా మల్లన్న పూజలు చేయరు. వీరు పూజల కాలంలో, నిర్ణయించుకున్నవారాలలో, ఎట్టిపరిస్థితుల్లో మాంసాహారాన్ని ముట్టరు. ఉపవాస దీక్షతో పూజలు నిర్వహిస్తుంటారు. పరిశుభ్రతను పాటిస్తూ. పెద్దవాళ్ళు కనడినపుడు రెండుచేతులుజోడించి.శనార్తి అంటూ నమస్కరిస్తారు.ఇదే గొప్ప భారత సంస్కృతిగామనం అభివర్ణించవచ్చు. సాధారణంగా వీరి పూజల్లో బెల్లం, చక్కెర, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ లు ఎక్కువ గా ఉపయోగిస్తారు. వచ్చిన వారికి మామిడాకు.దారం.పసుపు ను ఉపయోగించి తయారు చేసిన. దేవుని ముందు పెట్టి పూజ లుచేసిన కంకణాలను కడుతుంటారు.వచ్చి నవారు దీనిని గొప్ప గౌరవంగా భావించి దేవుని కిమొక్కుతారు. వచ్చిన వారికి పూజ తర్వాత పసుపు బొట్టు పెట్టి బెల్లం పాశం అన్నం తినడానికి పెడతారు. బోనాలలో మల్లన్న పట్నాల పూజ లు నిర్వహించుకోదలచిన వారు ఇల్లును శుద్ధిచేసి, పూలతో ఆకులతో బాగా తప్పక అలంకరించుకోవడం కనబడుతోంది. పూజ, ఆహారసామగ్రిని ముందే పూజ రుల ద్వారా తెలుసుకుని సమకూర్చుకుంటారు.అన్నీతయారయిన తర్వాత ఒగ్గుపూజరులు వచ్చి బోనాలు.పట్నాలపూజలునిర్వహించుతారు. వచ్చినవారు. ఇంటి వారు పూజరులకు ఒసుకులు సమర్పించుకుంటారు. అంటే తమకు ఇష్టమైన దేవుని, మనుషుల పేర పైసలు చదివించుకుంటూ, పాటలు పాడించుకుంటారు. పూజరులు పాటల రూపంలో దేవుళ్ళను తలుస్తుంటారు. ముందుగా గణపతి ప్రార్థన చేసి, మల్లన్న కొలుపును ప్రారంభిస్తారు. ఏకులం వారైనా సరే తమ ఇంట్లో మల్లన్న దేవున్ని నిలుపుకొని పట్నాలు వేయించుకుంటారు. ప్రతి సంవత్సరం మల్లన్న బోనాలు చేస్తారు. అయితే మూడు లేదా అయిదు సంవత్సరాలకొక మారు మల్లన్న పట్నాలు వేయించుకుంటారు. ఇంకా మొక్కుకున్న మొక్కుబడి ప్రకారం మల్లన్న గుడులలో చిన్న లేదా పెద్దపట్నం వేయించి, పూజలు జరిపించి కొబ్బరికాయలుకొట్టి,

మల్లన్న కొలుపు పాటలు ఈ విధంగా ఉన్నాయి.

"ఎలకోటి ఎలకోటి రామా
గుండంల తానాలు- నీగుళ్ళె శివపూజలయితాన-
యి తండ్రీ
గౌండ్లోల్ల ఇంటికాడ- పెండ్లికొడుక వైతివి దేవ
మైసాచ్చీ పొగ దాగీ -మంటల మేలుకుంటున్నవు
గుగ్గిల్ల పొగ దాగి- గుళ్ళె కూసున్నవా తండ్రీ
బారెడు బారెడు -అకండజోతులు ఎలుగుతున్నయి
దేవా
జగ్గుమోతల్ల -జల్దీమేలుకోవు దేవుడా
కాలకర్త- జగమెల్లపూజలు సామి
పూజకు మారుగా- పువ్వోలె మేలుకో దేవా
అయిలోని గుళ్ళల ఆటకానివి దేవా
సట్టేడు వారాలల్ల- కార్తీక మాసాలల్ల
కీర్తి గలగ్గాలు- గడు గుడు కలగ్గాలు
గాలి గోపురాలు- గంగి గోవుల్ల
గంగ వాలు దేవా- మల్లన్నా
అరువైయారు వత్తులు -అల్లాలు బెల్లాలు
అరటి పండ్లు- టెంకాయ కొబ్బెర్లు దేవా
కోరినా పెరుగులు -బెల్లపు శాకాలు గాదు తండ్రీ
అయిదేళ్ళ ఉంగరాలు- గంపరాస ఉంగరాలు
మూడేళ్ళ గొలుసులు- ముత్తరాస ఉంగరాలు
ఏడేళ్ళ గొలుసులు- గంటెలు, మొలతాళ్ళు
నీపేరే సెప్పతే- నీళ్ళల్ల పుట్టవుట్టు
నిప్పుకు సెదలెక్కుతది గాదు దేవుడా" అంటూ దేవుని యొక్క మహిమలు, రూపకారం, ధరించే ఆభరణాలూ ఆరగించే ఆహారపదార్థాలను గురించి పాటలు పాడుతూ చివరకు మంగళం పాడుతారు ఈవిధంగా.. ..
"మంగళం మాదైవ రాణీ- మంగళం మా దేవరాణీ
ఆదుకో మల్లయ్య సామీ -మంగళం మాదేవ రాణీ
మంగళామాని పాడరమ్మ- మా మల్లయ్యకు
గద్దె మీద గూసున్న- గౌరమ్మకు
ఏడుగుళ్ళళ్ళ ఎల్లమ్మకు
శివ మంగళం నిత్య- శివ మంగళం
తిరుపతి ఎంకన్నకు -హారతివ్వరె"
అంటూ పాటలు పాడి ముగిస్తారు.

వేయించిన పట్నాన్నీ శివసత్తులచేత తొక్కిస్తారు. ఒగ్గు పూజరుల చేత మల్లన్న పూజలు జరిపించుకోవడం వలన భక్తులకు అంతా కలసి వస్తుందని అదృష్టంగా కూడ భావిస్తారు . భక్తులు, పూజరులు పరస్పరం కనబడినపుడు శనార్తి అంటూ నమస్కరించుకుంటారు. మల్లన్న పూజలు ఇంట్లోజరిపించుకున్నవారు కనీసం పది మందికైనా భోజనాలు సమకూర్చుతారు. అయిదు తీర్ల కూరగాయలు, పప్పుచారు, బెల్లపన్నం, చక్కెర అన్నంపెడుతూ భోజనాధికాలు నిర్వహించి సంతోషం పొందుతారు. దేవుని వద్ద గుమ్మడికాయను ఉంచి, మల్లన్నదేవున్ని ఇష్టదైవంగా పూజలు నిర్వహింపజేసేవారికి అంతామంచే జరుగుతుందనేది భక్తుల పూర్తి విశ్వాసం. మల్లన్న బోనాలు సంక్రాంతి పండుగ ముందు గానీ, తర్వాత గానీ రెండు మూడు రోజుల వ్యవధిలో ఎక్కువ ఆదివారం రోజున పూజలు నిర్వహింపజేస్కుంటారు. పట్నాలు వేయించుకునే వారికి ఒకవారం పాటు పెద్దపండుగ లాగా నిర్వహింపజేసుకుంటారు. ఈ పూజలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబింపజేస్తుంటాయి.

సాధారణంగా వీరి పూజల్లో బెల్లం, చక్కెర, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ లు ఎక్కువ గా ఉపయోగిస్తారు. వచ్చిన వారికి మామిడాకు.దారం.పసుపు ను ఉపయోగించి తయారు చేసిన. దేవుని ముందు పెట్టి పూజ లుచేసిన కంకణాలను కడుతుంటారు.వచ్చి నవారు దీనిని గొప్ప గౌరవంగా భావించి దేవునికి మొక్కుతారు. వచ్చిన వారికి పూజ తర్వాత పసుపు బొట్టు పెట్టి బెల్లం పాశం అన్నం తినడానికి పెడతారు. బోనాలలో మల్లన్న పట్నాల పూజ లు నిర్వహించుకోదలచిన వారు ఇల్లును శుద్ధి చేసి, పూలతో ఆకులతో బాగా తప్పక అలంకరించుకోవడం కనబడుతోంది. పూజ, ఆహారసామగ్రిని ముందే పూజ రుల ద్వారా తెలుసుకుని సమకూర్చుకుంటారు.అన్నీతయారయిన తర్వాత ఒగ్గుపూజరులు వచ్చి బోనాలు.పట్నాలపూజలునిర్వహించుతారు. వచ్చినవారు. ఇంటి వారు పూజరులకు ఒసుకులు సమర్పించుకుంటారు. అంటే తమకు ఇష్టమైన దేవుని, మనుషుల పేర పైసలు చదివించుకుంటూ, పాటలు పాడించుకుంటారు.

కాళ్లకు గజ్జెలు, ఢమరుకం, కంజీరతో దుమ్మురేపే కళాకారులు





డా|| రంగురాజ పాపయ్య
7674060367

చేతబడి పాలబడి...

చేతబడి చేస్తున్నారంటూ అవమానపరచడం, వేధింపులకు గురిచేయడం, దాడులు చేసి చంపడం వంటి అమానుష సంఘటనలు కొనసాగడం చాలా విషాదకరం. కొన్నిచోట్ల పండ్లు పీకేయడం, చెట్లకు కట్టేసి చావబాదడం జరుగుతోంది.

ఈ నెలలోనే హుస్నాబాద్ మండలం కొండాపూర్ కు చెందిన ఘంటా కొమరయ్య దంపతులపై చేతబడి అనుమానంతో గ్రామస్తులు దాడి చేసి చితకబాదారు. తీవ్ర అవమానానికి గురైన కొమరయ్య దంపతులు తమ పిల్లలకు ఉరివేసి తాము కూడా ఆత్మహత్య చేసుకున్నారు. ఇది తెలంగాణాకే పరిమితమైన సమస్య కాదు, ఇదే సంవత్సరం జనవరిలో ఆంధ్రాలోని పశ్చిమగోదావరి జిల్లాలోను ఇలాంటి సంఘటనే వెలుగు చూసింది. దెందులూరు మండలకేంద్రంలో చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో గ్రామస్తులు ఒక కుటుంబంపై దాడి చేశారు. చిలి శిరోమణి, అతని కుమారుడు అబ్రహం, అత్తమామలు ఈ దాడికి గురయ్యారు. వారి పండ్లు పీకి, చావబాదారు. ఇద్దరు మహిళలు తీవ్రమైన గాయాలతో విషమపరిస్థితికి చేరుకున్నారంటే ఈ దాడులు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

గత సంవత్సరం ఉత్తరప్రదేశ్ సమాజవాది పార్టీలో ములాయం సింగ్ యాదవ్ ఆయన కుమారుడు అఖిలేష్ సింగ్ యాదవ్ మధ్య అభిప్రాయభేదాలు, పార్టీ చీలిక వరకు వెళ్ళడం వగైరా పరిణామాల్లో ఆ పార్టీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ ఒక ప్రకటన చేస్తూ ఈ సంక్షోభానికి కారణం క్షుద్రశక్తులే అన్నాడు. శివపాల్ యాదవ్ తనను ముఖ్యమంత్రిగా చేయనందుకు ఆగ్రహించి ములాయంపై చేతబడి చేయిస్తున్నాడని ఆరోపించాడు. బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎన్నికలకు ముందు ఒక మంత్రగాడిని కలిసిన వార్త కూడా అందరు చదివే ఉంటారు. అలాగే దివంగత జయలలిత అనారోగ్యానికి కారణం క్షుద్రపూజలే అన్న వార్తలు బలంగా వినిపించాయి. మన సమాజంలో చేతబడుల భయాలు ఎంత బలంగా ఉన్నాయో అర్థం చేసుకోడానికి ఈ ఉదాహరణలు చాలు. అనేక రాకెట్లను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించినా మనం వాటికి పూజలు చేయకుండా ప్రయోగించలేం. ఎక్కడైనా కోసిన నిమ్మకాయ, కొన్ని పూలు కనబడితే భయంతో వణికిపోతాం. వాటిని అక్కడ పెట్టారని ఎవరిపైనైనా అనుమానం వస్తే చాలు వెంటనే గుంపుగా దాడి చేసి చంపేయడం కూడా మామూలైపోయింది. పండ్లు పీకేయడం, నాలుక కోసేయడం, సజీవదహనం చేయడం వంటివి చాలా మామూలుగా జరిగిపోతున్నాయి. చితకగొట్టడం, రాళ్ళతో కొట్టడం, మలమూత్రాదులు నోట్లో వేయడం, వివస్త్రలు చేసి ఊరేగించడం వంటివి జరుగుతున్నాయి. కాస్త గమనిస్తే ఈ హత్యలకు గురవుతున్న వారిలోను మహిళలు ఎక్కువగా కనబడతారు. అందులోను విధవలైన మహిళలు, పెళ్ళికాని స్త్రీలు, భర్త నుండి విడిపోయిన స్త్రీలు ఎక్కువగా ఉంటారు. సమాజంలో అత్యంత బలహీనమైన వర్గాలివి.

నిజామాబాద్ జిల్లాలో ఇటీవల ఒక మానసిక స్థిమితం లేని మహిళ మంత్రాలు చేస్తున్నదని భావించి ఆమెపై దాడి చేసి చావబాదారు. పోలీసులు అక్కడే ఉన్నా ఆమెను కాపాడలేదు. తమాషా చూశారని తెలిసింది. తీవ్రంగా గాయపడిన ఆమె ఆసుపత్రిలో మరణించింది. మార్చి నెలలో తూప్రాన్ మండలానికి చెందిన ఒక వ్యక్తిని గ్రామస్తులు చేతబడి చేస్తున్నాడని అనుమానించి చెట్టుకు కట్టేసి పండ్లు పీకేశారు. నాలుక కోసేశారు. చావబాదారు. ఆ దురదృష్టవంతుడు అక్కడే మరణించాడు. అదే నెలలో రంగారెడ్డి జిల్లాలోను తళారి మొగలమ్మ అనే మహిళపై, మెదక్ జిల్లాలో పిల్లి విఠల్ పై, మహబూబ్ నగర్ జిల్లాలో రాములుపై దాడులు జరిగాయి.


నల్లగొండ జిల్లాలో ఇద్దరు వృద్ధులను సజీవదహనం చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఒక వ్యక్తిని గొంతుకోసి గోదావరిలో పడేశారు. విజయనగరం జిల్లాలో ఒకవ్యక్తిని చావబాది చంపేశారు.



ఖమ్మం జిల్లాలో ఒక మహిళ చేతబడి చేస్తుందని ఆమె దోసిట్లో నిప్పులు పోశారు. కరీంనగర్ జిల్లాలో ఒక వృద్ధుడిని అమానుషంగా చంపేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక కుటుంబంపై దాడి చేసారు. గతంలో ఏడెనిమిది సంవత్సరాల క్రితం నార్కట్ పల్లి మండలం తొండాయి గ్రామంలో చేతబడి చేస్తుందన్న నెపంతో కన్నతల్లి తలనరికిన సంఘటన చోటు చేసుకుంది. అలాగే చౌటుప్పల్ మండలంలో ఇద్దరు వృద్ధులు మంత్రాలు, చేతబడులు చేస్తున్నారంటూ మహిళా సంఘాల సభ్యులే సజీవదహనం చేసిన సంఘటన అత్యంత కిరాతకమైనది. ఈ సంఘటన రాష్ట్రరాజధానికి 40 కిలోమీటర్ల దూరం కూడా లేని కైతాపురంలో జరిగింది. అత్యంత దారుణంగా, అమానుషంగా ఈ దాడులు జరుగుతున్నప్పటికీ సమాజం పట్టించుకున్నట్లు కనబడడం లేదు. రాజకీయనాయకులు ఈ వార్తలకు అస్సలు ప్రాముఖ్యత ఇస్తున్న సూచనలు లేవు. పోలీసులు చాలా సందర్భాల్లో తమాషా చూస్తున్నారు. బాణామతి పేరిట జరిగే ఈ హత్యలను పాతకక్షల కారణంగా జరిగిన హత్యలుగా లేదా ఆస్తి తగాదాల కారణంగా జరిగిన హత్యలుగా చూపించి వదిలేస్తున్నారు. అజ్ఞానం, అవిద్య వంటి కారణాల వల్ల చేతబడి, బాణామతి, మంత్రాలపై నమ్మకం వీళ్ళలో ఎక్కువగానే కనబడుతున్నది. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తున్న సూచనలేవీ కనబడ్డం లేదు.

మహారాష్ట్రలో ప్రముఖ హేతువాది నరేంద్ర ధభోల్కర్ హత్య తరువాత 2013 అగష్టు 24న ప్రభుత్వం మూఢనమ్మకాల వ్యతిరేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఇలాంటి చట్టం రావడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత కర్నాటక, అస్సామ్, తమిళనాడు రాష్ట్రాలు ఇలాంటి చట్టం అమలు విషయమై ఆలోచిస్తున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లలోను ఈ మూఢనమ్మకాలు కనబడుతున్నప్పుడు చదువులేని గ్రామీణ ప్రాంతాల్లో ఇవి మరింత ఎక్కువ ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఈ మూఢనమ్మకాల వల్ల ముఖ్యంగా బలహీనవర్గాలే బాధితులవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఫ్రీ లీగల్ ఎయిడ్ కమిటీ జాతీయస్థాయిలో ఒక చట్టం చేయాలని అనుకున్నప్పుడు ఈ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్ చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి: "మంత్రతంత్రాలకు సంబంధించిన ఈ సంఘటనల విషయంలో జాతీయస్థాయిలో చట్టం చేయడం తక్షణ అవసరం. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలతో సహా దేశంలోని పదిహేను రాష్ట్రాలకు చెందిన పదికోట్ల ప్రజలను వేధిస్తున్న సమస్య ఇది" అన్నారు.

జనవిజ్ఞానవేదిక వంటి సంస్థలు ప్రజల్లో చైతన్యం పెంచడం ద్వారా ఈ సమస్యను ఎదుర్కునే ప్రయత్నం చేస్తున్నాయి. అత్యంత దురదృష్టకరమైన విషయమేమంటే ప్రజాజీవితంపై తీవ్రమైన ప్రభావం వేసే టివి మాధ్యమం ఈ మూఢనమ్మకాలను పెంచే సీరియళ్ళను ప్రసారం చేయడం. క్షుద్రపూజలు, అతీంద్రియ శక్తులు వంటి మూఢనమ్మకాలను సీరియళ్ళలో చూపించడమే కాదు, సినిమాలు కూడా తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. 2015లో ప్రచార సమాచార ఫిర్యాదుల సంస్థ ఇలాంటి కార్యక్రమాల ప్రసారంలో జాగ్రత్తలు తీసుకోవాలని జి, కలర్స్, సన్, మా తదితర చానళ్ళకు హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. కాని ఈ హెచ్చరికలు భావప్రకటనాస్వేచ్ఛపై దాడి అన్న విమర్శలు కూడా మొదలయ్యాయి. స్త్రీలను మంత్రగత్తెలుగా, చేతబడులు చేసేవారిగా, దెయ్యాలు పట్టినవారిగా చూపించే కార్యక్రమాలు, సినిమాలు సమాజంపై ఎలాంటి ప్రభావం వేస్తున్నాయో పరికించాలి."జ్యోతిష్య కార్యక్రమాల ప్రసారాలను నిరోధించండి" అని గతంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారన్నది కూడా గమనించాలి. సృజనాత్మకతకు గౌరవమిస్తూనే వాటి ప్రభావం ప్రేక్షకులపై పడకుండా చూడాలి. హద్దు మీరినప్పుడు పరిస్థితులు శృతిమించే ప్రమాదం ఉంది. కథానుగుణంగా తప్పనిసరి అయినప్పుడు 'ఈ దృశ్యాలు పూర్తిగా కల్పితం..వీటిని ప్రోత్సహించడం మా ఉద్దేశం కాదు' అనే స్క్రోలింగ్‌ను వేయాలి'. కాని ఇంత చేసినా వాటి ప్రభావాన్ని తగ్గించలేం. జనవిజ్ఞానవేదిక, నాస్తిక కేంద్రం, ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ అండ్ ఎథికల్ యూనియన్ వంటి సంస్థలు ఈ మూఢనమ్మకాలను తగ్గించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా విజువల్ మీడియా ప్రభావం ఆ ప్రయత్నాలను వమ్ము చేస్తుందనే చెప్పాలి. ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ అండ్ ఎథికల్ యూనియన్ ప్రకారం 2010లో నేషనల్ క్రైం బ్యూరో లెక్కలే భారతదేశంలో ఈ దాడుల్లో చనిపోయిన మహిళల సంఖ్య 2500 అని చెబుతున్నాయి.మూఢనమ్మకాలను నమ్ముతున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వాహెద్
7093788843

చిరస్మరణీయుడు... జయశంకర్ సార్



నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ మట్టిగడ్డ తీర్చిదిద్దిన మహామనిషి, సైద్ధాంతిక పునాదిని ఏర్పర్చిన దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్. జీవితమంత ఒకే ఎజెండాతో జీవించిండు. తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాన్ని విధ్వంస మొనరిస్తున్న ఆంధ్ర వలస వాదానికి వ్యతిరేకంగా , ఈ ప్రాంత ప్రజల పక్షాన ఆయన వకాల్తా తీసుకుండు. ఎవరెంత రెచ్చగొట్టినా, మానసిక దాడికి దిగినా సంయమనం కోల్పోకుండా తన వాదనను ఏ మాత్రం తొణకకుండ, బెణకకుండా సూటిగా జవాబు చెప్పే మేధావి జయశంకర్ సార్... తెలంగాణ వాదులకు ఆయన జీవితమే ఒక స్ఫూర్తి. మొహం పై ఎప్పటికీ చెరగని చిరునవ్వుతో "తెలంగాణ ఎందుకు కావాలి?" అన్న దానికి సరళమైన వ్యవహారిక యాస భాషలో స్పష్టంగా, పూసగుచ్చినట్లు కొన్ని వేలాది సభలు, సమావేశాలలో కోటాది మందికి సార్ వినిపించిండు. నిజానికి ఆయన మన కళ్ళముందు భౌతికంగా లేకపోయినా ఎన్కటి ముచ్చట్లు ఎరుకపరచిన అంశాలన్ని మన కళ్లల్లో మెదులుతూనే వున్నయ్.

1952 లో అయ్యదేవర కాళేశ్వరరావు "ఆంధ్రా–తెలంగాణ" విలీన ప్రతిపాదన తెచ్చినప్పుడు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించిండు. దాంతో కాళేశ్వరరావు మీరు యువకులు, ఆవేశం తప్ప ఆలోచన ఉండదు. తెలంగాణ ప్రాంతం ఒక రాష్ట్రంగా విడిగా మనజాలదు– ఆంధ్రతో కలిస్తేనే తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయి అని అన్నడట. దానికి "మేము అడుక్కుతినైనా బతుకుతం కాని ఆంధ్రోళ్ళతో సోపతి కలువం" అన్నడు. 1969 లో ఉద్యమ సందర్భంలో ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి – నేను తలచుకుంటే నిన్ను ఇప్పుడే ఉద్యోగం నుండి తీసేయగలను అని మన సార్‌ను బెదిరించుచుండ జయశంకర్ సార్ ఏ మాత్రం జంకకుండ "నీ బల్లమీద పేపరుంది నీ జేబులో పెన్నుంది వెంటనే ఆ పనిచేయండి" అని సవాలు విసిరిండు. సార్ సాహసం చూసి బ్రహ్మానందరెడ్డి నోరెల్ల పెట్టిండు. పట్టరాని కోపం ఉంది గనుకనే ఆంధ్ర వలసవాదుల పాపాలను చిత్రగుప్తునోలే ఒక్కటి కూడా విడవకుండా చెప్పిండు. ఎంతో నెనరుగల్ల మనిషి గనుకనే బతుకంత తెలంగాణ దుక్కాన్ని, గోసను గుండెనిండా నింపుకుండు. "గాయపడ్డ కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో" అని రాసుకున్న మహాకవి దాశరథిని వలసవాదం ఎట్ల గాయపర్చిందో దాశరథి రాసుకోలేకపోయినా..కావ్యమెందో పెద్దసార్ విప్పిసెప్పిండు.

ఆయనది మేఘ గంభీర స్వరం. సప్రమాణమైన చర్చనే తప్ప, ఖచ్చితమైన తర్కమే తప్ప సభారంజకత్వం కోసం మాట్లాడే ఉపన్యాసం కాదు. భావన ఎంత స్పష్టంగా ఉంటదో వ్యక్తీకరణ కూడా అంతే స్పష్టంగా ఉంటది. ఉర్దూ మీడియంలో చదువుకున్న వాడు కాబట్టి ఉర్దూని ఒక మతానికి సంబంధించిన భాషగా ఎవరైనా అంటే సహించేవాడు కాదు. అది తెలంగాణ ప్రజల భాష అని చెప్పేవాడు. నిజానికి ఉర్దూలో ఆలోచించి, ఆంగ్లంలో అర్థం చేసుకుని తెలుగు భాషలో మాట్లాడేవాడు. ఒక మతానికి భాష ఉండవచ్చు. కాని ఒక భాషకు మతం ఉండదు అనేది అతని అభిమతం.

సార్‌లో గొప్ప హాస్య చతురత కూడా ఉంటది. ఒకసారి సార్ సభలో ఉపన్యాసం చెబుతుంటే ఒకతను లేసి ప్రసంగానికి అడ్డుతగిలి "తెలంగాణ వస్తే ఏమొస్తది సార్?" మళ్ళా గీ దొంగలే కదా మనల్ని పరిపాలించేది అని అన్నడు. దానికి సమాధానంగా సార్ చిరునవ్వుతో అవును ఈ దొంగలె పరిపాలిస్తురు. కాని దొంగలు తినంగ మిగిలింది ఇప్పుడు రాజమండ్రికి పోతున్నది తెలంగాణ వస్తే ఇక్కడనే ఉంటది అని అనంగనే సభలో ఉన్నవాళ్లంత ఒకసారిగా నవ్విండ్రు. ఒక సందర్భంలో మిమ్ముల్ని అందరూ "తెలంగాణ పితామహుడు" అని అంటున్నరని కేసియార్ చెప్పగా –సార్ నవ్వుకుంటు నేను పితామహుడిని కావలెనంటే ముందు పతిని కావాలె అని చమత్కారంగా అన్నడు. కేసియార్ దీక్ష సమయంలో జయశంకర్ సార్ కొండంత అండగా నిలిచిండు. చదివింది అర్థశాస్త్రం అయినప్పటికీ తెలుగు సాహిత్యంపై పూర్తి అవగాహన ఉంది. ఎన్నో సాహిత్య సంఘటనలను, కవిత్వాన్ని, పద్యాలను, కవులను అలవోకగా ఉటంకిస్తూ విషయాలు వివరించేవాడు. "తౌరాక్యాంధ్రం" పేరిట తెలంగాణలోని తెలుగును జంధ్యాల పాపయ్యశాస్త్రి లాంటి కవి పండితులు అవమానిస్తే, వారితో వాదనకు దిగి ఓడించినాడు జయశంకర్ సార్. తెలంగాణకోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి. ఆయన జీవితాన్ని పాఠ్యపుస్తకాలల్లో తీసుకురావడం సంతోసించదగ్గ విషయం. అంతేగాకుండా జయశంకర్ సార్ రాసిన ప్రతి అక్షరం అచ్చుకావాలి. చేసిన ప్రసంగ పాఠాలు, ఇచ్చిన ఇంటర్వ్యూలు సమగ్రంగా మరింతగా ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఎంతో వుంది.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
9441561655

సామాజిక రుగ్మతపై మహిళల్లో చైతన్యం



మనతెలంగాణ/హైదరాబాద్: గ్రామాలలో సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి విలేజ్ ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్లు (వివోఎ) కృషి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వివోఎలకు ప్రభుత్వం రూ. 3వేల గౌరవ వేతనాన్ని మంజూరు చేసిన నేపథ్యంలో వివోఎలు ఓల్డ్ ఎంఎల్ఎ క్వార్టర్స్‌లో మంత్రిజూపల్లి కృష్ణారావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వివోఎలకు ప్రస్తుత ఏడాది ఏప్రిల్ నుంచే రూ.3వేల గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,836 మంది ప్రయోజనం పొందనున్నారన్నారు. ఉపాధి హామీ, హరితహారం లాంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివోఎల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా సంఘాలలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా చూడాలన్నారు.

నెరవేరని ఘనమైన లక్ష్యం

● రాష్ట్రంలో ఆర్‌బిఎస్‌కె అమలులో బాలారిష్టాలు





మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రారంభదశలో రోగాలను గుర్తిస్తే సత్వర చికిత్స చేయడంతో పాటు ఆరోగ్య సమాజ నిర్మాణ లక్ష్యంతో ఘనంగా ప్రారంభించిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)అమలులో అనేక అవాంతరాలను ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు, 29,156 ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లోని అప్పుడే పుట్టిన శిశువు మొదలు 18 సంవత్సరాల లోపు పిల్లల్లో జబ్బులను గుర్తించి చికిత్స చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా వ్యాధులు, లోపాలు, వైకల్యాలు, ఎదుగుదలలో జాప్యాన్ని ఈ కార్యక్రమం క్రింద గుర్తించాల్సి ఉంది. కార్యక్రమం అమల్లోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ పలు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. స్క్రీనింగ్ కోసం ఉద్దేశించిన ఒక మొబైల్ టీంతో పాటు 90 మంది ఎంబిబిఎస్, ఆయుష్ వైద్యులు, 56 మంది ఫార్మాసిస్టులు, 29 మంది ఎఎన్‌ఎంలు, 39 మంది డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డిఇఐసి)సిబ్బందిని భర్తీ చేసుకోలేదు. పథకాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు నియమిత సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. మొబైల్ టీమ్స్ 300 కాగా అందులో 183, వైద్యులు 600కు గాను 335 మందికి, ఫార్మాసిస్టులు 300 మందికి గాను 145, ఎఎన్‌ఎంలు 300 మందికి గాను 118 మందితో పాటు డిఇఐసి మొత్తం సిబ్బంది 130 మందికి ఇంకా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. పథకం అమలు కోసం పూర్వ జిల్లాల్లో జిల్లాకు ఒకటి చొప్పున 10 డిఇఐసిలను అందుబాటులోకి తేవాల్సి ఉండగా, ఇప్పటికీ నాలుగు డిఇఐసిల నిర్మాణం పూర్తి కాగా, 6 నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిలో మార్గదర్శకాల ప్రకారం పరికరాలు ఒక డిఇఐసిలో మాత్రమే ఉండడం గమనార్హం. వీటికి తోడు తరచుగా ఆర్‌బిఎస్‌కె సిబ్బందిని ఇతర సేవలకు వినియోగించుకుంటుండడంతో క్షేత్ర స్థాయిలో పథకం అమలు అంతంత మాత్రంగానే జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ల కొరత కారణంగా పలు జిల్లాల్లో ఆర్‌బిఎస్‌కె మెడికల్ సిబ్బందిని వారాలు, నెలల తరబడి వాడుకుంటున్నట్టు తెలుస్తోంది. దీనితో ఆర్‌బిఎస్‌కె క్రింద అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేయాల్సిన పరీక్షల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. పథకం అమలులో వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల సహకారం అవసరం. అయినప్పటికీ మిగిలిన శాఖల అధికారులకు ఈ పథకం, సిబ్బంది పనిపై అవగాహన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ముఖ్యంగా విద్యా శాఖ, ఐసిడిఎస్ విభాగం, ఆశా వర్కర్లు తదితరుల మధ్య సమన్వయం కుదిరేందుకు నిర్దేశిత సమయంలో శాఖల మధ్య తప్పనిసరి సమావేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనితో పథకం ప్రత్యేకతపై అవగాహన కల్పించేందుకు ప్రచారం కల్పించాలని కోరుతున్నారు. వివిధ విభాగాల వారితో కలిసి పని చేయాల్సిన క్రమంలో తగిన గుర్తింపు కార్డు లేకపోవడం కూడా ఇబ్బంది కరంగా మారుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన అత్యవసర ఔషధాలను పూర్తి స్థాయిలో మొబైల్ టీమ్స్‌కు సరఫరా చేయకపోవడంతో చిన్న, చిన్న రోగాలకు కూడా మందుల కోసం బాధితులను పిహెచ్‌సిలకు పంపాల్సి వస్తుందని సిబ్బంది చెబుతున్నారు.

సిబ్బంది అసంతృప్తి

ప్రతిష్టాత్మక పథకంలో పని చేస్తున్న తగిన ఉద్యోగ భద్రత లేదని సిబ్బంది అసంతృప్తిలో ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల కన్నా చాలా తక్కువగా జీతాలు చెల్లిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న మొబైల్ హెల్త్ టీమ్స్ గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్, పిఎఫ్‌తో పాటు వ్యక్తిగత ప్రమాద బీమా కోరుతున్నారు. ఇప్పటికే విధులు నిర్వహించి వస్తున్న సమయంలో వరంగల్‌కు చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన ఫార్మాసిస్ట్ సువర్ణలు ప్రమాద బారిన పడ్డారని, దీనితో ఆ కుటుంబాలకు దిక్కు లేకుండా పోయిందంటున్నారు. అదే విధంగా టిఎస్‌పిఎస్‌సి ద్వారా జరిగే నియామకాల్లో వెయిటేజీని ఇచ్చి ప్రోత్సహించాలని ఆర్‌బిఎస్‌కె సిబ్బంది ఆశిస్తున్నారు.

కరీంనగర్‌లో మెడికల్ కాలేజీ కోసం పొన్నం దీక్ష

● దీక్షకు అనుమతి ఇవ్వకపోవడం దారుణం ● జన్మనిచ్చిన గడ్డను మరిచిపోయావు ● ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు ● సియం కెసిఆర్ పై సిఎల్‌పి నేత జానారెడ్డి ధ్వజం

మనతెలంగాణ/కరీంనగర్‌ప్రతినిధి: తెలంగాణ సిద్ధించాలనే ప్రజల ఆశయం నెరవేరినా స్వపరిపాలన మాత్రం అప్రజాస్వామికంగా కొనసాగుతుందని సిఎల్‌పి నేత కె. జానారెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావానికి నాంది పలికి, తనకు పునర్జన్మనిచ్చిన కరీంనగర్‌ను ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర్‌రావు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన ధ్వజమెత్తారు. శనివారం మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ హామీని అమలు చేయడంలో విఫలమైయ్యారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలలో కరీంనగర్‌కు మెడికల్ కళాశాల వస్తుందన్న నమ్మకం లేదని, తాము అధికారంలోకి రాగానే ప్రజాభిష్టం మేరకు ఇక్కడ కళాశాల ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు. కరీంనగర్‌ను లండన్ మాదిరిగా, ఇక్కడి రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతానన్న ముఖ్యమంత్రి హామీ ఏమైందని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రజల ఆశయానికి అనుగుణంగా సభలు, సమావేశాలు, నిరసనలకు అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో, అహంకార భావంతో పాలన సాగిస్తూ నిరసనలు తెలిపేందుకు సైతం అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిదికాదన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని అనుమతి కోరితే పోలీసులు శాంతి భద్రతలకు భగం కలుగుతుందని నిరాకరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కొనసాగుతుందా లేదా అని ఆయన కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. దీక్ష శిబిరం వద్దకు విద్యార్థులు రాకుడదని ఆకాంక్షలు విధించడం ఎంత మేరకు సమాజసమన్నారు. ఉద్యమాలను అణచి వేయాలని చూస్తే అది ప్రభుత్వ పాలన అనిపించుకోదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మసలుకోవడాన్ని ప్రభుత్వం తన కర్తవ్యంగా భావించాల్సి ఉంటుందన్నారు. కరీంనగర్ ప్రజలు మెడికల్ కళాశాల కావాలని గొంతెత్తి చాటుతున్నా అదేది ప్రభుత్వానికి వినపడడం లేదని అన్నారు. పొన్నం ప్రభాకర్ మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేపడతానని తెలిపినప్పటికి ఈ విషయంలో స్పందించకపోవడం సీఎం కేసీఆర్ మూర్ఖత్వానికి నిదర్శమన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు కాంగ్రెస్ ఉద్యమిస్తుందన్నారు. సిఎల్‌పి ఉపనేత జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానం ప్రకారం సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించన ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగ ఉల్లంగ చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ అనే శనిని ఎంత తొందరగా వదులుకుంటే తెలంగాణకు అంత మంచిదని అన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పుడు మెడికల్ కళాశాల మంజూరు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ వచ్చక కరీంనగర్ మెడికల్ కళాశాల ఇచ్చి తీరుతామని అన్నారు. కాంగ్రెస్ అండలేనిది తెలంగాణ రాలేదని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ జెఎసి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి తెలంగాణ సాధిస్తే ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నేరవేర్చక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ నిజమైన తెలంగాణ ద్రోహిగా ఉన్నారన్నారు. ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడుతున్న సీఎం కేసీఆర్ ప్రజలే గుణపాఠం చెప్పుతారని హెచ్చరించారు. విభజన చట్టంలో తెలంగాణకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వాలని ఉన్నప్పటికి కేంద్రానికి డిపిఆర్ పంపించని అసమర్థుడని మండిపడ్డారు. కరీంనగర్ మెడికల్ కళాశాల ఏర్పాటుకు పొన్నం చేపట్టిన ఆమరణ నిరహార దీక్షకు కాంగ్రెస్ అండంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగానే ముందుకు సాగుతున్నామన్నారు.

వెంకయ్య విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఎఐసిసి అధ్యక్షురాలు సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్ ఇతర ప్రధాన పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

ఓటేయ(లే)ని ఎంపిలు

విజయ్ గోయెల్ (బిజెపి), సన్వర్ లాల్ జాట్ (బిజెపి), అను అగా (నామినేటెడ్), నబా కుమార్ శరానియా (ఇండిపెండెంట్), అబ్దుల్ వాహబ్ (ఐయుఎంఎల్), పికె కున్హలికుట్టి (ఐయుఎంఎల్), కునాల్ కుమార్ ఘోష్ (టిఎంసి), తపాస్ పాల్ (టిఎంసి), ప్రతిమ మొండల్ (టిఎంసి), అభిషేక్ బెనర్జీ (టిఎంసి), మౌసమ్ నూర్ (కాంగ్రెస్), రాణే నారహ్ (కాంగ్రెస్), ఉదయన్ రాజే భోంస్లే (ఎన్‌సిపి), అన్బుమణి రాందాస్ (పిఎంకె).

వెంకయ్యకు మోడీ ప్రశంసలు

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన వెంకయ్యనాయుడుకి ప్రధాని మోడీ అభినందనలు తెలపడంతో పాటు ఆయన్ను ప్రశంసలతో ముంచెత్తారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్య అంకితభావంతో, పట్టుదలతో జాతినిర్మాణ లక్ష్యానికి కట్టుబడి పనిచేస్తారనే విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. తన మనసంతా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ వెంకయ్యతో కలిసి పనిచేసిన అనుభవాలతోనూ, జ్ఞాపకాలతోనూ నిండిపోయిందని, తమ అనుబంధం మరింత వికసిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకయ్యకు అభినందనలు తెలిపిన సోనియా గాంధీ...రాజ్యసభలో చట్టాల సమర్థవంతమైన పరిశీలన, ప్రభుత్వ విధానం పరంగా కాంగ్రెస్ తన వంతు మద్దతిస్తుందని ఆమె అన్నారు. వెంకయ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు.

ఢిల్లీ భేటీలో కెటిఆర్ నిరసన

(మొదటిపేజీ తరువాయి)

జిఎస్‌టి 18 శాతం పన్నును ప్రతి పాదించిందని, ఈ ప్రతివాదనపై తీవ్రంగా నిరసన తెలియజేసినట్లు కెటిఆర్ వెల్లడించారు. ప్రజ్యాస్వామ్య ప్రభుత్వానికి ఉన్న ప్రాథమిక కర్తవ్యం ప్రజలకు తాగునీరు, వ్యవసాయదారుడికి సాగునీరు, పేదవారికి ఉండేందుకు ఇళ్లను నిర్మించడం అన్న ఆయన, ఆర్ అండ్ బి, పంచాయిత్ రాజ్, మునిసిపల్ శాఖలు ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా ముందుకుసాగాలని కోరారు. ప్రజలకు మౌలికవసతులు కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరసల్లో నిలిచిందని, ఇప్పటికే 2 లక్షల 30 కోట్ల కు పైగా అభివృద్ధిపనులు సాగుతున్నాయని తెలిపారు. వ్యాట్ 5 శాతం చొప్పున తెలంగాణాలో పలు పనులు ప్రారంభించామని, కొత్తగా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించిన 18 శాతం పనులతో రాష్ట్ర ప్రభుత్వంపై 19 వేల 200 కోట్ల భారం పడనున్నట్లు వెల్లడించారు.ఈ ప్రతిపాదనపై అవసరమైతే న్యాయస్థానానికి సైతం వెళ్తాం గానీ, ఈ ఒప్పుకోమని శనివారం జరిగిన 20వ కౌన్సిల్ సమావేశంలో గట్టిగా నిరసన తెలిపామన్నారు.ఈ పన్ను పరిధిని యధాతథ స్థితికి తీసుకురావాలని కోరామన్న కెటిఆర్, దీనిపై స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి 18 నుంచి 12 శాతానికి తగ్గించేందుకు ఒప్పుకున్నారని అన్నారు. తెలంగాణలో టెండర్ అయిపోయిన పనులపై 5 శాతం వ్యాట్ నేకొనసాగించాలని పట్టుబడినట్లు కెటిఆర్ వెల్లడించారు. ఈ అంశంపై ఆలోచిసామన్న కేంద్ర ఆర్థిక మంత్రి, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను పంపిస్తే పరిశీలిస్తామని అన్నారని కెటిఆర్ తెలిపారు. భవిష్యత్‌లో రాబోయే పనులపై మాత్రం 18 నుంచి 12 శాతానికి పన్నులను తగ్గించడానికి ఒప్పుకున్నారని, తెలంగాణ డిమాండ్ కు జార్ఖండ్, రాజస్థాన్, పంజాబ్, వెస్ట్ బెంగాల్, గుజరాత్ రాష్ట్రాలు మద్దతు పలికాయని అన్నారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్, సిరిసిల్లో అపైర్ల్ పార్క్ నెలకొల్పనున్న నేపథ్యంలో టెక్స్ టైల్స్ రంగంపై జీఎస్టీ భారాన్ని తగ్గించాలని కోరామన్నారు. చేనేత రంగంలో జాబ్ వరక్స్ పై పన్నును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అంగీకరించారని కెటిఆర్ తెలిపారు. గ్రానైట్, బీడీ రంగంపై పడుతున్న భారాన్ని సైతం తగ్గించాలని కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశామని, జీఎస్టీ కౌన్సిల్ 21 సమావేశాన్ని హైద్రాబాద్ లో నిర్వహించాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి అంగీకరించారని, సెప్టెంబర్ 9 న 21 జీఎస్టీ కౌన్సిల్ సమావేశం హైద్రాబాద్ లోజరుగు కెటిఆర్ వెల్లడించారు.

ఐటి మత్తుపై కన్ను

(మొదటిపేజీ తరువాయి)

వీటిల్లో ఎంత మంది తరచూ కమింగోతో మాట్లాడారన్న విషయాన్ని తెలుసుకోవాల్సి ఉందని అంటున్నారు. నగరంలో పేరొందిన పలు ఐటి కంపెనీలకు చెందిన వారితో కమింగోకు పరిచయాలున్నాయన్న విషయాన్ని నిర్ధారించుకున్నప్పటికీ ఆ పరిచయం ఐటీ సహాయం కోసమేనా? లేక డ్రగ్స్‌తో ఏమైన లింకులున్నాయా అన్న విషయాన్ని తేల్చాల్సి ఉందని అంటున్నారు. అయితే ఖచ్చితంగా కమింగో కొంత మంది ఐటి నిపుణులకు డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు గుర్తించామని, ఇందుకు మరికొన్ని ఆధారాల కోసం ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ఆధారాలు తేలితే ఐటి రంగంలోని వారిని కూడా విచారించేందుకు సిద్ధమని అధికారులు పేర్కొంటున్నారు. కమింగోను తరచూ ఎవరు కలిసేవారు, అతడు హైదరాబాద్‌కు ఎలా పరిచయమయ్యాడనే విషయాలను కూడా తెలుసుకునే ప్రయత్నాలలో అధికారులున్నారు. కెల్విన్ తరచూ గోవాకు వెళ్ళాడని, అదే సమయంలో కమింగో కూడా వెళ్ళినట్లు ప్రాథమిక ఆధారాలను అధికారులు సేకరించారు. అయితే వీరిద్దరూ గోవాలో ఎవరిని కలిసే వారన్న విషయంపై దృష్టి కేంద్రీకరించారు. కమింగో కొన్ని క్లబ్‌లలో పార్టీలను కూడా నిర్వహించాడని, ఈ పార్టీలకు కెల్విన్ కూడా వచ్చాడని తేలింది. అయితే పబ్‌లలో జరిగిన పార్టీలకు వచ్చిన వారెవరనే విషయాన్ని కూడా తేల్చే పనిలో అధికారులున్నారు. ఏయే పబ్‌లలో కమింగో పార్టీలను నిర్వహించాడనే విషయాన్ని కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం మీద కమింగో వెల్లడించే అంశాల ఆధారంగా ఐటి రంగంలోని వారిని కూడా విచారించేందుకు సిట్ సన్నద్ధమవుతుందన్న విషయం స్పష్టమైంది.

చర్చలే శరణ్యం

(మొదటిపేజీ తరువాయి)

'సంవాద్ గ్లోబల్ ఇన్షియేటివ్ ఆన్ కాన్‌ఫ్లిక్ట్ అవాయిడెన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కాన్షియస్‌నెస్' రెండో ఎడిషన్‌ని పురస్కరించుకుని పంపిన ఒక వీడియో సందేశంలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. 'ప్రస్తుత 21వ శతాబ్దపు అంతర్‌అనుసంధాన, అంతర్‌పరాధీన ప్రపంచం ఉగ్రవాదం మొదలుకుని పర్యావరణ మార్పు వరకు అనేక అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆసియా అత్యంత పురాతన సంప్రదాయాలైన చర్చల, సంప్రదింపుల ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నా విశ్వాసం' అని ప్రధాని అన్నారు. తాను క్లిష్టమైన సమస్యలకు చర్చల ద్వారా పరిష్కారం లభిస్తుందని బలంగా విశ్వసించే పురాతన భారతీయ సంప్రదాయం నుండి ఉద్భవించిన వ్యక్తి అని ఆయన చెప్పుకొచ్చారు. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, ప్రహ్లాదుడు లాంటి పురాణ పురుషుల గురించి మోడీ ప్రస్తావించారు. వారంతా ధర్మాన్ని కాపాడటమే ప్రధాన విధిగా ఎంచుకున్నారని, ఆ ధర్మమే భారతీయులను పురాతన కాలాల నుండి నేటి నవీన యుగాల వరకు నిలబెడుతూ వస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యావరణం పట్ల అవగాహన పెంచుకుని, దాని పరిరక్షణకు పాటు పడకుంటే మానవాళి భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

కేశవరం, లక్మాపూర్‌లకు నిధులు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేశవరానికి రూ.12.26 కోట్లు, లక్మాపూర్‌కు రూ.15.50 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులను విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల 8న సిఎం కెసిఆర్ లక్మాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

జలరాలు కాని జూరాల

(మొదటిపేజీ తరువాయి)

ఎగువ ప్రాంతమైన కర్నాటక నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రాష్ట్రంలో సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జూరాలలో పూర్తిస్థాయి నీటిమట్టం 9.65 కాగా, ప్రస్తుతం 5.65టీఎంసీలు, శ్రీశైలం పూర్తి నీటిమట్టం 215.807 టీఎంసీలు కాగా, ప్రసుత్తం 19.62 టీఎంసీలు, నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 116.10టీఎంసీలు కాగా, ప్రస్తుతం 32.045టీఎంసీలు మాత్రమే నీరు జలాశయాల్లో అందుబాటులో ఉన్నాయి. అదే కర్నాటకలోని ఆల్మట్టిలో పూర్తి స్థాయి నీటిమట్టం 129.72 కాగా, ప్రస్తుతం జలాశయంలో 128.19 టీఎంసీలు ఉంది. అధే విధంగా నారాయణపూర్‌లో పూర్తి స్థాయి నీటిమట్టం 37.44 టీఎంసీలు కాగా ప్రస్తుతం 37.12 టీఎంసీలు ఉంది.

అంటే ఈప్రాజెక్టులన్నీ పూర్తి నీటిమట్టాలతో నిండి ఉన్నాయి. మరోవైపు జూరాలా ప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వాస్తవానికి కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌లో పూర్తి స్థాయి నీటిమట్టాలు ఉన్నపుడు మిగిలిన నీటిని బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం మిగిలిన నీటిని దిగువనున్న ప్రాంతాలకు విడదుల చేయాలని చెబుతుంది. బచావత్ ట్రిబ్యునల్ 75శాతం నీటి నిల్వ ఆధారంగా మొత్తం 2130టీఎంసీలల్లో మహరాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లకు నీటి కెటాయింపులను చేసింది. మహరాష్ట్రకు 585టీఎంసీలు, కర్నాటకకు 734టీఎంసీలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలను కెటాయించింది. అయితే మనం ఎపుడు కూడ కెటాయించిన నీటిని వినియోగించుకోలేదు. కారణం ఎగువనున్న కర్నాటక యథేచ్ఛగా జల చౌర్యానికి పాల్పడుతూ ట్రిబ్యునల్ కేటాయింపులకే తూట్లు పొడుస్తుంది. గతేడాది తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా కర్నాటక ప్రభుత్వానికి వినతి చేసినా కేవలం ఒక టీఎంసీని మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం జూరాల కింద 50వేలు, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద 2లక్షల ఎకరాలకు సాగునీరు పారడం సందేహంగానే కనిపిస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి రోజుకు 11వేల క్యుసెక్కులు నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరితే వారం రోజుల్లో పూర్తి స్థాయి అంటే 9.85టీఎంసీలకు చేరుకుంటుంది. ప్రస్తుతం ఎగువ ప్రాంతం నుంచి కేవలం 6వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చిచేరుతుంది. ఇది కూడా ఎప్పటి వరకు వస్తుందో తెలియని పరిస్థితి. మరోవైపు జూరాల నుంచి ఎడమ, కుడి ప్రధాన కాలువలు, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, సమాంతర కాలువలకు ప్రతిరోజూ 4వేల పైచిలుకు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అంటే వస్తున్న నీటిని వచ్చినట్లుగా కిందికి వదులుతున్నారు.

గొర్రెకు 2 వేలు

(మొదటిపేజీ తరువాయి)

తమకు కమిషన్ ఇస్తే ఎక్కువ ధరకు గొర్రెలను కొనగోలు చేయిస్తామని చీకటి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. దీంతో కొనుగోలు బృందం అక్కడికి చేరుకున్నపుడు గొర్రెల దొరకడం లేదంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఎక్కువ ధర పెడితేనే దొరుకుతున్నాయంటూ ప్రచారం చేస్తున్నారు. ముందుకు ఒప్పందం కుదుర్చుకున్నఅమ్మకందారుల వద్దకు డాక్టర్లు తీసుకెళ్ళి, మామూలు రేటు కంటే అధికంగా కొనుగోలు చేయిస్తున్నారు. ఈ విషయం ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది.

మహబూబాబాద్ జిల్లాకు చెందిన గార్ల మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు నేరుగా అనంతపురం వెళ్లి గ్రామాల్లో తిరిగి గొర్రెలను కొనుగోలు చేసారు. అయితే డాక్టర్లు చూపించిన గొర్రెలను ఒక్కొక్కటి రూ. 7 వేలు అంటగడుతున్నారని వెంకటేశ్వర్లు అనే లబ్ధిదారుడు తెలిపారు. అయితే, తాము సమీపంలో వేరే చోట్ల తిరిగినప్పుడు రూ.5200లకే గొర్రెలు దొరికాయని చెప్పారు. తమకు బలవంతంగా ఎక్కువ ధరకు గొర్రెలను కొనుగోలు చేయిస్తున్నారని కొందరు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా వ్యాపారులు వరంగల్ జిల్లాలోని గొర్రెలనే తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని అనంతపూర్‌కు తీసుకెళ్లి ,తిరిగి వాటినే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. వరంగల్ రూరల్ జిల్లా నుంచి రెండు వ్యాన్‌లలో గొర్రెలను తీసుకపోతుండగా పట్టుకున్నామని రెవెన్యూ అధికారులు చెప్పడం ఇందుకు బలాన్ని చేకూరుస్తుంది. గొర్రెల కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

జిఎస్‌టిపై కోర్టుకు

(మొదటిపేజీ తరువాయి)


తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి కె.తారకరామారావు మరో సారి ప్రభుత్వం తరపున వాదనలను వినిపించారు. నీటిపారుదల, తాగు నీరు, గృహ నిర్మాణం, రహదారుల నిర్మాణం లాంటి కార్యక్రమాలకు జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఈ నాలుగు అంశాలపై జిఎస్‌టిని 18 నుండి 12 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులకు కూడా జిఎస్‌టిని 12 శాతం వర్తింపజేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే, ఈ నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకించింది.

రూ.19వేల కోట్ల నష్టం

దీనిపై సిఎం కెసిఆర్ మాట్లాడుతూ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జిఎస్‌టి వర్తింపజేయడం అన్యాయమన్నారు. జూలై ఒకటికి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకు జిఎస్‌టి వర్తింపజేయడం వల్ల రూ.19వేల నష్టం జరుగుతుందని సిఎం అన్నారు.

కేవలం తెలంగాణ రాష్ట్రమే కాకుండా, అన్ని రాష్ట్రాలు ఈ నష్టం ఎదుర్కొంటాయన్నారు. దీనిని జాతీయ సమస్యగా సిఎం పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత తీసుకున్న నిర్ణయం కావడం వల్ల అమలు కష్టమన్నారు. ప్రాజెక్టుల వ్యయాన్ని బడ్జెట్‌లో పొందుపర్చాల్సి ఉంటుందని, అదిప్పుడు సాధ్యం కాదని అన్నారు. జిఎస్‌టి వర్తింపుతో అంచనా వ్యయాలు పెరుగుతాయని, దీనిని ఇప్పుడు బడ్జెట్‌లో పొందుపరచలేమని తెలిపారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

స్టాట్‌జెమ్‌తో ఎసిసిఎ అవగాహన ఒప్పందం




మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయ ఫైనాన్స్ కెరీర్ అవకాశాలను కల్పించే దిశగా స్టాట్‌జెమ్, అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ ఎక్కౌంటెంట్స్ (ఎసిసిఎ)ల మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది.

ఎక్కౌంటెన్సీ, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న స్టాట్‌జెమ్ సిఇఓ మహేష్ మాట్లాడుతూ, యువ ప్రొఫెషనల్స్ వేగంగా వృద్ధి చెందుతున్నారని, ప్రతిభావంతులు ఇప్పుడు అంతర్జాతీయ కంపెనీల్లో పనిచేయాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కామర్స్ విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని జోడించడానికి ఈ ఒప్పందం కచ్చితంగా ఉపయుక్తమవుతుందని అన్నారు.

రాజ్‌భవన్‌లో ఉదయం 11 నుంచి రాఖీ సంబరాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాఖీ పండుగను పురస్కరించుకుని ఈనెల 7వ తేదీ సోమవారం నాడు తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ పాఠశాల విద్యార్థులతో రాఖీలు కట్టించుకోనున్నారు. ఇందుకోసం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గవర్నర్ అందుబాటులో ఉండనున్నారని ఆయన కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.



మన తెలంగాణ/హైదరాబాద్: గూర్ఖల్యాండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ప్రతినిధులు హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కలిశారు. ఉద్యమ ప్రతినిధులు ప్రమోద్‌బోడోల్యాండ్, స్వప్నజిత్ సన్యాల్ తదితరుల బృందం కోదండరామ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

రోడ్ కటింగ్‌కు ఆన్‌లైన్‌లో అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్ : రోడ్ కటింగ్‌కు ఆన్‌లైన్‌లోనే ధరఖాస్తు, తనిఖీ, అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్యాన్సర్‌కు నొప్పి లేని చికిత్స

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రాచీన ఆయుర్వేదం ద్వారా క్యాన్సర్‌కు నొప్పి లేని చికిత్సను అందిస్తున్నట్లు డిఎస్ రీసెర్చ్ సెంటర్ వైద్యులు ఆయుర్వేదాచార్య డాక్టర్ బి.దివ్యశ్రీ లక్ష్మి , డైటీషియన్ కల్పనారాణి పెదగోపు తెలిపారు. నగరంలోని డిఎస్ రీసెర్చి సెంటర్‌లో శుక్రవారం ప్రాచీన ఆయుర్వేదం ద్వారా క్యాన్సర్ చికిత్సను జయించిన రోగుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పలువురిని నయం చేయడం జరిగిందన్నారు. క్యాన్సర్‌కు మూలాల్లోంచి చికిత్స అందిస్తే తగ్గుతుందని నిరూపించామన్నారు. సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా అందరికీ అందుబాటు ధరల్లో చికిత్స అందిస్తున్నామన్నారు.



కెసిఆర్ మొండి అయితే... నేను జగ మొండి : పొన్నం ప్రభాకర్

మన తెలంగాణ/కరీంనగర్‌టౌన్: అమ్మ...ఆశీర్వాదం ఉంది... జిల్లా ప్రజల ఆశీస్సులు ఉన్నాయి అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకే ఆమరణ దీక్ష చేపట్టన్నాను. సీఎం కేసీఆర్ మొండి అయితే నేను జగ మొండి అని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తన నివాసం ఎదుట మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా సీఎం కరీంనగర్‌లో మెడికల్ కళాశాల మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ ని గుర్తుకు చేసుకుంటు వస్తున్నాని అన్నారు. అయినా కరీంనగర్ ప్రజల ఆకాంక్షను తుంగలో తొక్కి నూతన జిల్లాల ఏర్పాటుతో సిద్దిపేట జిల్లాలో మెడికల్ కళాశాలకు అనుమతులు ఇచ్చి నిధులు కేటాయించారన్నారు. కరీంనగర్ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం ఇచ్చిన మాటాను నిలబెట్టుకోవాలని తాను ఉద్యమిస్తూ గుర్తు చేస్తూ ఉంటే కొందరు టిఆర్‌ఎస్ మూర్ఖులు, దద్దమ్మలు పొన్నం ప్రభాకర్‌ది రాజకీయ డ్రామా అంటున్నారని, అసలు ఎవరి డ్రామ ఏమింటో తెలంగాణ ప్రజలకు తెలిసని అన్నారు. తాను చేపట్టిన దీక్షకు రాజకీయ కారణం కాదని సమస్య పరిష్కారమే లక్ష్యమని అన్నారు. కళాశాల ఏర్పాటు కోసం ఎంతటి త్యాగానికై సిద్ధమేనని అన్నారు

హోంమంత్రి నాయిని అల్లుడిపై పెద్దిరెడ్డి ఘనవిజయం



మన తెలంగాణ/హైదరాబాద్/షాపూర్‌నగర్; కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయమని టిఎన్‌టియుసి నాయకులు పెద్దిరెడ్డి అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో జరిగిన సూపర్‌మాక్స్ పరిశ్రమ ఎన్నికల్లో హోంమంత్రి మేనల్లుడు శ్రీనివాస్ రెడ్డిపై టిఎన్‌టియుసి నాయకులు పెద్దిరెడ్డి ఘనవిజయం సాధించారు. కుత్బుల్లాపూర్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్‌మాక్స్ పరిశ్రమలో శనివారం పరిశ్రమ యూనియన్ ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికల్లో టిఎన్‌టియుసి నుంచి పులిగుర్తు పై పెద్దిరెడ్డి పోటిచేయగా,హెచ్‌ఎంఎస్ నుంచి రాష్ట్ర హోం మంత్రి అల్లుడు శ్రీనివాస్ రెడ్డి చక్రం గుర్తు పై, సిఐటియు నుంచి చుక్కారాములుతో పాటు మరో ఇండిపెండెంట్ అభ్యర్ధి పోటీలో నిలిచారు. శనివారం పరిశ్రమలో జరిగిన ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఎన్నికలకు లేబర్ కమిషన్ సిబ్బంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.మొత్తం పరిశ్రమలో ఓట్లు 1,038 ఉండగా,1,032 పోలయ్యాయి,ఈ పోలీంగ్‌లో హెచ్‌ఎంఎస్‌కు 315 పోలవ్వగా, టిఎన్‌టియుసికి 433 సిఐటియూకు 278 ,ఇండిపెండెంట్ 1 ఓటు పోలయ్యాయి.ప్రధానపోటి టిఎన్‌టియుసి కి హెచ్‌ఎంఎస్ మధ్యే ఉండ టంతో 118 ఓట్ల ఆధిక్యంతో టిఎన్‌టియుసి నాయకులు పెద్దిరెడ్డి , శ్రీనివాస్ రెడ్డిపై విజయ ఢంఖా మోగించారు. కార్మికులు యూనియన్ పై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటామని అన్ని వేళలా వారికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పెద్దిరెడ్డి అన్నారు. అనంతరం జీడిమెట్ల నుంచి గాజులరామారం వరుకు జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు చంద్రశేఖర్ రెడ్డి,సురేష్, ఎల్లాగౌడ్,వెంకట్‌రెడ్డి,మధు,అప్పారావు భారీ ర్యాలీ నిర్వహించారు.

జలమండలి ట్యాంకర్ల మెరుపు సమ్మె

నీరందక అవస్థలు పడ్డ బస్తీవాసులు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : హైదరాబాద్ మహానగరంలో ట్యాంకర్ల నీటి సరఫరాకు బ్రేక్ పడింది. ఇంధనం, నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం చెల్లిస్తున్న దానికంటే అదనంగా రూ.100 చెల్లించాలని డిమాండ్ చేస్తూ జలమండలి వాటర్ ట్యాంకర్స్ అసోసియేషన్ మెరుపు సమ్మెకు దిగింది. దీంతో శనివారం నగరంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపిపోయి మురికివాడ ప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. జలమండలి ఆధ్వర్యంలోని 900 ట్యాంకర్ల ద్వారా పైపులైన్ వ్యవస్థలేని బస్తీలలో ప్రతి రోజు 200 ఉచిత ట్రిప్పుల ద్వారా అక్కడి ప్రజలు నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే తాగునీరు సరఫరా కొన్ని బహుళ అంతస్తుల భవనాల యాజమాన్యాలు కూడ ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తారు. డొమెస్టిక్ కేటగిరిలో సరఫరా చేసే 5వేల లీటర్ల ట్యాంకర్‌కు బోర్డు రూ.400 వసూలు చేస్తోంది. ఇందులో బోర్డుకు రూ.170 , రవాణా చార్జీల కింద ట్యాంకర్ యజమానికి రూ.230 వస్తుంది. వాణిజ్య కేటగిరిలో 5వేల లీటర్ ట్యాంకర్‌కు రూ.700 వసూలు చేస్తున్నారు. ఇందులో బోర్డుకు రూ. 470, ట్యాంకర్ యజమా నికి రూ.230 చెల్లిస్తున్నారు. రోజు సగటున 1500 ట్యాంకర్ల ద్వారా బుక్ చేస్తుంటారు. సమ్మెతో ఉచిత ట్యాంకర్లు సరఫరా చేసే బస్తీలకు నీళ్లు రాక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా 2013 ట్యాంకర్ల చెల్లింపును పెంచుతూ జలమండలి నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత పలు దఫాలు చర్చలు జరిపినా, పెంపు అమలు చేయలేదు. కొన్ని రోజుల క్రితం కూడ బోర్డు కమిటీలో ట్యాంకర్ల యజమానులు చర్చలు జరిపారు. రూ. 150 పెంచాలని డిమాండ్ చేయగా, రూ.100 పెంచేం దుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. అయితే పెంపు ఇంకా అమలుకు నోచుకోపోవడంతో ట్యాంకర్ల యజమానానులు సమ్మెకు దిగారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మన తెలంగాణ/ నేరడిగొండ : మండలంలోని బోరిగాం పంచాయతీ పరిధిలోని ఎసుగూడ గ్రామానికి చెందిన ఉయిక దుసంత్‌రావ్ (17) అనే ఇంటర్ విద్యార్థి శుక్రవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేరడిగొండ ఎస్‌ఐ సాయిరెడ్డి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఎసుగూడ గ్రామానికి చెందిన ఉయిక సుంగు కుమారుడైన దుసంత్‌రావ్ ఇంటర్‌లో ఫెయిలయ్యి తండ్రితో వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి సుంగు చదువుకోవాలని మందలించాడు. మనస్తాపానికి గురై పురుగుల మందుతాగగా కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 11 గంటలకు మృతి చెందాడని తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి

మన తెలంగాణ/సారంగాపూర్ : విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన శనివారం ఆదిలాబాద్ జిల్లా సారంగపూర్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రేచపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల లచ్చనాయక్ తండాకు చెందిన లావుడ్యా మదన్‌లాల్ (45) అనే రైతు తమ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళి మోటార్ ఆన్ చేశాడు. విద్యుదాఘాతంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని స్థానిక తహసీల్దార్ వసంత, ట్రాన్స్‌కో ఎఇ చేరుకొని వివరాలు సేకరించారు. మృతునికి భార్య గంగవ్వ, కుమారుడు సతీష్, కూమార్తె అనిత, స్వప్నలు ఉన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన నాయకులు కోరుతున్నారు.

సిలబస్‌లో మార్పులు అవశ్యం

మనతెలంగాణ/కెయు క్యాంపస్: తెలంగాణ సిద్ధాంత కర్త కెయు మాజీ విసి డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ ఐదవ ఎండో మెంట్ లెక్చర్ శనివారం కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగింది. కెయు సెనెట్ హాల్‌లో కెయు ఉపకులపతి ఆచార్య ఆర్.సాయన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బెల్గాం కెఎల్‌వి యూనివర్సిటి విసి, కెయు మాజీ విసి ప్రొఫెసర్ చంద్రకాంత్ కొకాటే 'భారతదేశంలో ఉన్నత విద్య, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు సవాళ్లు'' అనే అంశంపై మాట్లాడుతూ డాక్టర్ జయశంకర్ విసిగా, రిజిస్ట్రార్‌గా యూనివర్సిటి అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉన్నత విద్యాభివృద్ధికై అంకితభావంతో పనిచేశారన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతు న్నదని, మరిన్ని విశ్వవిద్యాలయాలు అవసరమన్నారు. ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చేందుకు రాధాకృష్ణన్ కమిటీ, కొఠారి కమిటీ పాలసీలు ఏర్పాటు చేశారని, అయితే పాలసీలను ఆచరణలో పెట్టడంలో విఫలమవుతున్నామని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ఉన్నత విద్యలో మార్పుల ఆవశ్యకత ఉందన్నా రు. సిలబస్‌లో మార్పులు రావాలని సూచించారు. ఉపకులపతి సాయన్న మాట్లాడుతూ డాక్టర్ జయశంకర్ తెలంగాణకై జీవితాంతం పోరాడారన్నారు. ఎండోమెంట్ కమిటీ చైర్మన్ మాజీ విసి ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన నేడు డాక్టర్ జయశంకర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎ.శంకరయ్య, వక్త ప్రొఫెసర్ కొకాటేను సభకు పరిచయం చేశారు. సెక్రటరి డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా డాక్టర్ జయశంకర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకపోవడానికి కృషి చేస్తున్నామ న్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొకాటేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రొఫెసర్ జోగయ్య, డాక్టర్ గోవర్ధన్, ప్రొఫెసర్ రాములు, వసంత్‌కుమార్, ప్రొఫెసర్ సిహెచ్.దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాకెందుకీ 'శిక్ష'?



- పాలకవర్గం ఆమోదించినా వేతనాలు పెంచరా?
- సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన
- చాలీచాలని జీతాలతో 14 వేల మంది నానా అవస్థలు

మన తెలంగాణ / వరంగల్ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించినా, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఇది వర్తించడం లేదు. సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) పథకం కింద పనిచేస్తున్న ఈ ఉద్యోగుల వేతనాలు పెంచాలని పాలకవర్గ సమావేశంలో ఆమోదించినా వేతనాలు పెంపు అమలు కావడం లేదు. రాష్ట్రం వ్యాప్తంగా సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)లో దాదాపు 14 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మండల ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌పి లు, సిఆర్పిలు, సివిల్ ఇంజినీర్లు పలు విభాగాలలో మండల స్థాయిలో పని చేస్తున్న వారంతా రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర కార్యాలయాలలో సైతం కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. మండల స్థాయి లో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి పలు విభాగాల పనులు అప్పగించడమే కాక ప్రభుత్వ పథకాలలో సైతం వీరిని భాగస్వాములను చేస్తున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల జీతభత్యాలు చేయడానికి, మధ్యాహ్న భోజన బిల్లుల తయారీ, విద్యార్థుల ప్రగతి నివేదికల తయారీ, ప్రతి ఏటా కేంద్రం సేకరించే యూడైస్, వార్షిక ప్రణాళికల తయారీ, కంప్యూటర్ పాఠశాలల పరిశీలన, పాఠశాలల నగదు పుస్తకాల నిర్వహణ ఎస్ఎస్ఎలే చేస్తున్నారు.

అమలు కాని ఉత్తర్వులు : రాష్ట్రంలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ గతేడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం జివో నెం. 14 ను విడుదల చేసింది. ఆ ఏడాది నుంచే ఉత్తర్వులు అమలులోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొద్దోగొప్పో వేతనాలు పెరిగినా విద్యాశాఖలో అమలు కావడం లేదు. ఆంధ్రాలో పిఎబి అప్రూవల్ ప్రకారం కంటే ఎక్కు వ వేతనాలు చెల్లిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది, కాని తెలంగాణలో మాత్రం వేతనాలు పెంపు అమలుకు నోచుకోవడం లేదు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనం రూ.17,632 , సిఆర్‌పిల వేతనం రూ.17,832, ఐఈఆర్‌పిల వేతనం రూ.19 వేలుగా పిఎబిలో ఆమోదం పొందిందని, ఆ వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్‌చేస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం : భాస్కర్, ఎఎస్‌పిడి, ఎస్ఎస్ఎ

ఎస్ఎస్ఎ పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తేనే వెంటనే అమలు చేస్తాం.

పిల్లలకు పైలెట్ ఊతం



- పిల్లల శారీరక ,మానసిక ఎదుగులకు పైలెట్ ప్రాజెక్టు
- రాష్ట్రంలో 9న ప్రారంభించనున్న మహిళా శిశు సంక్షేమశాఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : పిల్లల మానసిక అభివృద్ధి, శారీరక ఎదుగుదలను గుర్తించి వారి తల్లి దండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు రాష్ట్రం లో ఒక పైలెట్ ప్రాజెక్టుకు మహిళా శిశు సంక్షేమశాఖ సంకల్పించింది. రాష్ట్రంలోని 35,700 అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ఏడాదిలో మూడు సార్లు వారిని వివిధ అంశాల్లో పరీక్షించనున్నారు. వయో పరిమితిని బట్టి 3 నుండి 4 సంవత్సరాలు, అలాగే నాలుగు నుండి ఐదేళ్లలోపు వారిని రెండు కేటగిరీలుగా విభజించి వారి మానసిక, శారీరక ఎదుగుదలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా రెండు కార్డులను కూడా పంపిణి చేస్తారు. అంగన్‌వాడీల్లో చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. మంచి అలవాట్లు నేర్పించడం, వారి చేత సాధన చేయించడం, ఆట పాటలు, కథలు నేర్పించడంతో పాటు వైవిధ్యమైన అంశాల్లో వారికి తర్ఫీదు ఇస్తారు. పాఠశాల విద్యను వీరిని సిద్ధం చేసేందుకు చేయాల్సిన సాధనాలన్నీ అంగన్‌వాడీల్లోనే నేర్పుతారు. వీటికి తగ్గట్లు పిల్లల గ్రహణ శక్తి, మానసిక పరివర్తన, నూతన అంశాలను నేర్చుకోవాలన్న జిజ్ఞాస వారిలో ఉన్నదీ లేనిదీ అంగన్‌వాడీ టీచర్లు గమనిస్తారు. వినికిడి లోపాలు, మానసిక వికాసం లేనట్లు గుర్తించిన పిల్లల పట్ల వారి తల్లిదండ్రులకు పిల్లల లోపాలను వివరిస్తారు. లోపాలను గుర్తించనందుకే చాలా మంది చిన్నారులు సరిగ్గా ఎదగలేకపోయినట్లు గమనించిన ప్రభుత్వం దేశంలోనే తొలి సారిగా రాష్ట్రంలో ఒక పైలెట్ ప్రాజెక్టు కింద పిల్లల మానసిక అభివృద్ధి, శారీరక ఎదుగుదలపై ఒక పైలెట్ ప్రాజెక్టును అమలు చేయనుంది. దీనినే బాల్య ప్రారంభ దశ విద్య, సంరక్షణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఆగస్టు, డిసెంబర్,ఏప్రిల్‌లోని రెండోవారంలో ఓ రోజును ఇందుకు వినియోగించనున్నారు. తొలి విడతగా ఈ నెల9న ఈసిసిఈ దినోత్సవం నిర్వహించాలని అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తెలంగాణలో పోషకాహార లోపాలే ఎక్కువ!

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రక్తహీనత, పోషకాహార లోపాలతోనే పిల్లలు ఎక్కువగా బాధపడుతున్నట్లు ఇటీవల యూనిసెఫ్ ఒక అధ్యయనంలో తేల్చింది. 6 నెలల శిశువులు మొదలుకొని ఐదేళ్ల వయస్సులోని చిన్న పిల్లల్లో 61 శాతం మంది రక్త హీనత, పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు తేలింది. అలాగే శారీరక ఎదుగుదల లోపాలు, కుర చగా ఉన్న వారు 28 శాతం వరకు ఉన్నారు. నూటికి 18 శాతం పిల్లలు బక్కచిక్కి, 29 శాతం పిల్లలు తక్కువ బరువుతో ఉన్న వారే అధికంగా ఉన్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. యూనిసెఫ్ చేసిన ఈ అధ్య యనంలో చాలా వరకు వాస్తవాలే ఉన్నట్లు అంగన్ వాడీల ద్వారా క్షేత్ర స్థాయి నివేదికను తెప్పించు కున్న మహిళాశిశు సంక్షేమ శాఖ పిల్లల అభివృద్ధిపై రాష్ట్రం లో పైలెట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు విజయేందిర బోయి వెల్లడించారు.

కల్తీ పాల తయారు కేంద్రంపై దాడులు

మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం : కల్తీ పాల తయారు కేంద్రంపై ఎల్బీనగర్ ఎస్ఓటి పోలీసులు దాడిచేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఆదిభట సమీపంలో మమ్మారాజ్ గూడలో శ్రీధర్‌రెడ్డి అనే పాల వ్యాపారి 70లీటర్ల పాలల్లో 10లీటర్ల నూనెను కలిపి కల్తీ పాలను తయారు చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. 25 లీటర్ల నూనె డబ్బా, పాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సంఘటనపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎల్బీ నగర్ ఎస్ఓటి సిఐ వేణుగోపాల్, ఎస్ఓటి సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

మీ భాగస్వామ్యం వద్దు : సురక్ష సొసైటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టిశాక్స్)తో భాగస్వామ్యంతో ముందుకెళ్లలేమని సురక్ష కమ్యూనిటీ స్వచ్ఛంద సేవా సంస్థ తెలిపింది. ఈ మేరకు సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.కృష్ణ టిశాక్స్ పిడికి ఒక లేఖను సమర్పించారు. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రాజెక్టు అమలు కోసం ఆరు నెలల ముందుగా నిధులు చేయలేదని, పైపెచ్చు 2014 సంవత్సరం నుండి 2016 నిధులు విడుదల చేయకపోవడంతో అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. టిశాక్స్‌తో కలిసి పని చేయడం కన్నా ఒంటరిగా తమ పరిధిలో పని చేసుకోవాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. తక్షణమే ఒప్పందం నుండి తాము వైదొలుగుతున్నట్లుగా భావించాలని ఆయన కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ఐఎఎస్‌లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును శనివారం సీనియర్ ఐఎఎస్‌ల బృందం సందర్శించింది. పనులు జరుగుతున్న తీరును ఐఎఎస్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు చిత్రా రామచంద్రన్, రాజేశ్వర్ తివారి, రాజీవ్ త్రివేది, శశాంక్ గోయల్, సునీల్ శర్మ, జి.అశోక్ కుమార్, జయేష్ రంజన్, వికాస్ రాజ్, ఎన్. శివశంకర్, బి. వెంకటేశం, అనితా రాజేంద్ర ఉన్నారు. వీరికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా నాయకత్వం వహించారు. మొత్తం 20 మంది కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్యాకేజ్ 8 పనులను వారు ఈ సందర్భంగా పరిశీలించారు.

పార్లమెంట్ వద్ద బిసిల భారీ ప్రదర్శన



మన తెలంగాణ/ హైదరాబాద్ / ముషీరాబాద్ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఇప్పటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించని 20 శాతం అదనంగా సృష్టించి ఆంగ్లో ఇండియన్ల మాదిరిగా నామినేట్ చేయాలని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగహోదా కల్పించే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన, సభ జరిగింది. శనివారం ఢిల్లీలో జరిగిన ఈ భారీ ప్రదర్శనకు తెలుగు రాష్ట్రాల నుంచి బిసి నేతలు, కార్యకర్తలు వందలాదిగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టే వరకు పోరాటం ఆగదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు అఖిల పక్షాలతో ప్రతినిధి బృందం వెళ్లి ప్రధాన్ని నరేంద్రమోడీని కలిసి పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టించాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని తీర్మానం చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఉన్న 36 రాజకీయ పార్టీల్లో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా పార్లమెంట్‌లో బిసిల పక్షాన నోరెత్తి మాట్లాడటంలేదని విమర్శించారు. తెగించి పోరాడకపోతే బిసిలకు, బిసిల పిల్లలకు భవిష్యత్ లేదన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, కేంద్ర, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బిసిల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతంకు పెంచాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బిసి యాక్టును తీసుకురావాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ ప్రదర్శనలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, గౌరిగొ మల్లేష్‌యాదవ్, ఏపి, తెలంగాణ బిసి యువజన సంఘం అధ్యక్షులు కర్రి వేణు మాదవ్, నీల వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు శారదాగౌడ్ పాల్గొన్నారు.



త్వరలోనే ఆసుపత్రిని ఆధునీకరిస్తాం : లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/నారాయణపేట : పట్టణంలోని ప్రధాన రహ దారి విస్తరణ పనులను శనివారం వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. దీంతో పేట ప్రజల చిరకాల కోరిక తీరినట్లయింది. పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తా నుండి మార్కండేయ స్వామి దేవాలయం వరకు రూ.28కోట్ల 50లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులను మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి ఎంఎల్‌ఏ ఎస్.రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. టిఆర్‌ఎస్ నాయకులు కృష్ణ కోర్‌వార్ భవనం వద్ద మంత్రి లక్ష్మారెడ్డి, ఎంఎల్‌ఏ ఎస్.రాజేందర్ రెడ్డిలు పూజలు నిర్వహించి అనతంరం జేసీబీతో భవనాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జులై 15న జరిగిన బహిరంగ సభలో మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీలో భాగంగా అంతర్గత నిర్మాణాలకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను ప్రారం భిస్తామని అన్నారు. పేట ఏరియా ఆసుపత్రిని ఇప్పటికే ఆధునీకరించామని త్వరలోనే జిల్లా ఆసుపత్రిగా మారు స్తామని తెలిపారు. ఎంఎల్‌ఏ ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేట ప్రజలు అభివృద్ధి రుచిని చూస్తున్నారని అన్నారు. సబ్ కలెక్టర్ కృష్ణ ఆదిత్య, మున్సిపల్ కమిషనర్ సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, మార్కెట్ కమిటీ చైర్మెన్ బండివేణుగోపాల్, నగర అధ్యక్షులు కోట్ల రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టెలమండిలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు భూమి పూజ



మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: నాంపల్లి కట్టెలమండి బస్తీలో రూ.9.92 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ డి మోహన్‌లు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం పథకం ద్వారా కట్టెలమండి బస్తీలో ని 128 కుటుంబాలకు లబ్ది చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని ఎన్నో పథకాలను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేస్తు ందన్నారు. పేద ప్రజలకు డబుల్ బెడ్ ఇండ్ల పథకం తీసుకువచ్చిన సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయాన్ని ముట్టడించిన యూత్ కాంగ్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్ : గుజరాత్‌లో ఏఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై దాడికి నిరసనగా శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి, బిజెపికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యాలయం ఎదుట నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్దం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలోకి దూసుకువెళ్లేందుకు యత్నించిన 15మంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోరాటాలకు రూపకల్పన చేయాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మరింత లోతైన అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పోరాటాల రూపకల్పన చేయాలని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. రైతు నాయకులు, సిపిఐ(ఎం) శాసనసభాపక్షం మాజీ నేత బోడెపూడి వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభ శనివారం ఎంబి భవన్‌లో జరిగింది. కార్యక్రమంలో రాఘవులుతోపాటు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు బి.వెంకట్, నంద్యాల నర్సింహారెడ్డి, టి.జ్యోతి, ఎస్.వీరయ్య తదితరులు బోడెపూడి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రజా నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా బోడెపూడి విశేష సేవలందించారన్నారు.

23న పెళ్లిచేసుకోబోతున్న ప్రియమణి

సినిమా హీరో లేదా హీరోయిన్ పెళ్లి జరిగితే తమ ఇంట్లో పెళ్లి జరిగినంతగా సంబరపడిపోతారు వారి అభిమానులు. తమ అభిమాన స్టార్ పెళ్లి అయితే వారి ఆనందం వర్ణనాతీతంగా మారుతుంది. సౌతిండియాలో స్టార్‌ల పెళ్లిళ్లు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయితే సౌత్ హీరోయిన్ ప్రియమణి మాత్రం ఎటువంటి ఆడంబరం లేకుండా రిజిస్టర్ పెళ్లి చేసుకోబోతుండడం విశేషం. ఇది ఆమె అభిమానులకు నిరాశ కలిగించేదే అయినా తమ అభిమాన హీరోయిన్ పెళ్లి జరుగుతుండడం వారికి సంతోషాన్ని కలిగిస్తోంది. 'పెళ్లైన కొత్తలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రియమణి ఒకప్పుడు తెలుగులో బిజీ స్టార్‌గా ఓ వెలుగు వెలిగింది. సౌత్‌లో తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ చిత్రాలతో పాటు బాలీవుడ్‌లోనూ నటించింది ఈ అమ్మడు. కొంతకాలం క్రితం తన బాయ్‌ఫ్రెండ్ ముస్తఫారాజ్‌తో ప్రియమణి నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ జంట ఈనెల 23న రిజిస్టర్ ఆఫీస్‌లో పెళ్లి చేసుకోబోతోంది. పెళ్లి తర్వాత 24వ తేదీన బెంగుళూర్‌లో ఇండస్ట్రీ పెద్దలు, తన తోటి నటీనటులకు విందు ఇవ్వబోతుంది ప్రియమణి. ప్రస్తుతం ఈ తార కొన్ని కన్నడ సినిమాలు చేస్తూ ఓ తెలుగు టివి ఛానల్‌లో డాన్స్ షోకు జడ్జీగా కూడా చేస్తోంది.



'ఉన్నది ఒకటే జిందగీ' అంటున్న రామ్



రామ్

యంగ్ హీరో రామ్‌ను సరికొత్తగా ఆవిష్కరించిన 'నేను శైలజ' ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం రామ్ కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా నిలిచింది. ఈ హిట్ కాంబినేషన్‌లో మరో సినిమా నిర్మాణంలో ఉంది. స్రవంతి రవికిశోర్, పి.ఆర్.సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై ఈ చిత్రాన్ని కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు. ఇందులో అనుపమా పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి కథానాయికలు. ఈ చిత్రానికి 'ఉన్నది ఒకటే జిందగీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇప్పటివరకు 50 శాతం షూటింగ్ పూర్తయింది.

సోమవారం ఊటీలో కొత్త షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ సందర్భంగా స్రవంతి రవికిశోర్ మాట్లాడుతూ "స్నేహం, ప్రేమ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఆదివారంనాడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఈ చిత్రంలో ఉన్న 'ట్రెండ్ మారినా... ఫ్రెండ్ మారడు...' అనే పాటకు సంబంధించిన లిరికల్ వీడియోను విడుదల చేయబోతున్నాం.

దేవిశ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ పాటను చంద్రబోస్ రాశారు. అన్ని పాటలకు దేవిశ్రీ మంచి ట్యూన్స్ ఇచ్చారు. ఊటీలో జరుపనున్న భారీ షెడ్యూల్‌తో ఒక పాట మినహా సినిమా పూర్తవుతుంది. ఆ పాటను వచ్చే నెల ఇటలీలో చిత్రీకరిస్తాం. దసరాకి సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం"అని చెప్పారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సమీర్ రెడ్డి, ఎడిటింగ్ః శ్రీకర్ ప్రసాద్, ఆర్ట్ః ఎ.ఎస్.ప్రకాష్.

సెప్టెంబర్ 8న 'ఒక్కడు మిగిలాడు'



మంచు మనోజ్

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు మంచు మనోజ్. తాజాగా అతను ఎల్‌ఎల్‌టిఇ ఛీఫ్ ప్రభాకరన్ పాత్ర పోషిస్తున్నాడు. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఒక్కడు మిగిలాడు' చిత్రాన్ని ఎస్.ఎన్.రెడ్డిలక్ష్మీ కాంత్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు ఎస్.ఎన్.రెడ్డిలక్ష్మీ కాంత్‌లు మాట్లాడుతూ "మునుపెన్నడూ భారతదేశ చలనచిత్ర చరిత్రలో చూడని సరికొత్త కథాంశాన్ని 'ఒక్కడు మిగిలాడు' చిత్రంతో ప్రేక్షకులు చూడనున్నారు. మంచు మనోజ్ యాంగ్రీ యంగ్‌మెన్‌గా ఆశ్చర్యపరుస్తాడు. ఈ చిత్రం ట్రైలర్, పాటలను త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 1990ల కాలంనాటి శ్రీలంక యుద్ధం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందన్న నమ్మకముంది. ఇటీవల విడుదల చేసిన మంచు మనోజ్ ఫస్ట్‌లుక్‌కు విశేషమైన స్పందన వచ్చింది. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేసిన ఈ చిత్రం సాంకేతికంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం ఖాయం. సినిమా నేపథ్య సంగీతాన్ని ప్రాగ్‌లో రికార్డ్ చేయనున్నాం"అని అన్నారు. మంచు మనోజ్, అనీషా ఆంబ్రోస్, మిలింద్ గునాజీ, పోసాని, సుహాసిని, సూర్య, బెనర్జీ, జెన్నిఫర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళః పి.ఎస్.వర్మ, సినిమాటోగ్రాఫర్ః వి.కోదండ రామరాజు, ఎడిటర్ః కార్తీక శ్రీనివాస్, స్క్రీన్‌ప్లేః గోపీమోహన్, సంగీతంః శివ నంది




'సప్తగిరి సూపర్ ఫాస్ట్' చిత్రం ప్రారంభోత్సవంలో విజయేంద్ర ప్రసాద్, పర్వతనేని కిరణ్, బి.గోపాల్, సింధూరపువ్వు కృష్ణారెడ్డి, సప్తగిరి, హర్షవర్ధన్, నట్టి కరుణ, నట్టి క్రాంతి తదితరులు

'సప్తగిరి సూపర్ ఫాస్ట్' సినిమా షురూ

సప్తగిరి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో సప్తగిరి హీరోగా తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే సప్తగిరి హీరోగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ఆతర్వాత అతను 'సప్తగిరి ఎల్‌ఎల్‌బి' అనే చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాడు. ఇప్పుడు సప్తగిరి తన పేరుతోనే 'సప్తగిరి సూపర్ ఫాస్ట్' అనే టైటిల్‌తో మరో సినిమాను శనివారం ప్రారంభించేశాడు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి నూతన అధ్యక్షుడు పర్వతనేని కిరణ్ క్లాప్‌నివ్వగా సీనియర్ రచయిత విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. సీనియర్ దర్శకులు బో.గోపాల్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ద్వారా నిర్మాతలుగా నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మాతలుగా పరిచయమవుతున్నారు. నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జొన్నాడ రమణమూర్తి సమర్పణలో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "హర్షవర్ధన్ నా చిరకాల మిత్రుడు. నాతో కలిసి చాలా సినిమాలకు పనిచేశాడు. సప్తగిరి సూపర్ ఫాస్ట్ కథ సిద్ధం చేసి నా దగ్గరకు వచ్చి వినిపించి... నా అనుమతి తీసుకొని ప్రారంభించాడు. సప్తగిరికి వంద శాతం సరిపోయే కథ ఇది"అని అన్నారు. చిత్ర దర్శకుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ "అందరికీ నచ్చే కథాంశమిది. సప్తగిరిని హీరోగా మరో మెట్టు పైకి ఎక్కించే సినిమా ఇదవుతుంది. కొత్త నిర్మాతలిద్దరూ సినిమాపై మంచి ప్యాషన్‌తో ఉన్నారు. వాళ్లకు మంచి పేరు తీసుకొస్తుంది"అని తెలిపారు.

నిర్మాతలు క్రాంతి, కరుణ మాట్లాడుతూ "ఈ చిత్రంతో మా నాన్న పేరును నిలబెడుతాం. మమ్మల్ని, మా టీమ్‌ను నమ్మి సప్తగిరి ఈ సినిమా చేస్తున్నందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు"అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నట్టికుమార్, సింధూరపువ్వు కృష్ణారెడ్డితో పాటు చిత్ర బృందం పాల్గొంది. నరేష్, పోసాని కృష్ణ మురళి, డా.శివప్రసాద్, తనికెళ్ల భరణి, జయప్రకాష్ రెడ్డి, షయాజీ షిండే, రఘుబాబు, తదితరులు నటించే ఈ చిత్రానికి ఆర్ట్ః కె.వి.రమణ, ఎడిటింగ్ః గౌతంరాజు, ఫైట్స్ః రామ్‌లక్ష్మ ణ్.

టీనేజ్‌లోనే గ్లామర్ పిచ్చిలో పడ్డా



షెర్లిన్ చోప్రా

డబ్బుకోసమే తాను సినీ గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టానని బాలీవుడ్ నటి షెర్లిన్ చోప్రా చెప్పి ఈమధ్యన వార్తల్లో నిలిచింది. "చిన్న పిల్ల గా ఉన్నప్పుడు నాకు డాక్టర్ కావాలని ఉండేది. కేవలం చనిపోయిన మా నాన్న కూడా డాక్టర్ అవడమే అందుకు కారణం కాదుగానీ... సైన్స్ అంటే నాకు చాలా ఇష్టం. కేవలం అకాడమిక్ విషయాల్లోనే కాకుండా ఇతర అంశాల్లో కూడా ముందుండేదాన్ని. అందాల పోటీలో గెలుపొందే వరకు అంతగా బాగానే ఉంది. 19 ఏళ్లకు గ్లామర్ పిచ్చిలో పడి ఓ విభిన్న మార్గాన్ని ఎంచుకున్నాను. టీనేజ్‌లో నేను మోడలింగ్ చేసే రోజు ల్లో నాకంటే వయసులో పెద్దవారితో డేటింగ్ చేసేదాన్ని. వాళ్లు నాకు ఎంతో విలువైన గిఫ్టులు ఇచ్చేవారు. దీంతో ఎవరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారు, గౌరవిస్తున్నారు... అనే విషయం తెలుసుకోవడం కష్టంగా మారింది. కానీ తర్వాత తెలిసింది... నా దగ్గరికి వచ్చేవారు నాకు విలువ ఇ చ్చి వచ్చేవారు కాదని. కానీ ఇప్పుడు మంచిగా మా రడం వెనుక నా ఉద్దేశ్యం మంచిదే"అని ఈ భామ చెప్పింది.

రెండేళ్లకు ఓ సినిమా చేసినా మంచి కథతోనే వస్తా



బెల్లంకొండ సాయిశ్రీనివాస్

రెండేళ్లకు ఓ సినిమా చేసినా మంచి కథతోనే వస్తా బోయపాటి శ్రీను దర్శకత్వంలో యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయజానకి నాయక'. ఈ చిత్రం ఈనెల 11న విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

హార్ట్ టచింగ్ లవ్‌స్టోరీ... సినిమాలో జానకి నాయకుడు కొత్తగా ఉంటూ బోయపాటి శ్రీను హీరోలా ఉంటాడు. సినిమా ఫస్టాఫ్ అంతా హార్ట్ టచింగ్ లవ్‌స్టోరీ. ఈ ప్రేమ కథను బోయపాటి శ్రీను చాలా కొత్తగా చూపించారు. ఇందులో నేను, రకుల్‌ప్రీత్ సింగ్ కాలేజీ స్టూడెంట్స్‌లా కనపడతాం.

మంచి ప్రేమకథలో కమర్షియల్ ఎలిమెంట్స్... 'జయ జానకి నాయక' అంటే లంకలోని సీతాదేవిని గెలుచుకున్న శ్రీరాముడు అని అర్థం. మరి ఈ సినిమాలో లంక ఏదని తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో జగపతిబాబు విలనిజం కొత్తగా ఉంటుంది. ఇప్పటివరకు టచ్ చేయని ఓ పాయింట్‌ను బోయపాటి శ్రీను ఇందులో అద్భుతంగా చూపించారు. ఒక మంచి ప్రేమ కథకు కమర్షియల్ ఎలిమెంట్స్ జత కలిసి రావడమనేది చాలా అరుదుగా జరుగుతుంది. నా మూడో సినిమాకే లవ్‌స్టోరీ విత్ కమర్షియల్ ఎలిమెంట్స్ కుదరడం నా అదృష్టంగా భావిస్తున్నా.

ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటా... నేర్చుకోవడమనేది నిరంతరం జరిగే ప్రక్రియ. నేను రేపు వంద సినిమాలు చేసినా తర్వాత సినిమాకు ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాను. ఇక 'జయ జానకి నాయక' సినిమా విషయానికొస్తే సినిమాలో కొత్త లుక్‌లో కనిపిస్తాను. నటుడిగా ఇంకా మంచి పర్‌ఫార్మెన్స్ ఇవ్వడానికి ప్రయత్నించాను. క్యారెక్టర్‌పరంగా మంచి ఎమోషన్స్‌తో కనిపిస్తాను.

త్వరితగతిన సినిమాలు చేయను... బోయపాటి శ్రీనుతోనే నా రెండో సినిమా చేయాల్సి ఉంది. కానీ మంచి కథ కుదరకపోవడంతోనే రెండో సినిమాగా 'స్పీడున్నోడు' సినిమా చేశాను. నా రెండో సినిమా ఫిబ్రవరిలో రిలీజ్ అయితే బోయపాటి శ్రీను సినిమా ఏప్రిల్‌లో రిలీజైంది. తర్వాత మంచి కథ కోసం ఆయన ఓ మూడు నెలల పాటు వర్క్ చేశారు. నవంబర్‌లో ఈ సినిమా ప్రారంభమైంది. అయితే నాకు త్వరితగతిన సినిమాలు చేయాలన్న ఆలోచన లేవీ లేవు. రెండేళ్లకు ఓ సినిమా చేసినా మంచి కథతోనే ప్రేక్షకుల ముందుకు రావాలనుకుంటున్నాను.

యాక్షన్, డ్యాన్సులలో ట్రైనింగ్... మాస్ ఇమేజ్ ఉన్న డైరెక్టర్ బోయపాటి శ్రీను. ఆయన సినిమాలో మాస్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది.

ఈ సినిమాలో కూడా లవ్‌స్టోరీ ప్రధానంగా సాగుతుంది. ఇక నేను యాక్షన్, డ్యాన్సుల పరంగా బాగా ట్రైనింగ్ తీసుకున్నాను. కాబట్టి నేను యాక్షన్ సినిమాలు చేయడంలో తప్పులేదనిపించింది. భవిష్యత్తులో పూర్తి లవ్‌స్టోరీ వచ్చినా చేయడానికి నేను సిద్ధమే.

ఓ స్పెషల్ మూవీగా... సినిమాలో నా పాత్ర కోసం పాతిక కిలోల వరకు పెరిగాను. ఆతర్వాత పది కిలోల వరకు తగ్గాను. ఈ చిత్రం నా కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా నిలుస్తుంది. సినిమా ఘన విజయం సాధించి నా కెరీర్‌కు మంచి ఊపునిస్తుంది.

మరో సినిమా చేస్తానన్నారు... దర్శకుడు బోయపాటి శ్రీను నన్ను సొంత తమ్ముడిలా చూసుకున్నారు. ఈ సినిమా విషయంలో ఆయనిచ్చిన ప్రోత్సాహాన్ని మరచిపోలేను. అంత పెద్ద డైరెక్టర్ నా గురించి ఇంతలా ఆలోచించాల్సిన అవసరం లేదు. నీకేం కాదు నీ వెనుక నేనున్నాను... నీతో మరో సినిమా కూడా చేస్తానని ధైర్యాన్నిచ్చారు . నాలో అంతగా ఆయనకేం నచ్చిందో నాకు అర్థం కావడం లేదు.

మా నాన్న అంత మంచి వారుండరు... హీరో కావాలనేది నా కల. నా కలను పూర్తి చేశారు మా నాన్న. మంచి కథల ఎంపికలో తన అభిప్రాయాలను నాకు చెబుతుంటారు. సినిమా రంగంలోనే కాదు ఏ రంగంలో కూడా మా నాన్న అంత మంచి నాన్న ఉంటారనుకోవడం లేదు. నా స్నేహితులు ఈ విషయంలో నన్ను చూసి ఈర్ష్య పడుతుంటారు.

శ్రీవాస్ దర్శకత్వంలో... నా నెక్స్ట్ మూవీని శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌లో చేస్తున్నాను. ఇప్పటివరకు టాలీవుడ్‌లో రాని డిఫరెంట్ జోనర్‌లోని సినిమా ఇది. అలాగే ఇప్పటివరకు రాని యాక్షన్ ఎలిమెంట్స్ సినిమాలో ఉంటాయి. పీటర్ హెయిన్స్ యాక్షన్ సన్నివేశాలను కంపోజ్ చేస్తున్నారు. ఈ నెల 17 నుండి ఈ సినిమా రెండో షెడ్యూల్ మొదలవుతుంది.



జాక్విలిన్ ఫెర్నాండెజ్

జిమ్‌కు వెళ్లడం నాకు అలవాటు

తెలుగులో ఇప్పుడు వస్తున్న యంగ్ హీరోలందరూ ఎంతో ఫిట్‌గా కనిపిస్తున్నారు. బాలీవుడ్ అంటే ఇంకా చెప్పే పని లేదు. అక్కడ యంగ్ హీరోలకు ఉండాల్సిన కనీస అర్హత ఫిట్‌గా ఉండడమే. అయితే ఈ హీరోల గురించి వారితో పనిచేసిన హీరోయిన్ చెబితే ఎంతో బాగుంటుంది. బాలీవుడ్‌లో హాట్ అండ్ ఫిట్‌గా ఉండే హీరోయిన్ జాక్విలిన్ ఫెర్నాండెజ్ తనతో కలిసి పనిచేసిన హీరోల ఫిట్‌నెస్ గురించి చెప్పింది. "స్కూలు రోజుల నుంచే నేను అథ్లెట్‌ను. బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. ప్రతి రోజు జిమ్‌కు వెళ్లేదాన్ని. ఇప్పుడు కూడా ప్రతి రోజు జిమ్‌కు వెళ్లడం నాకు అలవాటుగా మారింది. అయితే నేను కలిసి పని చేసిన హీరోలలో సల్మాన్ ఖాన్ ఫిట్‌నెస్ కింగ్. ఇకపోతే వరుణ్‌ధావన్‌తో కలిసి జిమ్ చేయడం నాకు బాగా ఇష్టం. వరుణ్ కూడా నాలాగే ఆలోచిస్తాడు. కొంచెంసేపు జిమ్ చేసిన వెంటనే ఏదైనా తిందామా అని అడుగుతాడు. చాలా ఫన్నీగా ఉంటాడు. టైగర్ ష్రాఫ్, జాన్ అబ్రమం కూడా జిమ్‌లో బాగా కష్టపడతారు"అని జాక్విలిన్ చెప్పింది. తన ఫిట్‌నెస్‌తో మరింత హాట్‌గా మారిన జాక్విలిన్ త్వరలో రిలీజ్ కాబోతున్న 'ఎ జెంటిల్‌మన్' సినిమాలో తన అందాలతో మురిపించబోతుందట.

మరోసారి పాడిన ప్రియాంక

హాలీవుడ్‌కు వెళ్లిన తర్వాత ప్రియాంకా చోప్రా బిజీ అయిపోయింది. ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తూ మరాఠీలో సినిమాలను ప్రొడ్యూస్ చేస్తూ... ఫ్యాషన్ షోలలో కూడా పాల్గొంటూ ఈ హాట్ బ్యూటీ తీరిక లేకుండా ఉంటోంది. ప్రియాంక హీరోయినే కాదు మంచి సింగర్ కూడా. ఇదివరకే ఓ ఇంగ్లీష్ మ్యూజిక్ వీడియోలో కూడా పాడింది ఈ భామ. మరాఠీలో తాను నిర్మించిన 'వెంటిలేటర్' సినిమాలోనూ పాట పాడి సంగీత ప్రియులను అలరించింది. ఇప్పుడు మరో ఇంగ్లీష్ మ్యూజిక్ వీడియోలో పాడింది. ఆస్ట్రేలియన్ డీజే విల్‌స్పార్క్‌తో కలిసి 'యంగ్ అండ్ ఫ్రీ' అనే మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేసేందుకు ఈ భామ సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఓ పోస్టర్‌ను కూడా పోస్ట్ చేసింది. ఈ మ్యూజిక్ ఆల్బమ్‌లో తన గొంతు కొత్తగా, వింతగా ఉంటుందని చెప్పింది ప్రియాంక చోప్రా. ఈ మ్యూజిక్ వీడియోను ఈనెల 11న విడుదల చేస్తారట. అయితే పర్పుల్ పెబెల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ప్రియాంక గత కొంతకాలంగా మరాఠీలో సినిమాలను నిర్మిస్తోంది. ఇక బేవాచ్ తర్వాత చేస్తున్న కొత్త హాలీవుడ్ మూవీ 'ఈజంట్ ఇట్ రొమాంటిక్?' షూటింగ్‌లో ప్రస్తుతం బిజీగా ఉంది ప్రియాంక.



ప్రియాంక చోప్రా



శాంసంగ్ గెలాక్సీ ఎస్8 మోడల్ అమ్మకాలు 20 మిలియన్లు

ముంబయి: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎస్ 8 మోడల్ అమ్మకాల్లో అరుదైన మైలురాయిని అందుకుంది. ఏప్రిల్ నెలలో ఈ మోడల్ అమ్మకాలు ప్రారంభించగా జులై నెల ముగిసే నాటికి దాదాపు 20 మిలియన్ ఫోన్లను విక్రయించింది.దక్షిణ కొరియాకు చెందిన ఓ వెబ్‌సైట్ ప్రచురించిన డేటా ప్రకారం గెలాక్సీ ఎస్8 మార్కెట్లో విడుదల చేసిన నాటి నుంచి ఏప్రిల్ 21 వరకూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు దాదాపు 2,78,800 ఫోన్లను విక్రయించినట్లు వెల్లడించింది. జూన్ నాటికి 19.8 మిలియన్ ఫోన్లు అమ్ముడయ్యాయని అది జులై నాటికి 20 మిలియన్ల మైలురాయిని అధిగమించిదని పేర్కొంది. గెలాక్సీ ఎస్7 అమ్మకాలతో పోలిస్తే ఇది దాదాపు 15 శాతం అధికమని సంస్థ మొబైల్ విభాగం ఛీఫ్ డొంగ్ జీ కోహ్ మీడియాతో చెప్పారు.గెలాక్సీ నోట్ 7 ఘోరంగా విఫలం అవడంతో కంపెనీ అప్రతిష్ఠ మూటగట్టుకోవాల్సి వచ్చింది. అనంతరం విడుదల చేసిన గెలాక్సీ ఎస్ 8తో శాంసంగ్ మళ్లీ మార్కెట్లో తన సత్తాచాటింది. ఆగస్టు 23న కంపెనీ తదుపరి మోడల్ గెలాక్సీ నోట్ 8ను విడుదల చేయబోతున్నది.

నీతి ఆయోగ్ నూతన వైస్ చైర్మన్‌గా ఆర్థికవేత్త రాజీవ్



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ నూతన వైస్ చైర్మన్‌గా ఆర్థికవేత్త, డాక్టర్ రాజీవ్ కుమార్ శనివారం నియమితులయ్యారు. ఇటీవల నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పుకుంటున్నట్టుగా అరవింద్ పనగారియ ప్రకటించిన ఐదు రోజుల తరువాత ఆయన స్థానంలో రాజీవ్ పేరు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 31న తాను విద్యావేత్తగా తిరిగి కొలంబియా యూనివర్సిటీ వెళ్లనున్నట్టు పనగారియ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే నీతి ఆయోగ్‌లో సభ్యుడిగా డాక్టర్ వినోద్ పాల్‌ను నియమించిన ప్రభుత్వం, ఆయన్ను ఎయిమ్స్‌లో శిశు వైద్యుడిగా కూడా నియమించిందని అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో డిఫిల్ పట్టా పొందిన కుమార్.. లక్నో యూనివర్సిటీ నుంచి పిహెడి పట్టాను కూడా పొందడమే కాకుండా సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సిపిఆర్)లో సీనియర్ పరిధోకుడిగా పనిచేశారు. ఇటీవల, ఎఫ్‌ఐసిసిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రాజీవ్.. ఇండియన్ కౌన్సెల్ ఫర్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ (ఐసిఆర్ఐఇఆర్) లో కూడా చీఫ్ ఎగ్జిక్యూటీవ్, డైరెక్టర్‌గా సేవలందించారు. 2006 నుంచి 2008 వరకు జాతీయ భద్రతా సలహాదారు బోర్డులో సభ్యుడిగా ఉన్నారు. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ప్రధాన ఆర్థికవేత్తగా కూడా సేవలందించారు. అదేవిధంగా, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లో సీనియర్ అధికారిగా భారతీయ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖలలో రాజీవ్ పనిచేశారు. కాగా, భారతీయ అమెరికన్‌గా పనగారియ 2015 జనవరిలో నీతి ఆయోగ్‌లో చేరారు.

బిఎస్‌ఎన్‌ఎల్ రక్షాబంధన్ ఆఫర్

మన తెలంగాణ/హైదరాబాద్ : రక్షాబంధన్ పురస్కరించుకొని బిఎస్‌ఎన్‌ఎల్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ మేరకు బిఎస్‌ఎన్‌ఎల్ టిఎస్ సర్కిల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (పిఆర్) ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌టివి74తో ఐదు రోజుల పాటు బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌కు అన్‌లిమిటెడ్ కాల్స్, ఇతర నెట్‌వర్క్‌లకు 74 నిమిషాల వాయిస్ కాల్స్, ఒక జిబి డాటాను ఇస్తుంది. ఈ ఆఫర్ ఆగస్టు 3వ తేదీ నుండి 15వ తేదీ వరకు వర్తిస్తుంది. అదే విధంగా ఆగస్టు 3వ తేదీ నుండి 90 రోజులకు వర్తించే కాంబో వోచర్‌ను ఆఫర్ చేసింది. ఎస్‌టివి188తో రూ.189 టాక్ టైమ్ మెయిన్ అకౌంట్‌లో రూ.31 డెడికేటెడ్ అకౌంట్‌లో, ఒక జిబి ఉచితంగా 14 రోజుల పాటు అందిం చనుంది. ఎస్‌టివి 289తో 28 రోజుల వ్యాలిడిటీతో మెయిన్ అకౌంట్ లో రూ.289 డెడికేటెడ్ అకౌంట్‌లో రూ.51, ఒక జిబి ఉచితంగా అందిస్తుంది. ఎస్‌టివి 389తో రూ.389 మెయిన్ అకౌంట్‌లో రూ.71 డెడికేటెడ్ అకౌంట్, ఒక జిబిని 30 రోజుల పాటు అందించనుంది. మరిన్ని వివరాలకు 1800 180 1503లో సంప్రదించవచ్చు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరేట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27120	29005.35	0.4%
ముంబై	28070	30021.39	0.54%
ఢిల్లీ	27400	29304.81	0%
కోల్‌కతా	28010	29957.22	0%
కేరళ	26400	28235.29	0.75%
బెంగళూరు	26550	28395.72	0.34%
హైదరాబాద్	27120	29005.35	0.4%
గల్ఫ్	1337.28	1430.25	0.5%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	40800.00	40600.00	0.49
ముంబై	40800.00	40600.00	0.49
ఢిల్లీ	40800.00	40600.00	0.49
కోల్‌కత్తా	40800.00	40600.00	0.49
హైదరాబాద్	40800.00	40600.00	0.49



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	313	విశాఖపట్నం	320
వరంగల్	315	చిత్తూరు	365
విజయవాడ	311	చెన్నై	372
గోదావరి	311	బెంగళూరు	360

జౌళిపై జాలి చూపారు



- వస్త్ర సంబంధిత పనులపై జిఎస్‌టి 18 నుంచి 5శాతానికి తగ్గింపు
- ట్రాక్టర్ విడిభాగాలపై 28 నుంచి 18శాతానికి..
- జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను మండలి(జిఎస్‌టి కౌన్సిల్)20వ సమావేశం శనివారం వ్యవసాయ పనిముట్ల ధరలను చౌకగా లభించేలా చేసేందుకు కొన్ని ట్రాక్టర్ల విడిభాగాలపై పన్ను రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో ఏర్పాటైన జిఎస్‌టి సమావేశానికి అన్ని రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. వస్త్ర సంబంధిత అన్ని పనులపై పన్నును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. నేత పని మొదలుకుని ఎంబ్రాయిడరీ వరకు అన్ని పన్నులకు జిఎస్‌టి ఇదివరకు నిర్ణయించిన 18 శాతం నుంచి 5 శాతానికి జిఎస్‌టి కౌన్సిల్ తగ్గించింది. ఈ తగ్గింపు దుస్తులు, శాలువలు, కార్పెట్లు వంటి అన్నింటికి వర్తిస్తుంది.

ఇ-వే బిల్లు అంశాలు ఖరారు

రూ. 50,000 కన్నా ఎక్కువ విలువ ఉన్న వస్తువులు అమ్మిన ప్రదేశం నుంచి 10 కిమీ. కంటే ఎక్కువ దూరానికి తీసుకెళ్లాలనుకుంటే ఆన్‌లైన్‌లో ముందస్తు గానే రిజిస్ట్రేషన్ సుకోవాలసి ఉంటుంది. ఇ-వే బిల్లు యంత్రాంగం అక్టోబరు 1 నుంచి అమలులోకి రాను న్నది. ఇచ్చిన పర్మిట్లు ఒక రోజు మాత్రమే వస్తువులను 100 కిమీ. మేరకు తీసుకుపోడానికి, అదే అనుపాతంలో తదుపరి రోజులకు అనుమతినిస్తాయి. ముసాయిదా అంశాల ప్రకారం జిఎస్‌టిఎన్ 120 రోజులకు చెల్లుబాటు అయ్యే ఇ-వే బిల్లులను రూపొందిస్తాయి. దూరాన్ని బట్టి రోజుకు 100 కిమీ. చొప్పున 3 రోజులకు 100 కిమీ నుంచి 300 కిమీ. మేరకు, అలాగే ఐదు రోజులకు 300 కిమీ నుంచి 500 కిమీ వరకు, అలాగే 10 రోజులకు 500 కిమీ నుంచి 1000 కిమీ. వరకు ఉండే ఇ-బిల్లులను రూపొందిస్తారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానంతరం జైట్లీ విలేకరులతో మాట్లాడుతూ 'ఇ-వే బిల్లులకు సంబంధించిన దరఖాస్తు తేదీని త్వరలో ప్రకటిస్తామని, అది మినహాయింపు పొందిన వస్తువులకు వర్తించదు' అని అన్నారు. 'చెక్‌పోస్టులు ఉండవని, అంతా టెక్నాలజీ ప్రక్రియగానే ఉంటుందని, మానవ సిబ్బంది జోక్యం తక్కువ ఉండేలా చూస్తామని, ఈ విధానం ముందుకు సాగినకొద్దీ సమీక్షిస్తాం' అని జైట్లీ చెప్పారు. జిఎస్‌టి కింద ప్రభుత్వ వర్క్ క్రాంట్రాక్ట్‌లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో పాటు 12 శాతం పన్ను విధిస్తారని జైట్లీ చెప్పారు. 71 లక్షల మంది కన్నా ఎక్కువ కేంద్ర, రాష్ట్ర పన్ను చెల్లింపుదారులు వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) విధానానికి మారారని, పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇంకా కొత్తగా 15.67 లక్షల మంది రిజిస్ట్రేషను దరఖాస్తులు అందాయని జైట్లీ తెలిపారు. జిఎస్‌టి కింద తగ్గించిన పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు బదలాయించాలని కూడా ఆయన ఈ సందర్భంగా కోరారు. ఒకవేళ అలా చేయకపోతే లాభ నిరోధక యంత్రాంగం పని మొదలవుతుందని అన్నారు. లాభ నిరోధక చర్యలను, జిఎస్‌టి అమలయ్యాక పన్ను తగ్గింపు వినియోగదారులకు బదలాయించారా లేదా అన్నది పరిశీలించేందుకు 15 రోజులలోగా స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు లాంఛనప్రాయంగా జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదించింది. అన్‌బ్రాండెడ్ ఆహార పదార్థాలన్నింటినీ పన్ను నుంచి మినహాయించారు. అయితే బ్రాండెడ్ ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలకు మాత్రం 5 శాతం పన్ను విధించారు.

15 రోజుల్లోగా స్క్రీనింగ్ కమిటీలు

రాష్ట్రాలు తమ స్క్రీనింగ్ కమిటీలు 15 రోజులలోగా ఏర్పాటు చేస్తాయని, అదే సమయంలో కేంద్రం స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తుందని రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా చెప్పారు. ఈ కమిటీలు మొదట లాభార్జనలపై ఫిర్యాదులను స్వీకరిస్తాయి.ఈసారి జూనియర్ ఫిఫా ప్రపంచ కప్‌ను భారత్ నిర్వహిస్తోంది. కనుక దీనికి సంబంధించిన వస్తువులు, సేవలకు పన్ను మినహాయింపు నివ్వాలని జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయించింది.

క్యాబ్ సర్వీసులకూ జిఎస్‌టి

చిన్నచిన్న ఇంటిపనులకు అంటే ప్లంబింగ్ లేక ఇతరాలు రివర్స్ చార్జి మెకానిజం కింద జిఎస్‌టి చెల్లించాల్సి ఉంటుంది. క్యాబ్ సర్వీస్‌లు అందించే ఆపరేటర్లు ఇన్‌పుట్ క్రెడిట్‌ను కోరుకున్నట్లయితే 12 శాతం, అది కోరు కోకుంటే 5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోజిఎస్‌టి కౌన్సిల్ తదుపరి సమావేశం హైదరాబాద్‌లో సెప్టెంబర్ 9న జరగనున్నదని అరుణ్ జైట్లీ విలేకరులకు తెలిపారు.

జియో మాదిరిగా ఎయిర్‌టెల్ ఆఫర్

న్యూఢిల్లీ: టెలికామ్ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ రూ. 399కి రోజుకు 1 జిబి డేటా చొప్పున 84 రోజుల ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఇది రిలయెన్స్ జియో రూ. 399 ప్లాన్‌లానే ఉంది. ఎయిర్‌టెల్ వెబ్‌సైట్ ప్రకారం ఈ ఆఫర్ 4జి హ్యాండ్‌ఖసెట్‌లు, 4జి సిమ్‌లకు మాత్రమే వర్తిస్తుంది. అయితే ఈ ఆఫర్ ప్రత్యేకతలకు, వాణిజ్య, వర్తక ఉద్దేశాలకు క్లబ్ చేయరాదని తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ఆఫర్ కింద డేటాతో పాటుగా అన్ని నెట్‌వర్క్స్‌లో అపరిమిత కాల్స్(లోకల్, ఎస్‌టిడి)ను అందించనుంది. ఎయిర్‌టెల్ మరో ప్లాన్ కింద రూ. 244కి రోజుకు 1 జిబి డేటా చొప్పున 70 రోజులు అందించనున్నది. ఈ ఆఫర్ కింద కేవలం ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లోనే వినియోగదారులు ఉచిత కాల్స్ సదుపాయం పొందగలరు. భారత దేశంలోని 50 కోట్ల ఫీచర్ మార్కెట్‌లో 50 శాతం కైవసం చేసుకోడానికి గత నెల జియో తక్కువ ధరకు 4జి ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. జియో మార్కెట్‌లోకి ప్రవేశించాక ఇతర టెలికామ్ కంపెనీలతో పాటు ఎయిర్‌టెల్ కూడా కొత్త ఆఫర్లు ప్రకటిస్తోంది. అయినప్పటికి 2012 డిసెంబర్ తర్వాత ఈ త్రైమాసికం ఫలితాల్లో ఎయిర్‌టెల్ అతి తక్కువ లాభదాయకతను తన ప్రకటనలో పేర్కొంది.

ఫ్లిప్‌కార్ 'డెబిట్' ఇఎంఐ సౌకర్యం

బెంగళూరు: ఆన్‌లైన్ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ వినూత్న పంథాను అవలంబించబోతుంది. కొనుగోలుదారులకు సరికొత్తగా నెలవారీ కిస్తులుగా చెల్లించే(ఈక్విటీ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్) అవకాశం కల్పించబోతున్నది. ఇంత వరకు అనేక సంస్థలు తమ ఉత్పత్తులను క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికే ఇఎంఐ సౌకర్యం కల్పించేవారు. ఇక నుంచి ఫ్లిప్‌కార్ట్ డెబిట్ కార్డులతో కొనుగోలు చేసేవారికి కూడా ఇఎంఐ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వార్షిక బిగ్‌బిలియన్ డేస్ సందర్భంగా ఈ అవకాశం ఇవ్వనుంది. దీని వల్ల సంస్థ ఆదాయం, అమ్మకాలు పెరుగుతాయని ఆ కంపెనీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈ ఆఫర్ పొందాలంటే అందరికీ వీలుండదు. వినియోగదారుల అంతర్గత సమాచారం ఆధారంగా సంస్థ కొంత మందిని మాత్రమే ఎంపిక చేస్తుంది. ఈ సేవలను ప్రారంభించే క్రమంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్‌లతో కలసి ఫ్లిప్ కార్ట్ పనిచేయనుంది. 'వినియోగదారుల గత కొనుగోలు తీరును, ఇతర వివరాలను పరిశీలించిన తర్వాతే కొంతమందికి వారి డెబిట్ కార్డులపై ఇఎంఐ సౌకర్యం కల్పిస్తాం' అని ఫ్లిప్‌కార్ట్ డాట్ కామ్ సీనియర్ డైరెక్టర్ సందీప్ కర్వా చెప్పారు. భారత రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2017 జూన్ నాటికి దేశంలో 79 కోట్ల డెబిట్ కార్డుదారులు ఉన్నారని, క్రెడిట్ కార్డులు వాడే వాళ్లు కేవలం 3.1 కోట్లు మాత్రమే ఉన్నారని సందీప్ తెలిపారు.

గడువు తీరినా ఐటి రిటర్న్ దాఖలుకు అవకాశం



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయపు పన్ను(ఐటి)ను దాఖలు చేసే తుది గడువు ఆగస్టు 5తో పూర్తయింది. ఈ గడువులోగా ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయలేకపోయినవారు కంగారుపడాల్సిన పనిలేదు. అందుకు మరో ప్రత్యామ్నాయ మార్గం ఉంది. ఆలస్యమైన ఐటి రిటర్న్‌లు దాఖలు చేయవచ్చు. అందుకు గడువుకు ముందు అనుసరించే పద్ధతులనే అనుసరించాల్సి ఉంటుంది. అయితే ఉండే తేడా అల్లా మీరు సెక్షన్ 139(1) కింద దాఖలు చేయాల్సిన ఐటి రిటర్న్‌ను సెక్షన్ 139(4)కింద దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆలస్యంగా దాఖలు చేసే రిటర్న్‌లను జాగ్రత్తగా సరిచూసుకుని మరీ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా మీరు సరి చూసుకోవలసింది: ఎ) ఏ ఆదాయపు పన్ను ఫారమ్ మీకు వర్తిస్తుంది. మీకు ఆదాయం వచ్చే మార్గాన్నిబట్టి మీ ఆదాయపు పన్ను ఫారమ్ ఉంటుంది. ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను శాఖ కొత్త ఐటి రిటర్న్ ఫారాలను ప్రకటిస్తోంది. బి) ఆలస్యంగా ఐటి రిటర్న్‌లు దాఖలు చేసేందుకు తుది గడువు 2018 మార్చి 31. సి) మీరేమైనా పన్ను బాకీ పడితే(అడ్వాన్స్ ట్యాక్స్, టిడిఎస్ కోసాక) మాత్రం జరిమానాగా నెలకు 1 శాతం వడ్డీని కట్టాల్సి ఉంటుంది. బాకీ లేకపోతే మాత్రం ఎలాంటి జరిమానా కట్టాల్సి ఉండదు. మీరు ఐటి రిటర్న్‌ను ఆలస్యంగా దాఖలు చేయాలనుకున్నా జరిమాన వడ్డీ కట్టకుండా కూడా జాగ్రత్తపడవచ్చు. అందుకు మీరు బాకీ ఉన్నది సకాలంలో కట్టేయాలి. ఐటి రిటర్న్‌లు దాఖలు చేయడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారానైనా దాఖలు చేయవచ్చు. లేదా ఎక్సెల్/జావా యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని పూరించి అప్‌లోడ్ చేయవచ్చు. ఇ-ఫైలింగ్‌కు ఉపయోగించాల్సిన వెబ్‌సైట్: www.incometaxindia efiling.gov.in. ఈ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మీరు ఐటి రిటర్న్‌ను దాఖలు చేయవచ్చు. మీ ఐటి రిటర్న్‌లు అందుకున్నాక ఆదాయపు పన్ను శాఖ ప్రాసెస్ చేసి మీకు ఎస్‌ఎంఎస్ లేక ఇమెయిల్ ద్వారా తెలుపుతుంది.

బంగారం ధర రూ.200 పతనం



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం ధర రూ. 200 మేరకు పతనమై 10 గ్రాముల బంగారం ధర రూ. 29,420 వద్ద ట్రేడయింది. స్థానికంగా డిమాండ్ తగ్గడం, ప్రపంచ మార్కెట్‌లో కూడా బలహీనత కనిపించడం వల్ల దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారు ధర పతనమైందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. బంగారం ధర బాటలోనే వెండి కూడా రూ. 825 మేరకు పడిపోయి కిలో వెండి రూ. 38,325 వద్ద ట్రే డయింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు కొనుగోళ్లు తగ్గించడంతో వెండి ధర తగ్గిందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముఖ్యంగా న్యూయార్క్‌లో బంగారం ధర 0.75 శాతం తగ్గి ఔన్స్ బంగారం ధర 1258.40 డాలర్ల వద్ద ట్రేడయింది. ఇక వెండి 2.49 శాతం పతనమై ఔన్స్ వెండి 16.24 డాలర్ల వద్ద ట్రేడయింది. ఇదిలా ఉండగా డాలరుతో రూపాయి మారకం విలువ పెరగడంతో దిగుమతులు ధర చౌక అయింది. రూపాయి విలువ రెండేళ్ల గరిష్ఠానికి పెరిగి డాలరుకు రూ. 63.58 వద్ద ట్రేడయింది. బంగారు ధర పతనం కావడానికి స్థానిక నగల వర్తకులు, రిటైలర్లు ఊతమిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛ బంగారం 10 గ్రాములు రూ. 29,420గాను, 99.5 శాతం బంగారం రూ. 29,270 వద్ద ట్రేడయింది. వెండి నాణేల ధర మాత్రం స్థిరంగా ఉంది. 100 పీస్‌ల కొనుగోలు ధర రూ. 72,000గా , అమ్మకం ధర రూ. 73,000 గా ఉంది.

స్టీరింగ్ సమస్యతో 8 లక్షల జిఎం కార్లు రీకాల్



వాషింగ్టన్: అమెరికాకు చెందిన అతిపెద్ద ఆటో మేకర్ జనరల్ మోటార్స్ సంస్థ భారీ ఎత్తున వాహనాలను రీకాల్ చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 8లక్షల పికప్ ట్రక్కులను వెనక్కి తీసుకుంటోంది. ఆ కంపెనీ విడుదల చేసిన దస్తావేజులు ఈ విషయాన్ని వెల్లడించాయి. నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. షెవర్లే సిల్వరాడో 1500, జిఎంజి సియర్రా1500 పికప్ ట్రక్కులను రీకాల్ చేస్తోంది. 2014 నాటి మోడల్ ట్రక్కులు షెవర్లే సిల్వరాడో 1500, జిఎంసి సియర్రా1500 లలో తాత్కాలికంగా విద్యుత్ శక్తి స్టీరింగ్‌లో లోపాలు, ముఖ్యంగా తక్కువ వేగంతో మలుపులు తిప్పే సమయంలో తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నాయని జనరల్ మోటార్స్ ప్రకటిచింది. అందుకే వీటిని రీకాల్ చేస్తున్నట్టు తెలిపింది. అమెరికాలో 6 లక్షల 90వేల వాహనాలను, కెనడాలో 80వేల వాహనాలతోపాటు ఇతర మార్కెట్లలో 25వేల వాహనాలను రీకాల్ చేస్తోంది. అయితే జిఎం డీలర్లు కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఈ లోపాన్ని పరిష్కరించనున్నారని ప్రకటించింది. అయితే ఈ వాహనాల రీకాల్‌కు ప్రమాదాలు, గాయాలకు ఏమైనా సంబంధం ఉందా? అన్నదానికి తమ దగ్గర ఎలాంటి సమాచారం లేదని జిఎం ప్రతినిధి టామ్ వికిన్‌సన్ పేర్కొన్నారు. అయితే పవర్ స్టీరింగ్‌ను పనికిరాకుండా చేస్తున్న తాత్కాలిక లోవోల్టేజిని సరిదిద్దడానికి 2015 పూర్వపు మోడల్ వాహనాల్లో కొన్ని మార్పులను చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటర్లకు తెలిపింది. అయితే వాహనాల మరమ్మతులను డీలర్లు ఎప్పుడు మొదలెడతారన్న విషయాన్ని జిఎం కంపెనీ వెల్లడించలేదు.

జిఎస్‌పిసి బ్లాకులో 80% వాటా కొన్న ఓఎన్‌జిసి



బెంగళూరు: కృష్ణా గోదావరి బేసిన్(కెజి)లో గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్‌కు (జిఎస్‌పిసి) లో ఉన్న ఒక బ్లాకులో 80% వాటాలను(పార్టిసిపేటింగ్ ఇంటరెస్ట్) ఓఎన్‌జిసి కొనుగోలు చేసింది. ఇందుకు రూ.7,738 కోట్లు చెల్లించింది. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలోనే ఈ రెండు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత నెలలో దీనికి ఆమోదముద్ర వేసింది. దీంతో కొనుగోలును పూర్తి చేసినట్టు ఓఎన్‌జిసి తాజాగా ప్రకటించింది. డిడిడబ్ల్యూలో మిగిలిన 20 శాతం వాటాలో 10% జియో గ్లోబల్ రీసోర్సెస్‌కు, 10 శాతం జులిలెంట్ ఆఫ్‌షోర్ డ్రిల్లింగ్ లిమిటెడ్‌కు ఉన్నాయి. ఇందులో జియో గ్లోబల్ 10% వాటాను జిఎస్‌పిసి కొనుగోలు చేయనుంది. దీన్ దయాళ్ వెస్ట్ ఫీల్డ్ కాకుండా మరి ఆరు భవిష్యత్ అన్వేషణలను దృష్టిలో ఉంచుకుని జిఎస్‌పిసికి 200 మిలియన్ డాలర్లను ఓఎన్‌జిసి అడ్వాన్సుగా చెల్లించింది. కృష్ణ, గోదావరి బేసిన్‌లో చమురు, గ్యాస్‌కు సంబంధించి హై ప్రెషర్ హై టెంపరేచర్(హెచ్‌పిహెచ్‌టి) నడవను అభివృద్ధి చేసే ఉద్దేశం కూడా ఓఎన్‌జిసికి ఉంది.

గిరిజన సమాజానికి ఎస్‌బిఐ రూ.20లక్షల విరాళం

మన తెలంగాణ/హైదరాబాద్: విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఎం.డి(ఎన్‌బిజి) రజనీష్‌కుమార్ అన్నారు. కార్పొరేట్ సామాజిక సేవలో ఎస్‌బిఐ అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. గిరిజన పేదలకు ఉచిత విద్యను అందిస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ హైదరాబాద్, కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో రజనీష్‌కుమార్ శనివారం విరాళంగా ఎస్‌బిఐ తరపున రూ.20లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బిఐ ఫౌండేషన్ తరపున తాము అనేక సేవా కార్యక్రమాలను అందిస్తున్నామని, ప్రధానంగా విద్య, వృత్తి నైపుణ్య శిక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన తదితర కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. తమ ఫౌండేషన్ తరపున సేవలను అందించడంతో పాటు సామాజిక సేవలను అందిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా తగిన సహాయాన్ని చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్‌బిహెచ్ అన్ని సర్కిల్స్ కూడా సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేదలకు ఉచిత విద్యను అందించడాన్ని ఆయన అభినందించారు. కాగా ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ దేశ వ్యాప్తంగా 52,000 గ్రామాలలో గిరిజన పిల్లలకు వారి వారి మాతృ భాషలో విద్యను అందిస్తున్నదని, ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో100 పాఠశాలలో గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని ఆ సంస్థ కార్యదర్శి అశోక్‌కుమార్ ఠాకూర్ తెలిపారు. ఆరోగ్యం, పర్యవరణం, మానవత విలువలపై గిరిజన విద్యార్థులలో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ప్రతి పాఠశాలలో 25 నుంచి 35 మంది పిల్లల్లకు బోధిస్తున్నామని, స్థానిక ఉపాధ్యాయులుగా ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం హర్‌దయా ప్రసాద్, జిఎం గిరిధర కిని, సిడివో,డిజిఎం ఆర్. రాధాకృష్ణ, హైదరాబాద్ సర్కిల్ పబ్లిక్ రిలేషన్ ఎజిఎం వీరశేఖర్‌తో పాటు ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ అధ్యక్షులు కేదర్‌నాథ్ అగర్వాల్, వర్కిం గ్ ప్రెసిడెంట్ వినోద్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ కౌన్సిల్ సహకారంతో సప్తన్ స్టోరీస్

మన తెలంగాణ/హైదరాబాద్: యూకెఇండియా ఇయర్ ఆఫ్ కల్చర్ 2017లో భాగంగా బ్రిటీష్ కౌన్సిల్ ఇండియా ఆర్డ్‌మాణ్ యూనిమేషన్స్ సహకారంతో సప్తన్ స్టోరీస్‌ను ప్రారంభించారు. యూకెకు చెందిన ఏడుగురు ప్రముఖ కళాకారులు, ప్రజలు కలిసి భారత్ కోసం విన్నూత్నమైన ఆన్‌లైన్ కార్యక్రమాన్ని రూపొందించారు. చక్కటి కథలను సరికొత్త వెబ్‌సైట్, కమ్యూనిటీ హబ్‌ల ద్వారా ఈ కార్యక్రమాలను వీక్షించవచ్చు. ఒబిఇ డైరెక్టర్ ఇండియా, బ్రిటీష్ కౌన్సిల్ అలాన్ గెమ్మెల్ మాట్లాడుతూ.. సప్తన్ స్టోరీస్ ఆహ్వానంతో భారత్‌లో తరతరాలుగా వస్తున్న కథలు చెప్పడమనే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఆర్డ్‌మాన్ ఇంటరాక్టివ్ క్రియేటివ్ డైరెక్టర్ నీల్ పెమర్ మాట్లాడుతూ.. ఆర్డ్‌మాన్‌లో చేస్తున్న ప్రతి కథ కథాంశం ఎంతో ప్రధానమైందని, సప్తన్ స్టోరీస్ కోసం బ్రిటీష్ కౌన్సిల్‌తో పనిచేయడం ఆనందంగా ఉందని అన్నారు.

నేను చట్టాన్ని ఉల్లంఘించలేదు : మంత్రి శివకుమార్

బెంగళూరు: పన్ను ఎగవేత కేసులో వరుసగా మూడు రోజుల పాటు ఐటి శాఖ విచారణను ఎదుర్కొన్న కర్నాటక రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి డికె శివకుమార్ తాను చట్టాన్ని ఉల్లంఘించలేదని శనివారం అన్నారు. అంతిమంగా సత్యం బయటకు వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎన్నికలకు ముందుగా బిజెపి ఫిరాయింపులకు, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఇక్కడ ఒక రిసార్టుకు తరలించిన గుజరాత్ రాష్ట్రంలోని 44 మంది కాంగ్రెస్ ఎంఎల్ఎలను పర్యవేక్షిస్తున్న శివకుమార్‌కు సంబంధించిన పలు ఆస్తులపై ఐటి సిబ్బంది బుధవారం దాడులు చేసిన సంగతి తెలిసిందే. 'నేను చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించే వ్యక్తిని కాను. సత్యం బయటకు వస్తుంది' అని ఇక్కడ ఖరీదైన తన నివాసం నుండి వెలుపలికి వచ్చిన ఆయన విలేకరులతో అన్నారు. దేశవ్యాప్తంగా ఆయనకు సంబంధించిన సుమారు 66 ఆస్తులపై ఐటి అధికారులు దాడులు చేసి ఇప్పటివరకు నగదు సహా రూ.15 కోట్లకు పైగా విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో తనకు వెన్నుదన్నుగా నిలిచినందుకు పార్టీకి, పార్టీ నాయకత్వానికి శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా, సోపూర్ ప్రాంతంలో భద్రతా దళలతో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు వెల్లడించారు. సోపూర్‌లోని అమర్‌గఢ్ ప్రాంతంలో ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి నిఘా వర్గాలు అందించిన సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరపగా భద్రతా దళాలు వాటిని తిప్పికొట్టాయని ఆయన చెప్పారు. ఈ పోరులో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టామని, వారి నుండి మూడు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

ఆప్ ఎంఎల్‌ఎకు జ్యుడిషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్ఎల్ఎ కమాండో సురీందర్ సింగ్‌ను పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తున్నారంటూ నమోదైన కేసుకు సంబంధించి విచారణకు కోర్టులో హాజరుకాకపోవడంతో పోలీసులు శనివారం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సురీందర్‌ను కోర్టులో హాజరు పర్చగా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అశు గార్గ్ ఈ నెల 17 వరకు సింగ్‌కు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. నైరుతి ఢిల్లీలోని నరైనా ప్రాంతంలో పోస్టర్లు, హోర్డింగ్స్‌లు పెట్టి ప్రభుత్వ ఆస్తులను పాడుచేస్తున్నారంటూ 2014లో సురీందర్‌పై సింగ్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

సుప్రీంలో 'లవ్ జిహాదీ' కేసు

న్యూఢిల్లీ: ఓ అరుదైన కేసు శనివారం సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. సుప్రీంలో ఇలాంటి కేసు విచారణకు రావడం ఇదే తొలిసారి. ఇస్లాం మతాన్ని స్వీకరించిన ఓ హిందూ మహిళ, ఓ ముస్లిం యువకుడి వివాహాన్ని 'లవ్ జిహాదీ'గా పేర్కొంటూ కేరళ హైకోర్టు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆ యువకుడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారించిన కోర్టు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ), కేరళ ప్రభుత్వాలు స్పందించాలని సూచించింది. కేరళలోని మాలప్పురమన్ జిల్లాకు చెందిన 24 ఏళ్ల హాదియాను బలవంతంగా ఇస్లాం మతం స్వీకరించేలా చేశారని, లవ్ జిహాదీ కుట్రలో భాగంగానే ఈ వివాహం జరిగిందని పేర్కొంటూ మే 25న కేరళ హైకోర్టు ఈ వివాహాన్ని రద్దు చేసింది. ఇలాంటి కేసులపై సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసులను ఆదేశించింది. కాగా, ఈ కేసును సీరియస్, సున్నితమైనదిగా తీసుకోవాలని, ఎన్ఐఎ, బాధిత మహిళ తండ్రి ఈ ఉదంతానికి సంబంధించిన అన్ని వివరాలను కోర్టుకు సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, జస్టిస్ చంద్రాసూద్‌లతో కూడిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది.

దినకరన్‌పై పళని వర్గం ఆగ్రహం

చెన్నై: శశికళ మేనల్లుడు దినకరన్ వ్యవహార శైలిపై తమిళనాడు ఆర్థిక మంత్రి డి జయకుమార్ మండిపడ్డారు. పార్టీ ఆఫీసుబేరర్లుగా దినకరన్ కొందరిని నియమించడంపై అనుచితం అని, ఆయనకు ఏం అధికారం ఉందని ఈ నియామకాలు జరిపారని ప్రశ్నించారు. ఇసికి ముడుపుల కేసులో అరెస్టు అయి విడుదల అయిన దినకరన్ తిరిగి పార్టీలో ఐక్యతకు, పటిష్టతకు పాటుపడుతానని ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన తీరును ముఖ్యమంత్రి పళనిస్వామి వర్గీయులు తప్పుపట్టారు. ఓ వైపు పార్టీ ప్రధాన కార్యదర్శి వికె శశికళ నియామకమే ఇప్పుడు కోర్టు వ్యాజ్యాలలో పడిందని, ఎన్నికల సంఘం పరిశీలనలో ఉందని, ఈ దశలో దినకరన్ చర్యలకు అర్థంపర్థం లేదని జయకుమార్ విమర్శించారు. ఆయన నియామకాలకు చెల్లుబాటు ఉండదని స్పష్టం చేశారు.

ఆధార్ సాయంతో కుటుంబాలను కలిసిన తెలుగు రాష్ట్రాల చిన్నారులు

బెంగళూరు: కొన్నేళ్ల కిందట తమ కుటుంబాలకు దూరమైన ముగ్గురు మానసిక, శారీరక కౌమార వికలాంగులు ఆధార్ సాయంతో శనివారం తమ తల్లిదండ్రుల చెంతకు చేరుకున్నారు. ఇక్కడి భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ప్రాంతీయ కార్యాలయం మే 28న చేపట్టిన ఆధార్ నమోదు కార్యక్రమం సందర్భంగా బళ్లారిలోని ప్రభుత్వ రంగ అనాథాశ్రమంలోని సదరు వికలాంగుల బయోమెట్రిక్ వివరాలు తిరస్కరణకు గురయ్యాయి. వారి వివరాలు అప్పటికే డేటాబేస్‌లో ఉన్నందున మరోసారి వాటిని సాఫ్ట్‌వేర్ స్వీకరించలేదని అధికారులు తెలిపారు. డేటాబేస్‌లోని వివరాల సాయంతో వారి నేపథ్యాలను పూర్తిగా తెలుసుకున్న తర్వాత వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించామని అధికారులు చెప్పారు. దాంతో బళ్లారిలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) కార్యాలయంలో వికలాంగులను వారి తల్లిదండ్రుల తో ఒక్కటి చేసే దిశగా ఆయా రాష్ట్రాల్లోని సంబంధిత స్థానిక ప్రభుత్వ సంస్థల అధికారులతో సంప్రదింపులు జరిపామని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా, గుడివాడ గ్రామానికి చెందిన కల్యాణ్ (14), చిత్తూరు జిల్లా, పలమనేరు మండలానికి చెందిన బి.బాబు (17), తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా, కొట్చిర గ్రామానికి చెందిన మాధవ్ రాజన్న (17)లను వారి కుటుంబాలతో కలుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంపి పదవికి ఆదిత్యనాథ్ రాజీనామా

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎంపి పదవికి రాజీనామా చేశారు. గోరఖ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థానం నుంచి ఐదు సార్లు ఎన్నికైన ఆయన ఇటీవలి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వరకు రాజీనామా చేయకుండా ఆగారు. తాజాగా ఫలితాలు కూడా వెలువడడంతో రాజీనామా సమర్పించారు. ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆదిత్యనాథ్ రాష్ట్ర చట్టసభల్లోని ఒకటైన శాసనమండలి నుంచి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనమండలిలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ముగ్గురు, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన ఒకరు వైదొలిగారు. ఈ నేపథ్యంలో ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లకుండా తన ఇద్దరు డిప్యూటీ సిఎంలు దినేశ్ శర్మ, కేశవ్‌ప్రసాద్ మౌర్యతో కలిసి ఆదిత్యనాథ్ ఆ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

వైద్యురాలు సూర్యకుమారి మిస్టరీ విషాదాంతం



విజయవాడ: సంచలనం సృష్టించిన వైద్యురాలు సూర్యకుమారి అదృశ్యంపై నెలకొన్న ఉత్కంఠ చివరికి విషాదాంతమైంది. రైవస్ కాల్వలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఆమె మృతదేహాన్ని గుర్తించాయి. గత నెల 31న ఆమె అదృశ్యం కావడంతో ముమ్మర దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శనివారం ఆమె బైక్‌ను గుర్తించారు. గాంధీనగర్ సమీపంలోని రైవస్ కాల్వలో ద్విచక్రవాహనాన్ని గుర్తించిన పోలీసులు సూర్యకుమారి కాల్వలో దూకి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. ఈ మేరకు మాచర్ల పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సుమారు 13 కిలోమీటర్ల మేర ఉన్న ఆ కాల్వలో ముమ్మరంగా గాలించి సూర్యకుమారి మృతదేహాన్ని గుర్తించాయి. కృష్ణా జిల్లా నిడమానూరు వైపు వెళ్లే కాల్వలో ఓ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సూర్యకుమారి కుటుంబ సభ్యులు నగల ఆధారంగా ఆమె మృతదేహాన్ని గుర్తించారు.

వెనుకంజ లేని వెంకయ్య

సిద్ధాంతాల అంకితభావంతో విజయాల మాల



న్యూఢిల్లీ: అలుపెరగని పయనం... స్ఫూర్తిదాయకమైన సంయమనం...ఇదే ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యక్తిత్వపు సంతకం. భారత ఉపరాష్ట్రపతిగా దక్షిణాదికి, అందులోనూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఎన్నిక కావడం కీలక ఘట్టంగా మారింది. రాజకీయ దిగ్గజంగా ఆయన ఎదగడానికి కారణం ఆయన పాటించిన సైద్ధాంతిక విశ్వసనీయత. తాను ఎంచుకున్న సంఘ్‌పరివార్ ఆలోచనా సరళికి అనుగుణంగానే ఆయన రాజకీయ ప్రస్థానం సాగింది.

నెల్లూరు గడ్డకు ప్రముఖ నేత వాజ్‌పేయి వచ్చినప్పుడు వేదిక మీద నిలబడి ముందు మాటలు చెప్పిన వెంకయ్య , బిజెపి అంతకు ముందు జనసంఘ్ పోస్టర్లను గోడలపై అతికించిన నాయుడు తరువాత తరువాత తన రాజీలేని వ్యక్తిత్వ విశిష్టతతో దేశ రాజకీయాలలో తిరుగులేని నాయకుడు అయ్యారు. ఇప్పుడు రాజ్యాంగపరంగా రెండు కీలకమైన పదవులలో ఒక స్థానం దక్కించుకున్నారు. బిజెపిలో అత్యంత దూరదృష్టి గల నేతలలో వెంకయ్య నాయుడు ముందు వరసలో ఉన్నారు.పార్టీలో, ప్రభుత్వంలో పరిష్కారాల సాధకుడిగా పేరుతెచ్చుకున్న ఆ ఉషాపతిని ఉపరాష్ట్రపతి పదవి వరించింది. నెల్లూరు జిల్లాలో ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన 68 సంవత్సరాల వెంకయ్య దీర్ఘకాలిక రాజ్యసభ సభ్యత్వ అనుభవం ఉంది. ఎగువ సభ సమర్థవంతమైన నిర్వహణకు ఈ పూర్వ రంగం, అంతకు మించి ఎదుటివారిని కట్టిపడేసే ఆయన వాగ్ధాటి బాగా పని చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎగువసభకు సరైన సారథి

ఎగుడుదిగుడు ఆధిక్యతల ఎగువసభలో ఆయన సారథ్యం తమకు బాగా పనికివస్తుందని అధికార పక్షం అంచనాలు వేసుకుంది. బిజెపిలో కీలక పదవులు చేపట్టి పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వర్తించిన ఆయన పలు మంత్రిత్వశాఖలను కూడా నిర్వర్తించారు. ఇంతటి విశిష్టతను సంతరించుకోవడం వెనుక నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన పయనం సమ్మిళితం అయి ఉంది. 1970 ప్రాంతంలో దక్షిణాదిలో జన్‌సంఘ్ నామమాత్రంగానే ఉన్న దశలో యువ కార్యకర్తగా వెంకయ్య నాయుడు రంగ ప్రవేశం చేశారు. అద్వానీ, వాజ్‌పేయిలు నెల్లూరు ఇతర ప్రాంతాలకు వచ్చినప్పుడు స్వాగత వ్యాక్యాలు పలకడంతో మొదలైన ఆయన ప్రజాజీవిత ఘట్టం తరువాత తరువాత దశలుదశలుగా ఎదిగి చివరికి వారి సరసన కూర్చునే స్థాయికివెళ్లింది. అద్వానీకి ప్రియ శిష్యుడుగా మెదలిన నాయుడు తరువాతి క్రమంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోడీకి అనుకూలంగా నిలిచారు. అద్వానీ మోడీ వ్యతిరేకతను కూడా పట్టించుకోలేదు. అటు వాజ్‌పేయికి, ఇటు అద్వానీకి కూడా అనుంగు శిష్యుడిగా గుర్తింపుపొందిన వెంకయ్య నాయుడు వర్తమాన రాజకీయాలలో మోడీకి విశ్వాస పాత్రుడిగా నిలిచారు. పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార ప్రసారాలు, గ్రామీణాభివృద్ధి వంటి కీలక మంత్రిత్వశాఖలను చేపట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ఎబివిపి కార్యకర్తగా ఉన్న వెంకయ్య ఇందిరను విమర్శిస్తూ ప్రసంగించారు. జైలు పాలయ్యారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా సమర్థతను కనబర్చిన ఆయన పార్లమెంట్ ప్రతిష్టంభనల నివారణలో కీలక పాత్ర పోషించారు. సరైన పద విశేషణలు వాడటంలో ఆయన దిట్ట. మోడీ అంటే మేకింగ్ ఆఫ్ డెవలప్‌డ్ ఇండియా అని అభివర్ణించారు. నెల్లూరు నుంచి పిల్లగాలిగా మొదలై ఢిల్లీలో రాజకీయ హోరుగాలిగా సంయమన సంచలనం సృష్టించిన ఆయన ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా పదవీ పరిధిలో ఒదిగివెలిగే దశకు చేరారు.ఇప్పుడు తాను నా పార్టీ నీ పార్టీ అనే భేదభావం లేని పార్టీయేతర ప్రాణినని నాయుడు శనివారం దేశ రాజధానిలో విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు.

గవర్నర్, సిఎం అభినందనలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరపు వెంకయ్యనాయుడుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావులు వెంకయ్య నాయుడుకు వేర్వేరు ప్రకటనలలో అభినందనలు తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి ఆయన మరింత వన్నె తెస్తారన్నారు.





భారీగా క్రాస్ ఓటింగ్

ప్రతిపక్ష క్యాంప్‌లో ఐక్యతకు బీటలు

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్ష అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీకి పలు షాక్‌లు ఎదురయ్యాయి. క్రాస్ ఓటింగ్, చెల్లని ఓట్లు చివరికి గల్లంతయిన ఓట్లన్నీ వెరశి గాంధీకి ఊహించిన దానికన్నా తక్కువ ఓట్లు దక్కాయి. దాదాపు రెండు డజన్ల మంది ప్రతిపక్ష ఎంపీలు నాయకత్వ ఆదేశాలను ధిక్కరించారని, వెంకయ్యకు అనుకూలంగా ఓటేశారని బిజెపి వర్గాలే వెల్లడించాయి. ప్రకటిత మద్దతు, బలాబలాల మేరకు చూస్తే నాయుడుకు 495 ఓట్లు రావాలి. అయితే ఆయనకు 516 ఓట్లు దక్కాయి. చెల్లుబాటు అయిన ఓట్లలో ఎన్‌డిఎ అభ్యర్థికి 68 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష అభ్యర్థి గాంధీకి 32 శాతం ఓట్లు వచ్చాయి. ఆయనకు 244 ఓట్లు పడ్డాయి. ఇరువురు అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా 272. ఇది గాంధీకి వచ్చిన ఓట్ల కన్నా ఎక్కువ. రాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన కొన్ని పార్టీలు ఉప రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థికి బాసటగా ఉంటామని తెలిపాయి. ఈ విధంగా 40 మంది ఎంపీల అదనపు బలం ఉంటుందని అనుకున్నా ఇందులో కేవలం 19 మంది ఎంపీలే గాంధీకి ఓటేశారు. ఈ విధంగా చేసిన బాసలు మరిచి క్రాస్‌ఓటింగ్ బాగా జరిగిందని వెల్లడైంది. ప్రతిపక్షాలలో ఈ విధమైన అనైక్యతా పరిణామం కాంగ్రెస్ , వామపక్షాలు, టిఎంసిలను కలవరానికి గురిచేసింది. రాష్ట్రపతి అభ్యర్థి మీరాకుమార్‌కు వచ్చిన ఓట్ల కంటే గాంధీకి 19 ఎక్కువ ఓట్లు వచ్చాయనే సంతృప్తి మిగిలింది. రాష్ట్రపతి ప్రతిపక్ష అభ్యర్థి మీరాకు 225 మంది ఎంపీలు ఓటేయగా, గాంధీకి వచ్చేసరికి 244 సంఖ్యాబలం నిలిచింది. ఎన్‌డిఎ రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు అప్పుడు 522 మంది ఎంపీల మద్దతు దక్కింది. బిజెడికి పార్లమెంట్‌లో 28 మంది సభ్యుల బలం ఉంది. జెడియూకు 12 మంది ఎంపీలు ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ఈ మొత్తం 40 మంది సభ్యులు నిజానికి అనుకున్నదాని ప్రకారం అయితే గాంధీకి ఓటేయాలి. కానీ ఈ స్థాయిలో కూడా భారీ క్రాస్ ఓటింగ్ జరిగింది. ఎన్‌డిఎ పంట మరింతగా పండింది. 2012, 2017 ఉప రాష్ట్రపతి ఎన్నికలలో పదవి నుంచి వైదొలుగుతున్న ఇప్పటి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీకి తమ ప్రత్యర్థుల కన్నా వరుసగా 252, 233 ఓట్ల ఆధిక్యత దక్కింది. వివిధ కారణాలతో ఓటేయని 14 మంది ఎంపీలలో నలుగురు టిఎంసి సభ్యులు ఉన్నారు, బిజెపి వారిద్దరు, కాంగ్రెస్‌వారిద్దరూ, ఐయుఎంఎల్ వారిద్దరూ , ఎన్‌సిపి, పిఎంకెకు చెందిన వారు ఒక్కొక్కరు, ఓ నామినేటెడ్ ఎంపీ, ఇండిపెండెంట్ ఎంపీ ఒకరు ఈ ఓటేయని సమూహంలో ఉన్నారు. ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో ఈసారి అత్యధిక శాతం పోలింగ్ జరిగిందని పోలింగ్ అధికారులు తెలిపారు. 2002 ఉప రాష్ట్రపతి ఎన్నికలో అత్యధికంగా 759 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు బిజెపి అభ్యర్థి భైరాన్ సింగ్ షెకావత్ ఎన్నికయ్యారు.

రైల్వే పకోడీలో పురుగు

న్యూఢిల్లీ: రైళ్లలో సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు మనుషులు తినడానికి అనువుగా లేవని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పార్లమెంటులో చెప్పి కనీసం రెండు వారాలు గడవక ముందే ఓ ఉదంతం వెలుగులోకి వచ్చింది. బీహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడు పకోడీలో పురుగును చూసి అవాక్కయ్యాడు. ఆగస్టు 2న మహ్మద్ ఆజాద్ అలీ తన కుటుంబంతో కలిసి ఎస్–9 కోచ్‌లో ప్రయాణిస్తుండగా, పకోడీ కొనుగోలు చేశాడు. తినేందుకు ఉపక్రమిస్తూ యథాలాపంగా పకోడను చూసిన ఆయన షాక్‌కు గురయ్యాడు. అందులో భయంకరంగా కనిపిస్తున్న ఓ పురుగు కనిపించింది. ''ప్యాంట్రీ సిబ్బంది నుంచి పకోడీని కొని నాలుగేళ్ల నా కుమారుడికి కొంత తినిపించాను, అనంతరం అందులో పురుగు కనిపించింది. వెంటనే నేను ప్యాంట్రీ మేనేజర్‌ను కలిసి ఫిర్యాదు చేశాను. ఓ సహచర ప్రయాణికుడు ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా రైల్వే మంత్రిత్వశాఖకు తెలియజేశాడు'' అని మహ్మద్ ఆజాద్ అలీ పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన రైల్వే మంత్రిత్వశాఖ ఈ విషయమై సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వివరించాడు. కాన్పూర్, లక్నో స్టేషన్లలో అధికారులు తనను కలిసి తన ఫిర్యాదు గురించి ఆరా తీశారని తెలిపాడు. లక్నోలో ఓ వైద్యు డు వచ్చి తన కుమారుడికి వైద్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నాడు.



ఉచిత వంటగ్యాస్‌కు ఆధార్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: పేద మహిళలకు అందించే ఉచిత ఎల్‌పిజికి ఆధార్ గడువును కేంద్రం పొడిగించింది. ఉచిత వంట గ్యాస్ పొందాలనుకునే వారు ఆధార్ కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ ఏడాది సెప్టెంబర్ చివరి వరకూ పెంచారు. మార్చిలో ఆధార్ లేకుండా ఉచిత వంటగ్యాసు పొందే అవకాశాన్ని మే 31 వరకూ నిర్ణయించారు. అయితే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ వెలువరించిన నోటిఫికేషన్‌లో సెప్టెంబర్ 30 తుది గడువును పెట్టినట్లు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) ఉండే మహిళలకు ఉచిత వంటగ్యాసు కనెక్షన్‌ను అందించేందుకు కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజనను ప్రవేశపెట్టింది. అయితే చాలా మంది పేద మహిళలకు ఆధార్ కార్డులు లేకపోవడం, ఆధార్ లేకపోతే ఉచిత వంటగ్యాసు కల్పించడం కుదరదని కేంద్రం చెప్పడంతో సమస్య తలెత్తింది. దీనితో పేద మహిళలు విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌ను పొందేందుకు వెసులుబాటు కల్పించారు. అయితే ఇప్పటికీ అత్యధిక సంఖ్యలో మహిళలు ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోకపోవడంతో అందుకు గడువును పొడిగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఆధార్ దరఖాస్తుకు ప్రకటన వెలువరించారు. గత ఏడాది కేంద్రం ఉజ్వల యోజనను ప్రవేశపెట్టింది. దీని పరిధిలో వచ్చే మూడేళ్లలో ఐదు కోట్ల మంది పేద మహిళలకు ఉచిత వంటగ్యాసు కనెక్షన్ ఇవ్వాలని సంకల్పించారు.

యువతికి హర్యానా బిజెపి చీఫ్ కుమారుడి వేధింపులు, అరెస్ట్

చండీగఢ్: హర్యానా బిజెపి అధినేత కుమారుడు ఓ అమ్మాయి వెంటబడి వేధించిన ఘటనలో అరెస్టు అయ్యాడు. బిజెపి అధ్యక్షులు సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా వాహనంలో తన స్నేహితుడితో కలిసి పోకిరీ చర్యకు పాల్పడ్డాడు. కారులో వెళ్లుతున్న ఓ అమ్మాయిని వికాస్ వెంబడించాడని ఆమె చేసిన ఫిర్యాదు మేరకు బరాలాను స్నేహితుడితో పాటు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. వీరిపై ఐపిసి, మోటార్ వాహనాల చట్టం పరిధిలో కేసు నమోదు చేశారు. ఘటనపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తాయి. వీటిపై ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పందించారు. చట్టాన్ని తాము గౌరవిస్తామని, ఎంతటి వారైనా చట్టం తమ పనితాను చేసుకుపోతుందని తెలిపారు. బిజెపి నేత బరాలా మాట్లాడుతూ నిజాలు కోర్టులో తెలుస్తాయని, చట్టాన్ని తాము గౌరవిస్తామని స్పష్టం చేశారు.

మురికిని శుభ్రం చేసుకునేందుకు వెళ్లి మునిగిపోయారు

సముద్రంలో ముగ్గురు విద్యార్థులు మృతి

ముంబయి: సెంట్రల్ ముంబయిలోని తీరప్రాంత సమీపంలో ఉన్న శివాజీ పార్క్ వద్ద విషాదం చోటుచేసుకుంది. తీరం ఒడ్డున ఆడుకుంటున్న ముగ్గురు విద్యార్థులు సముద్రంలో మునిగి మృత్యువాత పడ్డారు. ధారవి ప్రాంతంలో ఉన్న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎమ్‌సి) ఉనల్ మిల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు శివాజీ పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక విద్యార్థి తన బట్టలకు అంటిన మురికిని శుభ్రం చేసేందుకు సముద్రంలోకి వెళ్లి మునిగిపోయాడు. అతన్ని కాపాడేందుకు వెళ్లిన మిగతా ఇద్దరు కూడా సముద్రంలో మునగడంతో ముగ్గురు విద్యార్థులు మృతిచెందినట్టు పోలీసులు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతిచెందిన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలను వెలికితీసినట్టు సీనియర్ పోలీసు అధికారి మిలింద్ ఇద్కర్ పేర్కొన్నారు. మృతులు భరత్ హనుమంత (13), అనూప్ యాదవ్ (16), రోహిత్ యాదవ్ (15) అనే విద్యార్థులుగా పోలీసులు గుర్తించారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్ పనే





రాహుల్‌పై దాడి ఘటనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళనలు

న్యూఢిల్లీ: గుజరాత్ పర్యటనలో తమ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ వాహనంపై దాడి వెనుక బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల హస్తం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శనివారం ఆరోపించారు. ఇది పక్కాగా ముందస్తు ప్రణాళిక వేసుకుని చేసిన దాడేనని వారు అన్నారు. 'ముందస్తు ప్రణాళికతోనే బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రాహుల్ గాంధీపై దాడి చేశారు. ఇది కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిపై బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు జరిపిన ఘాతుకమైన దాడి' అని రాజ్యసభలో విపక్ష నేత అయిన గులాం నబీ ఆజాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇలాంటి దాడులు ప్రజలను కలుసుకుని వారి బాధలను తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీని గానీ దాని ఉపాధ్యక్షుడిని గానీ ఎవరూ ఆపలేవని ఆయన స్పష్టం చేశారు. రాహుల్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడి ద్వారా బిజెపి నిజస్వరూపం బయటపడిందని ఆజాద్ అన్నారు. రాహుల్‌పై విసిరిన 1.5 కిలోల కాంక్రీటు రాయి ఒకవేళ తన తలకి తగిలుంటే తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుండేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్‌పిజి భద్రత ఉన్న వ్యక్తులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదేనని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఘటన పునరావృతమైతే, దేశ ప్రజలు ఊరికే ఉండరని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆజాద్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాజ్యసభలో కాంగ్రెస్ ఉప నేత ఆనంద్ శర్మ, ఎఐసిసి మీడియా బాధ్యుడు రణ్‌దీప్ సుర్జేవాలా కూడా ఈ ఘటనను ఖండించారు. మరోవైపు రాహుల్ సైతం తనపై జరిగిన దాడి బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల పనేనంటూ ఆరోపించారు. ప్రధాని మోడీ, బిజెపి రాజకీయాలు ఇలాగే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. 'నిన్నటి ఘటనలో, బిజెపి కార్యకర్తలు నాపై పెద్ద రాయి విసిరారు. అది నా పిఎస్‌ఓని తాకింది. మోడీజి, బిజెపి, ఆర్ఎస్ఎస్ తరహా రాజకీయాలు ఇలానే ఉంటాయి. ఇంతకంటే మేము ఏమి చెప్పగలం?' అని పార్లమెంటు వెలుపల రాహుల్ అన్నారు. ఈ దాడికి ఇటు ప్రధాని మోడీ గానీ అటు బిజెపి గానీ ఇప్పటివరకు ఖండించకపోవడంపై మీరేమంటారు? అన్న ప్రశ్నకు, 'ఇది వాళ్ల పనే. అలాంటపుడు వాళ్లెందుకు ఈ దాడిని ఖండిస్తారు?' అని రాహుల్ ఎదురు ప్రశ్నించారు. గుజరాత్‌లో వరద తాకిడి ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లిన ఆయన వాహనంపై బనస్కాంత జిల్లాలోని ధనేరా పట్టణంలో శుక్రవారం రాళ్ల దాడి జరిగిన సంగతి తెలిసిందే.

దాడి ఘటనలో ఒకరి అరెస్ట్

రాహుల్ వాహనంపై దాడికి సంబంధించి శనివారం ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని జయేష్ దర్జీ అలియాస్ అనిల్ రాథోడ్‌గా గుర్తించామని బనస్కాంత ఎస్‌పి నీరజ్ బడ్‌గుజార్ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. దర్జీ బిజెపి కార్యకర్త అని, రాహుల్‌పై దాడి వెనుక అతని హస్తముందని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ కథ్‌వాడియా ఆరోపించారు.

మన తెలంగాణ
11
హైదరాబాద్
ఆదివారం
6, ఆగస్టు 2017
www.manatelangana.news



డార్జిలింగ్ విముక్తి కోసం జిజెఎం కొత్త నినాదం

డార్జిలింగ్ (పశ్చిమబెంగాల్) : పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుండి డార్జిలింగ్ విముక్తి కోసం గూర్ఖా జన ముక్తి మోర్చా (జిజెఎం) కొత్త నినాదాన్ని ఎంచుకుంది. ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ జిజెఎం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 52వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పశ్చిమబెంగాల్ నుండి విముక్తి కోసం 'బెంగాల్ డార్జిలింగ్ చోరో' (బెంగాల్...డార్జిలింగ్‌కు విముక్తిని ప్రసాదించు)' అనే సరికొత్త నినాదాన్ని జిజెఎం చీఫ్ బిమాల్ గురుంగ్ అందుకున్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డార్జిలింగ్ ప్రజలకు ఇదే ప్రధాన నినాదం కానుందని ఆయన ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిటీషర్లు మనల్ని దోచుకున్నట్లుగా, హింసించినట్లుగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం డార్జిలింగ్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. అందువల్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విమోచన పోరాటాన్ని జరుపుకోవడమే కాకుండా బెంగాల్ వలస పాలన పట్ల నిరసనను వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు గతనెల ఇక్కడ జరిగిన దహన కాండ, హింసలో ప్రమేయానికి ఆయన సన్నిహితుడు, జిజెఎం నేత నోర్బు లామాని సిఐడి అధికారులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు.

పరిమిత సైనిక చర్య!

● భారత్‌పై దాడికి చైనా యోచన ● గ్లోబల్ టైమ్స్ కథనం



బీజింగ్ : సిక్కిం సెక్షన్‌లోని వివాదాస్పద డోక్లామ్ ప్రాంతం నుండి భారత బలగాలను వెనక్కి పంపే దిశగా మరో రెండు వారాల్లో తమ సైన్యంతో పరిమిత సైనిక చర్యకు చైనా యోచిస్తోందని ఇక్కడ శనివారం ప్రచురించబడిన ఒక ప్రభుత్వ రంగ వార్తా పత్రిక కథనం పేర్కొంది. 'భారత్‌తో డోక్లామ్ వద్ద ఏర్పడిన సైనిక సంక్షోభాన్ని మరింత కాలం కొనసాగేందుకు చైనా సుముఖంగా లేదు. అందువల్ల మరో రెండు వారాల్లో వివాదాస్పద డోక్లామ్ నుండి భారత బలగాలను వెనక్కి పంపే దిశగా చైనా పరిమిత సైనిక చర్యకు యోచిస్తోంది' అని షాంఘై అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌కి చెందిన పరిశోధకుడు హు జియోంగ్ చెప్పినట్లు 'గ్లోబల్ టైమ్స్' పత్రిక ఉటంకించింది. చైనా తన సైనిక చర్యను చేపట్టడానికి ముందుగా ఆ విషయాన్ని భారత విదేశీ మంత్రిత్వ శాఖకు తెలియజేస్తుందని ఆయన అన్నారు. అంతేకాక చైనా బలగాలు ఇటీవల టిబెట్ వద్ద నిర్వహించిన యధార్థ సైనిక విన్యాసాలకు సంబంధించి ఆ దేశ ప్రభుత్వ రంగ వార్తా ఛానల్‌లో ప్రసారమైన ఫుటేజి గురించి కూడా ఆయన ప్రస్తావించారు. చైనా విషయంలో భారత్ ఇటీవల కాలంలో అపరిపక్వమైన విధానాన్ని అనుసరిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. సంసిద్ధత విషయంలో చైనా స్థాయిలో భారత్ తయారు కాలేదని ఆయన అన్నారు. జూన్ 16న భూటాన్ త్రికూడలికి సమీపంలో చైనా దళాలు ఒక రహదారి నిర్మాణానికి పూనుకోవడంతో సిక్కిం సెక్షన్‌లోని డోక్లామ్ ప్రాంతం వద్ద భారత సైన్యంతో ప్రతిష్టంభన నెలకొన్న సంగతి విదితమే. కాగా, సమస్యకు శాంతియుతమైన పరిష్కారం కోసం ఇరు దేశాలు డోక్లామ్ నుండి తమ బలగాలను తొలుత వెనక్కి తీసుకుని, చర్చలు చేపట్టాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మ స్వరాజ్ గతంలో సూచించిన సంగతి తెలిసిందే. యుద్ధం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని కూడా ఆమె గత గురువారం పేర్కొన్నారు.

షరీఫ్ ఫ్యామిలీ పాలిటిక్స్!

● సోదరుడు షెహబాజ్ ప్రధాని కాకుండా అడ్డు ● పిఎమ్ఎల్(ఎన్) నేతల ఆరోపణ



లాహోర్ : పంజాబ్ ముఖ్యమంత్రి, సోదరుడు షెహబాజ్‌కు పాకిస్థాన్ ప్రధానమంత్రిగా అవకాశాన్ని ఇచ్చినట్టే ఇచ్చిన నవాజ్ షరీఫ్ చివరి నిమిషంలో వెనక్కి తగ్గటానికి కుటుంబ రాజకీయలే ప్రధాన కారణమా? అంటే అవునని అంటున్నారు కొందరు పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ పార్టీ, (పిఎమ్‌ఎల్ (ఎన్)) నేతలు. గతనెల 28న పనామా పత్రాల లీకేజీ కేసులో పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. దీంతో మిగిలిన 10 నెలల పదవీకాలానికి తన సోదరుడు షెహబాజ్‌ను పాక్ ప్రధానిగా షరీఫ్ ప్రకటించిన అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అనూహ్యంగా షహీద్ ఖాకన్ అబ్బాసీ పేరు తెరపైకి రావడం, వెంటనే ఆయన ప్రధానిగా ఎన్నికవడం పాక్ రాజకీయ వర్గాల్లో ఇప్పుడు చర్చానీయాంశమైంది. ఈ నేపథ్యం లో తాత్కాలిక ప్రధానిగా అబ్బాసీ ఎన్నికైనప్పటికీ షెహబాజ్ జాతీయ అసెంబ్లీకి సభ్యుడిగా ఎన్నికయ్యే వరకు ఆయనే ప్రధానిగా కొనసాగుతారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పాక్ ప్రధానిగా షెహబాజ్ ఎన్నికయ్యే బంగారు అవకాశాన్ని చేజార్చుకున్నట్టేనని కొందరు పిఎమ్ఎల్(ఎన్) నేతలు అభిప్రాయపడుతున్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఒకవేళ పిఎమ్ఎల్(ఎన్) గెలిచిననప్పటికీ కూడా షెహబాజ్‌కు ఇదే అవకాశం వస్తుందనే భరోసా ఇవ్వలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే నవాజ్ షరీఫ్ కుటుంబంలోని చాలామంది కుటుంబ సభ్యులు ప్రధాని పదవి రేసులో ఉన్న నేపథ్యంలో వారిని కాదని షెహబాజ్‌కు అవకాశం రావడం కష్టమని భావిస్తున్నారు. 2018 ఎన్నికల్లో పాక్ ముస్లిం లీగ్ పార్టీ గెలిస్తే.. రేసులో ముందున్న షరీఫ్ కూతురు మరియం అప్పటికీ అవినీతి కేసులో ఆరోపణల నుంచి బయటపడని పక్షంలో ఆమె స్థానంలో నవాజ్ భార్య కల్సూమ్ ప్రధాని అభ్యర్థిగా గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందని పిఎమ్ఎల్ (ఎన్) నేత అగ్రనేత ఒకరు చెప్పారు. ఒకవేళ పాక్ ప్రధానిగా సోదరుడు షెహబాజ్ ఎన్నికైతే పార్టీ పగ్గాలను తన అధీనంలో తెచ్చుకోవడమే కాకుండా, పంజాబ్ రాష్ట్రాన్ని కుమారుడు హమ్జాకు కట్టబెడతాడనే షరీఫ్ భయపడ్డారేమోనని అన్నారు. మరో నేత మాట్లాడుతూ. .షరీఫ్ అద్భుతంగా కుటుంబ రాజకీయాల ను నడిపారు. ముందుగా తన సోదరుడిని వారసుడిగా ప్రకటించారు. ఆ తరువాత పంజాబ్ నుంచి షెహబాజ్ తప్పుకుంటున్నాడని, 2018 ఎన్నికల నేపథ్యంలో పార్టీలో ఏర్ప డే సమస్యలను ఎదుర్కోలేడని భావిస్తున్నట్టు కట్టుకథలు అల్లారని విమర్శించారు. పిఎమ్ఎల్ (ఎన్)కు పంజాబ్ ప్రాధాన్యత ఏమిటో నవాజ్‌కు త్వరలో తెలిసి వస్తుందని అన్నారు.

ఎపిలో ఘోర రోడ్డు ప్రమాదం

● నలుగురు స్పెయిన్ దేశస్థుల మృతి ● చిత్తూరు జిల్లాలో ఘటన



యాతాల: ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం యాతాల వంక సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. అనంతపురం నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మినీ బస్సు రహదారిపై ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు స్పెయిన్ దేశస్థులు, డ్రైవర్ మృతి చెందారు. కొందరు స్పెయిన్ దేశస్థులు తమ సొంత నిధులతో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అనేక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరు అనంతపురంలో ఏర్పాటు చేసిన ఆర్‌డిటి సెంటర్‌ను సందర్శించిన అనంతరం పాండిచ్చేరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న 9 మంది స్పెయిన్ దేశస్థుల్లో నలుగురు చనిపోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎపి సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి : యాతాల వంక సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఎపి సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్పెయిన్ దౌత్య కార్యాలయంతో సంప్రదించి మృతుల వివరాలను తెలుసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

తక్షణం జగన్ క్షమాపణ చెప్పాలి : ఉమా



విజయవాడ/ విశాఖపట్నం: నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో ఎపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తక్షణం క్షపమాణ చెప్పాలని ఆ రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై జగన్ బాధ్యత మరిచి మాట్లాడారని, ఓ వ్యక్తిని కాల్చి చంపండని బహిరంగ సభలో చెప్పడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. జగన్ లాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ ఎక్కడా చూడలేదని, ఓటమి భయంతోనే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. హింసను ప్రేరేపించే జగన్‌కు ప్రతిక్ష నేతగా ఉండే అర్హత లేదన్నారు. జగన్ వ్యాఖ్యలను ఎన్నికల సంఘం సుమోటోగా స్వీకరించి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని చంద్రబాబుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జగన్‌ను వెంటనే అరెస్టు చేయాలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నడిరోడ్డుపై కాల్చి చంపాలి అని ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం విశాఖలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్న జగన్ విచక్షణ కోల్పోయి మాట్లాడారని మండిపడుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నేర చరిత్ర కలిగిన జగన్ రాజకీయాలకు సరిపోడంటూ ఆయన దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు.

జగన్‌పై ఫిర్యాదు

మన తెలంగాణ/హైదరాబాద్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తెలంగాణ టిడిపి నేతలు బంజాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టిఎన్‌టియూసి అధ్యక్షులు బిఎన్ రెడ్డి బంజారాహిల్స్ ఎస్‌హెచ్‌ఒకు శనివారం ఫిర్యాదు పత్రం అందించారు.ఇందులో కర్నూలు జిల్లా, నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రచారం సందర్భం గా జగన్ ప్రసంగిస్తూ ఎపి సిఎం చంద్రబాబు నాయుడును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పు లేదని ప్రజలను రెచ్చగొట్టారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి నేర చరిత్ర ఉందని, తమ నాయకుని ప్రాణహాని పొంచి ఉన్నట్లు తెలిపారు. కనుక కేసు రిజిస్టర్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దురుద్దేశపూర్వకమైన వ్యాఖ్యలు చేసిన జగన్‌మోహన్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గంధం గురుమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రేపు చంద్ర గ్రహణం

● ఇండియాలో నిండు దర్శనం

కోల్‌కతా : ఏడవ తేదీ (సోమవారం) పాక్షిక చంద్రగ్రహణం సంభవించనుంది. ఈ గ్రహణం భారతదేశంలో కనబడుతుంది. రాత్రి పూట 10.52 గంటలకు ఆనాటి నిండుచంద్రుడు భూమిఛాయలోకి ప్రవేశించడంతో ఈ ఖగోళ అద్భుతం మొదలవుతుంది. ఈ ఏడాది ఇదే పూర్తిస్థాయిలో కనబడే తొలి చంద్ర గ్రహణం అని స్థానిక బిర్లా ప్లానిటోరియం రిసర్చ్ అండ్ అకాడమిక్ డైరెక్టర్ దేబీప్రసాద్ దువారీ తెలిపారు. సోమవారం పౌర్ణమి. ఆరోజు చంద్రుడు భూమి ఛాయలోకి నేరుగా కాకుండా పక్క నుంచి సాగుతూ ఉండటంతో సంభవించే ఈ పాక్షిక గ్రహణం ప్రపంచవ్యాప్తంగా కన్పించే అవకాశం లేదని డైరెక్టర్ వివరించారు. అయితే యావత్తూ ఆసియా, ఆస్ట్రేలియాలలో, యూరప్, ఆఫ్రికాలలో అత్యధిక ప్రాంతాలలో దీనిని వీక్షించవచ్చునని దువారీ తెలిపారు. ఉత్తర, దక్షిణ అమెరికాలకు చెందిన వారు దీనిని చూడలేరని, వారికి అది పగటి పూట కావడంతో ఇది అక్కడ కన్పించదని చెప్పారు. రాత్రి పదిగంటల తరువాత మొదలయ్యే గ్రహణం 12.48 గంటల వరకూ ఉంటుంది. అయితే పూర్తిస్థాయిలో ఈ పాక్షిక గ్రహణం రాత్రి దాదాపు 11.50 గంటలకు కనబడుతుందని తెలిపారు. మొత్తం గ్రహణం నిడివి గంట 55 నిమిషాల పాటు ఉంటుంది. భారతదేశంలో అన్ని ప్రాంతాల నుంచి ఈ గ్రహణాన్ని తిలకించవచ్చు. సాధారణంగా చంద్ర గ్రహణాలు పౌర్ణమి నాడే సంక్రమిస్తాయి. సోమవారమే రాఖీ బంధన్ లేదా రాఖీ పౌర్ణమీ కూడా ఉంది. భూమి, సూర్యుడు, చంద్రుడు పూర్తి స్థాయిలో ఒకే రేఖ మీదికి వచ్చిన దశలో ఈ చంద్ర గ్రహణం సంభవిస్తుంది. సూర్య కిరణాలు భూమిపై పడటం, భూమి నీడపైకి చంద్రుడి ప్రవేశం జరిగే దశలో ఈ గ్రహణం ఏర్పడుతుంది. సూర్య, చంద్రగ్రహణాల పరిణామాలు ఖగోళ శాస్త్రంలో పరిశోధనలకు విశేషంగా దోహదం చేస్తూ ఉండటంతో దేశంలోని ప్రముఖ ప్లానిటోరియంలలో దీనికి సంబంధించి తగు ఏర్పాట్లు చేశారు. తదుపరి చంద్ర గ్రహణం వచ్చే ఏడాది జనవరి 31న ఉంటుంది. చంద్రగ్రహణాన్ని నేరుగా చూడవచ్చునని, కళ్లకు ఎలాంటి ప్రమాదం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే మామూలుగా చూడటం కంటే బైనాక్యులర్‌లను వినియోగిస్తే స్పష్టత ఉంటుందని వెల్లడించారు. వర్షాకాలం కావడంతో సాధారణంగా ఆకాశం మేఘావృతం అయి ఉంటోంది.

పార్టీ స్థాపన దిశగా సయీద్

న్యూఢిల్లీ / ఇస్లామాబాద్ : ముంబై పేలుళ్ల ప్రధాన సూత్రధారి, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అయిన జమాత్ ఉల్ దవా (జెయుడి) చీఫ్ హాఫీజ్ సయీద్ పాకిస్తాన్‌లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నాడు. ఈ మేరకు ఆయన నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. తన ఉగ్రవాద సంస్థ జెయుడిని మిల్లి ముస్లిం లీగ్ పాకిస్తాన్‌గా పేరు మార్చి కొత్త పార్టీని నెలకొల్పనున్నాడు. 2018 ఎన్నికలు లక్ష్యంగా పాకిస్తాన్ ఎన్నికల సంఘం వద్ద పార్టీ పేరును రిజిస్టర్ చేయించనున్నట్టు తెలుస్తోంది. పాక్ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 14న లాహోర్‌లో కొత్త పార్టీ లాంఛనంగా ప్రారంభం కానుంది. సయీద్ ప్రస్తుతం జెయుడికి సామాజిక విభాగంగా ఫలాహీ ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్)ను నిర్వహిస్తున్నాడు. ఈ ఫౌండేషన్ క్లినిక్‌లు, ఆసుపత్రులు, పాఠశాలలు, అంబులెన్స్‌లను నడుపుతోంది. వ్యక్తిగత, వాణిజ్యపరమైన తగాదాలకు సంబంధించి జెయుడి పంచాయతీలను కూడా నిర్వహిస్తున్నది.

ఉత్తర కొరియాపై కొత్తగా ఆంక్షలు

అమెరికా తీర్మానంపై ఓటింగ్‌కు ఐరాస సిద్ధం

ఐక్యరాజ్య సమితి: ఉత్తర కొరియాపై ఆంక్షలను కఠినతరం చేస్తూ అమెరికా రూపొందించిన తీర్మానంపై ఐరాస నేడో రేపో ఓటింగ్ జరుపుతుంది. ఆ దేశంనుంచి కొన్ని ఎగుమతులపై నిషేధం విధిస్తారు. అందువల్ల ఉత్తర కొరియా ఏడాదికి బిలియన్ డాలర్ల ఆదాయం నష్టపోతుంది. దాని అణ్వస్త్ర, ఖండాంతక క్షిపణి యత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా నెలరోజుల పాటు చర్చల తరువాత ఉత్తర కొరియా ప్రధాన వాణిజ్య భాగసొస్వామి చైనాతో అమెరికా ఒప్పందానికి వచ్చింది. ఉత్తర కొరియాపై ఆంక్షల బిగింపు విషయంలో ఈ అవగాహన కుదిరింది. శనివారం రాత్రి మూడు గంటలకు అమెరికా తీర్మానంపై ఐరాస ఓటింగ్ జరుగుతుంది. అందులో ఉత్తర కొరియాపై కొత్తగా ఆంక్షలు ప్రకటిస్తున్నారు.

పారిస్ ఒప్పందానికి టాటా : అమెరికా

వాషింగ్టన్: చరిత్రాత్మక 2015 పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి తాను వైదొలగుతున్నట్టు ఐక్య రాజ్య సమితికి అమెరికా తెలిపింది. అయితే తన ప్రయోజనాల రక్షణకు భవిష్య వాతావరణ చర్చలలో పాల్గొంటానని స్పష్టం చేసింది. కెండు నెలల క్రితం అధ్యక్షుడు ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించిరు. ఆ తరువాత లాంఛన ప్రకటన ఐరాసకు తాజాగా చేసింది. తన ప్రచారంలో ఇచ్చిన హామీమేరకు ఈ చర్య తీసుకొంటున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో ట్రంప్ తెలిపారు. ఒప్పందంలో కొనసాగాలని ఇతర ప్రపంచ నేతలు చేసిన విజ్ఞప్తిని ట్రంప్ తోసిపుచ్చారు.

గ్రామీణ ప్రాంతంలో మొట్ట మొదటి డిజిటల్ కేంద్రం ప్రారంభం



మన తెలంగాణ/సిటీ బ్యూరో : గ్రామీణ ప్రాంతమైన పెద్దషాపూర్‌లో డిజిటల్ అక్షరాస్యత కేంద్రం ప్రారంభించడం చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు డిజిటల్ అక్షరాస్యులుగా మారే గొప్ప అవకాశం లభించినటైందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. పోస్ట్ ట్రేడ్ టెక్నాలజీ, ప్రొఫెషనల్ సర్వీస్ సంస్థ అర్సేసిమ్, నాస్కామ్ సహకారంతో రంగారెడ్డి జిల్లా పెద్దషాపూర్‌లో ప్రధానమంత్రి డిజిటల్ అక్షరాస్యత అభియాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రకాశ్ గౌడ్ ఈ డిజిటల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ తమ నైపుణ్యాన్ని పెంపోందించుకోవడం ఎంతో అవసరమని దీనిని గుర్తించిన లక్ష్యంగా తమ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాద్యమంలో భోధనను ప్రవేశపెట్టిందన్నారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతమైన ఇక్కడ నాస్కామ్, అర్సేసిమ్‌లు డిజిటల్ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామని, దీనిని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్సేసిమ్ భారత ముఖ్య అధికారి రాజీవ్ లాంబా మాట్లాడుతూ విద్య, జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా సమాజంలో ఒక సానుకూల మార్పును కనబర్చాలనేదే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఈ కేంద్రం చిన్నదే అయినా ఇది వేలాది కుటుంబాల్లో జీవితాల్లో పురోగాభివృద్ధికి ఇక ప్రభావవంతమైన అడుగు వేస్తోందని చెప్పారు. నాస్కామ్ పౌండేషన్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ మాట్లాడుతూ భారత పౌరులుగా దేశంలో ఒక సానుకూల మా ర్పు తీసుకువచ్చేందుకు స్పష్టమైన విజన్ కల్గిన అర్సేసిమ్ తన వంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతంతో ఇది తమ మొట్ట మొదటి డిజిటల్ అక్షరాస్యత కేం ద్రం కాగా, రాష్ట్రం వ్యాప్తంగా గతంలో 9 కేంద్రాలను ఏర్పా టు చేయ డం జరిగిందన్నారు. డిజిటల్ ఇండియా కలను సాకారం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ తెలంగాణ యొక్క లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని తాము ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

యుజిసి రెగ్యులేషన్ కమిటీ సభ్యులుగా

ఒయుకు చెందిన భట్టు సత్యనారాయణ నియామకం



మన తెలంగాణ/హైదరాబాద్ : యుజిసి రెగ్యులేషన్ కమిటి సభ్యులుగా ఉస్మానియా యూనివర్సిటీ, కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ భట్టు సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఒయు టీచర్స్ అసోసియేషన్(ఔటా) అధ్యక్షులుగా ఉన్నారు. ఈ కమిటి దేశవ్యాప్తంగా యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టుల నియామకాలలో విధివిధానాలు రూపొందిస్తుంది.

నేడు ఆచార్య జయశంకర్ జయంతి

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి ఆదివారం జరగనుంది. దీనిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రతి సంవత్సరం ఆగస్టు 6వ తేదీన జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు, కార్పోరేషన్లు, విద్యాసంస్థలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో జయశంకర్ జయంతిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో చిరుజల్లులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఐదు రోజుల పాటు భారీ వర్షసూచనలేవి లేవని భారత వాతావరణ విభాగం శనివారం విడుదల చేసిన వాతావరణ సమాచారంలో వెల్లడించింది. రాష్ట్రంలో శనివారం అత్యధికంగా మక్తల్ (మహబూబ్‌నగర్)లో 3 సెంటిమీటర్లు, ఘన్‌పూర్ (వరంగల్ జిల్లా), ధర్మపురి (కరీంనగర్), పాలకుర్తి (వరంగల్)లలో ఒక సెంటిమీటర్ చొప్పున వర్షపాతం నమోదైంది.



వలసదారులకు ట్రంప్ మరో షాక్

ఐదేళ్లపాటు సంక్షేమ కార్యక్రమాలు ఉండవని ప్రకటన

వాషింగ్టన్ : వలసదారులకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో షాక్ ఇచ్చారు. తమ దేశానికి వచ్చే విదేశీయులకు మొదటి ఐదేళ్లలో ఎలాంటి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి కలగదని స్పష్టం చేశారు. 'మీరు మా దేశానికి వచ్చిన తర్వాత ఐదేళ్ల వరకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అందవు. కొద్ది రోజుల వరకు అమలులో ఉన్న ఆ విధానానికి స్వస్తి చెబుతున్నాం. వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడం ఇకపై ఉండదు. అందుకు ఐదేళ్లు ఆగాల్సివుంటుంది' అని ట్రంప్ తన వీకెండ్ రేడియో, వెబ్ ప్రసంగంలో చెప్పారు. అమెరికాలో శాశ్వత నివాసం పొందేందుకు ఇచ్చే గ్రీన్‌కార్డు జారీ విధానంలో మార్పులకు ట్రంప్ ఇటీవల మద్దతుతెలిపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న లాటరీ విధానం కాకుండా మెరిట్ ఆధారంగా గ్రీన్ కార్డు ఇవ్వాలని అమెరికా ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం రైజ్ అనే చట్టాన్ని తీసుకురానుంది. ఈ చట్టం అమలైతే ఇకపై గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంగ్లిష్ భాష పరిజ్ఞానం, ఆదాయం, ఉద్యోగం, వయసు వంటి వాటిని చూసి మెరిట్ జాబితాను తయారుచేస్తారు.

అధ్యక్షుడుగా రౌహానీ ప్రమాణం

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడుగా తిరిగి ఎన్నికైన హసన్ రౌహానీ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం టెహ్రాన్‌లో బహిరంగ పార్లమెంట్ సమావేశంలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ తమ దేశం సహజీవనం, ప్రపంచంతో పరస్పర సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. రౌహానీ ప్రమాణ స్వీకారోత్సవానికి వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 130 మందికి పైగా ప్రముఖుల హాజరయినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ తెలిపింది.



నీలోఫర్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ సెంటర్

డాక్టర్ సంతోష్‌కుమార్

మన తెలంగాణ/హైదరాబాద్ : నీలోఫర్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ సెంటర్ మూడు వారాల్లో ప్రారంభం కానుందని దాత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్టులో భాగంగా దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్, డాక్టర్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నీలోఫర్‌లో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్స్‌ఫార్గో కోటి వీటి, యన్.టి.టి డాటా సంస్థల కార్పోరేట్ ఉద్యోగులు వాలంటీర్లుగా హాజరై తల్లిపాల శ్రేష్టత గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో తల్లిపాల శ్రేష్టత గురించి తెలిపే పుస్తకాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నీలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, ఆర్.యం.ఓ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలోకి ఎపి

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పుల్లో నెడుతున్నారని ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఇప్పటివరకు ఎంత అప్పు తెచ్చారో చెప్పాలని విజయవాడలో ఆయన డిమాండ్ చేశారు. ప్రతిరోజు అభివృద్ధి జపం చేస్తున్న ముఖ్యమంత్రి, దాని కోసం నిధులు ఎక్కడ నుంచి తెచ్చి వెచ్చిస్తున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నంద్యాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలు సమర్థనీయం కాదని, జగన్ హుందాగా వ్యవహరించి తన వ్యాఖ్యలను ఉపసంహరించకోవాలని సూచించారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే వాటిపై రోజూ చర్చ జరుగుతూనే ఉంటుందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్య హత్య

ధర్మవరం: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ప్రసాద్ అనే వ్యక్తి తన భార్యను బండరాయితో తలపై మోది హత్య చేసిన ఘటన ఎపిలోని అనంతపురం జిల్లా ధర్మవరం లక్ష్మీ చెన్నకేశవ కాలనీలో చోటు చేసుకుంది. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే ప్రసాద్ మద్యానికి బానిసై తరుచూ భార్య వెంకటేశ్వరితో గొడవపడేవాడని స్థానికులు చెబుతున్నారు. వెంకటేశ్వరి వికలాంగురాలు కావడంతో ఆమెకు నెలకు రూ.1000 పింఛన్ వస్తోంది. మద్యం తాగేందుకు పింఛన్ సొమ్ము ఇవ్వడానికి వెంకటేశ్వరి ఒప్పుకోకపోవడంతో ప్రసాద్ ఆగ్రహానికి గురై ఆమెను బండరాయితో తలపై మోదీ హత్య చేశాడు. సమాచారం అందుకున్న ధర్మవరం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.

కావాలనే పక్కన పెట్టారు: పార్థివ్



ముంబయి: దేశవాళి క్రికెట్‌లో నిలకడైన ఆటను కనబరుస్తున్నా తనపై సెలెక్షన్ కమిటీ సభ్యులు చిన్న చూపు చూస్తున్నారని స్టార్ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించే సత్తా తనకుందన్నాడు. గతంలో వృద్ధిమాన్ సాహా గాయం వల్ల దూరం కావడంతో జట్టులో చోటు కల్పించారని, అప్పుడూ తాను సత్తా చాటిన విషయాన్ని పార్థివ్ గుర్తు చేశాడు. సెలెక్టర్లు కావాలనే తనను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపాడు. వికెట్ కీపింగ్‌తో పాటు ఓపెనర్‌గా, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా జట్టుకు అండగా నిలిచే సత్తా తనలో ఉందన్నాడు. అయితే తనకు గాడ్‌ఫాదర్ లేక పోవడం ప్రతికూలంగా మారిందన్నాడు. ధోనీ కెప్టెన్‌గా ఉంటే పరిస్థితి వేరేగా ఉండేదన్నాడు. ఇకపై తనకు టీమిండియాలో చోటు దక్కుతుందనే నమ్మకం లేదన్నాడు. కొందరు కావాలనే కక్ష కట్టి తనకు అవకాశాలు రాకుండా చేస్తున్నారని పార్థివ్ వాపోయాడు. గతంలో ప్రతిభావంతులకు టీమిండియాలో చోటు తప్పక లభించేదన్నాడు. కానీ, ఇప్పుడూ పరిస్థితులు తారుమారు అయ్యాయన్నాడు. కెప్టెన్‌తో పాటు బోర్డు పెద్దల ఆశీస్సులు ఉంటేనే చోటు దక్కే పరిస్థితి నెలకొందని తెలిపాడు.

లంక ఎదురీత..

చెలరేగిన భారత బౌలర్లు, కుప్పకూలిన శ్రీలంక, పట్టు బిగించిన కోహ్లి సేన



కొలంబో: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక పోరాడుతోంది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంక శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నె 92(బ్యాటింగ్), మలింద పుష్ప కుమార 2(బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు స్టార్ ఆటగాడు కుశాల్ మెండిస్ (110) అద్భుత సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే శ్రీలంక మరో 230 పరుగులు చేయాలి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 622 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంక 49.4 ఓవర్లలో కేవలం 183 పరుగులకే కుప్పకూలింది. రవిచంద్రన్ అశ్విన్ ఐదు, మహ్మద్ షమి, రవీంద్ర జడేజాలు రెండేసి వికెట్లు తీసి లంక ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 439 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. దీంతో కోహ్లి లంకకు ఫాలోఆన్ ఇచ్చాడు.

తరంగ మరో 'సారి'

ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంకకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ ఉపుల్ తరంగ మరోసారి నిరాశ పరిచాడు. తరంగ కేవలం రెండు పరుగులు మాత్రమే చేసి ఉమేశ్ యాదవ్ వేసిన చక్కని బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ఏడు పరుగుల వద్దే తొలి వికెట్‌ను కోల్పోయింది. తరంగ తొలి ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరిన విషయం తెలిసిందే.

ఆదుకున్న కరుణరత్నె, మెండిస్

ఈ దశలో ఇన్నింగ్స్‌ను మెరుగు పరిచే బాధ్యతను ఓపెనర్ కరుణరత్నె, వన్‌డౌన్ ఆటగాడు కుశాల్ మెండిస్ తమపై వేసుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలపై వీరు ఎదురు దాడికి దిగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీలతో ఒత్తిడి దరి చేరకుండా చూశారు. వీరిని ఔట్ చేసేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే క్రమంలో వీరు రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తర్వాత దూకుడును మరింత పెంచారు. ముఖ్యంగా కుశాల్ మెండిస్ ధాటిగా ఆడాడు. భారత బౌలర్లను హడలెత్తించిన మెండిస్ 53 బంతుల్లోనే 11 ఫోర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఆ వెంటనే కరుణరత్నె కూడా 83 బంతుల్లో ఏడు ఫోర్లతో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నారు. దీంతో టి విరామ సమయానికి లంక స్కోరు వికెట్ నష్టానికి 118 పరుగులకు చేరింది.

కుశాల్ శతకం..

తర్వాత కూడా కుశాల్ మెండిస్ జోరు ను కొనసాగించాడు. చూడచక్కని షాట్ల తో స్కోరును పరిగెత్తించాడు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కరుణరత్నె సమన్వయంతో ఆడుతూ మెండిస్‌కు సహకారం అందించాడు. వీరిద్దరి విజృంభణతో లంక కోలుకుంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన కుశాల్ మెండిస్ 120 బంతుల్లో 16 ఫోర్లతో సెంచరీని పూర్తి చేశాడు. అయితే 110 పరుగుల స్కోరు వద్ద హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో మెండిస్ వెనుదిరిగాడు. దీంతో 191 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన ఓపెనర్ కరుణరత్నె 200 బంతుల్లో 12 ఫోర్లతో 92 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పుష్పకుమార రెండు పరుగులతో అజేయంగా ఉన్నాడు. దీంతో శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి లంక రెండు వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది.



రవిచంద్రన్ అశ్విన్ 5/69

లంచ్ లోపే చుట్టేశారు....

అంతకుముందు 50/2 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం మూడో రోజు బ్యాటింగ్ చేపట్టిన లంకను భారత బౌలర్లు హడలెత్తించారు. కెప్టెన్ దినేశ్ చండీమల్ 10 పరుగులు మాత్రమే చేసి రవీంద్ర జడేజా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఆ వెంటనే కుశాల్ మెండిస్ (24) కూడా ఔటయ్యాడు. ఈ వికెట్ ఉమేశ్ యాదవ్ ఖాతాలోకి వెళ్లింది. దీంతో లంక 64 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మాజీ కెప్టెన్ అంజెలో మాథ్యూస్, వికెట్ కీపర్ డిక్వెల్లా కొద్ద సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఇదే క్రమంలో జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. కానీ, తర్వాత భారత బౌలర్లు మళ్లీ పుంజుకున్నారు. కుదురుగా ఆడుతున్న మాథ్యూస్ (26; 33 బంతుల్లో 2X4, 2X6)ను అశ్విన్ పెవిలియన్ పంపించి లంకకు మరోసారి దెబ్బ తీశాడు. తర్వాత వచ్చిన డిసిల్వా (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఒక వైపు వికెట్లు పడుతున్నా వికెట్ కీపర్ డిక్వెల్లా పోరాటం కొనసాగించాడు. ధాటిగా ఆడిన డిక్వెల్లా (51, 48 బంతుల్లో 7X4,6X2)ను మహ్మద్ షమి అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. చివర్లో అశ్విన్ వెంటవెంటనే రెండు వికెట్లు తీయడంతో లంక ఇన్నింగ్స్ 183 పరుగుల వద్దే ముగిసింది. భారత బౌలర్లలో అశ్విన్ 69 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు. షమి, జడేజాలు రెండేసి వికెట్లు తీశారు. ఉమేశ్‌కు ఒక వికెట్ లభించింది.



191 రెండో వికెట్‌కు కుశాల్ మెండిస్, కరుణరత్నె జోడించిన పరుగులు

స్కోరు బోర్డు

భారత్ మొదటి ఇన్నింగ్స్: 622/9 డిక్లేర్డ్.
శ్రీలంక మొదటి ఇన్నింగ్స్: దిముత్ కరుణరత్నె (సి) రహానె (బి) రవిచంద్రన్ అశ్విన్ 25, ఉపుల్ తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, కుశాల్ మెండిస్ (సి) కోహ్లి (బి) ఉమేశ్ యాదవ్ 24, దినేశ్ చండీమల్ (సి) హార్దిక్ పాండ్యా (బి) రవీంద్ర జడేజా 10, అంజెలో మాథ్యూస్ (సి) పుజారా (బి) అశ్విన్ 26, నిరోషన్ డిక్వెల్లా (బి) మహ్మద్ షమి 51, ధనుంజయ డిసిల్వా (బి) రవీంద్ర జడేజా 0, దిల్రువన్ పెరీరా (బి) అశ్విన్ 25, రంగనా హెరాత్ (బి) మహ్మద్ షమి 0, మలింద పుష్పకుమార నాటౌట్ 15, నువాన్ ప్రదీప్ (బి) అశ్విన్ 0, ఎక్స్‌ట్రాలు 5, మొత్తం 49..4 ఓవర్లలో 183 ఆలౌట్.
బౌలింగ్: మహ్మద్ షమి 6-1-13-2, రవిచంద్రన్ అశ్విన్ 16.4-3-69-5, రవీంద్ర జడేజా 22-6-84-2, ఉమేశ్ యాదవ్ 6-1-12-1.
శ్రీలంక రెండో ఇన్నింగ్స్: దిముత్ కరుణరత్నె బ్యాటింగ్ 92, ఉపుల్ తరంగ (బి) ఉమేశ్ యాదవ్ 2, కుశాల్ మెండిస్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్యా 110, మలింద పుష్పకుమార బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు 3, మొత్తం 60 ఓవర్లలో 209/2.
బౌలింగ్: ఉమేశ్ యాదవ్ 9-2-29-1, రవిచంద్రన్ అశ్విన్ 24-6-79-0, మహ్మద్ షమి 6-2-13-0, రవీంద్ర జడేజా 16-2-76-0, హార్దిక్ పాండ్యా 5-0-12-1.

3 కుశాల్ మెండిస్ టెస్ట్‌ల్లో సాధించిన శతకాలు


26 టెస్ట్ క్రికెట్‌లో ఐదు వికెట్ల ఫీట్‌ను సాధించడం అశ్విన్‌కు ఇది 26వ సారి

230 ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే లంక చేయాల్సిన పరుగులు

439 తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు లభించిన ఆధిక్యం

బంగ్లా టూర్‌కు ఆసీస్ జట్టు ఎంపిక

మెల్‌బోర్న్: బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ జట్టును ప్రకటించారు. స్పీడ్‌స్టర్ జేమ్స్ పాటిన్సన్‌కు విశ్రాంతి ఇచ్చారు. అంతేగాక జట్టులో ప్రధాన ఫాస్ట్ బౌలర్‌గా ఉన్న మిచెల్ స్టార్క్‌ను కూడా సిరీస్‌కు ఎంపిక చేయలేదు. గాయం నుంచి కోలుకోక పోవడంతో స్టార్క్‌ను పక్కన బెట్టారు. మరోవైపు రానున్న కీలకమైన యాషెస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని ఆస్ట్రేలియా ఇద్దరు ప్రధాన ఫాస్ట్ బౌలర్లకు విశ్రాంతి ఇచ్చింది. పాటిన్సన్ కూడా కొంతకాలంగా ఫిట్‌నెస్ లేమితో బాధపడుతున్నాడు. దీంతో అతనికి విశ్రాంతి ఇచ్చారు. కాగా, క్వీన్స్‌లాండ్‌కు చెందిన లెగ్ స్పిన్నర్ మిచెల్ స్వెప్సన్‌ను బంగ్లాదేశ్ టూర్ కోసం ఎంపిక చేశారు. డొమెస్టిక్స్ క్రికెట్‌లో మెరుపులు మెరిపించడంతో స్వెప్సన్‌కు జాతీయ జట్టులో చోటు దక్కింది. అంతేగాక, బంగ్లాదేశ్ పిచ్‌లు కూడా స్పిన్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలు ఉండడంతో అతన్ని ఎంపిక చేశారు. కాగా, నాథన్ లియాన్, అష్టన్ అగర్, మాక్స్‌వెల్‌లు స్పిన్ బాధ్యతలను మోస్తారు.
జట్టు వివరాలు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), డేవిడ్ వార్నర్, అష్టన్ అగర్, జాక్సన్ బర్డ్, హిల్టన్ కార్ట్‌రైట్, హాండ్స్‌కొంబ్, హాజిల్‌వుడ్, ఉస్మాన్ ఖ్వాజా, నాథన్ లియాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ రెన్‌షా, మిచెల్ స్వెప్సన్, మాథ్యూ వేడ్.





జడేజా @ 150

కొలంబో: భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్ట్‌ల్లో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ సందర్భంగా తన కెరీర్‌లో 150వ వికెట్‌ను సాధించాడు. లంక ఆటగాడు ధనుంజయ డిసిల్వాను క్లీన్‌బౌల్డ్ చేయడం ద్వారా టెస్ట్‌ల్లో 150వ వికెట్‌ను సొంతం చేసుకున్నాడు. కెరీర్‌లో 32వ టెస్ట్ ఆడుతున్న జడేజా అత్యంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించిన ఎడమ చేతి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. అంతేగాక, రవిచంద్రన్ అశ్విన్ తర్వాత టెస్ట్‌ల్లో వేగంగా 150 వికెట్లు పడగొట్టిన బౌలర్ కూడా జడేజానే కావడం విశేషం. అశ్విన్ 29 టెస్ట్‌ల్లోనే ఈ రికార్డును సాధించాడు. కాగా, ఎర్రవల్లి ప్రసన్న, అనిల్ కుంబ్లేలు సంయుక్తంగా 34 టెస్టుల్లో ఈ రికార్డును అందుకున్నారు. హర్భజన్ సింగ్‌కు ఈ రికార్డును సాధించేందుకు 35 టెస్టులు పట్టాయి. ఇదిలావుండగా ఇటీవల కాలంలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు టెస్టుల్లో అసాధారణ బౌలింగ్‌తో భారత్‌కు చిరస్మరణీయ విజయాలు సాధించి పెడుతున్న విషయం తెలిసిందే.

మహిళా క్రికెటర్ల వేతనాలు పెంపు?



ముంబయి: భారత మహిళా క్రికెటర్ల వేతనాలను భారీగా పెంచాలనే యోచనలో బిసిసిఐ ఉన్నట్టు సమాచారం. ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా మిథాలీ సేన అభిమానుల ఆదరణను చూరగొన్న విషయం తెలిసిందే. అద్భుత ఆటతో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన తమ క్రికెటర్లకు ఇప్పటి వరకు ఇస్తున్న వేతనాలను భారీగా పెంచాలని బిసిసిఐ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే మహిళా క్రికెట్ జట్టు సభ్యులకు ఒక్కొకరికి 50 లక్షల రూపాయల చొప్పున నజరానాను బిసిసిఐ అంద జేసిన విషయం తెలిసిందే. అయితే నజరానాతో సరి పెట్టకుండా మహిళా క్రికెటర్లకు ఇస్తున్న పారితోషికాన్ని భారీ పెంచాలని బిసిసిఐ పాలక మండలి నిర్ణయించిందని ఓ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని బిసిసిఐకి చెందిన ఓ అధికారి కూడా ధ్రువీకరించారు. ఇదే జరిగితే రానున్న రోజుల్లో పురుషులతో సమనంగా మహిళా క్రికెటర్లు కూడా కళ్లు చెదిరే ప్యాకేజీలను అందుకోవడం ఖాయం. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనను బోర్డు కోశాధికారికి బిసిసిఐ పంపినట్టు తెలిసింది. కాగా, ఈ నెల 9న జరిగే బిసిసిఐ పాలక మండలి సమావేశంలో దీనికి సంబంధించిన సాధకబాధకాలపై చర్చించే అవకాశం ఉంది.

టెన్నిస్ సమాఖ్యపై బోపన్న ఫైర్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సమాఖ్య తనపై చిన్నచూపు చూస్తుందని స్టార్ ఆటగాడు రోహన్ బోపన్న ఆవేదన వ్యక్తం చేశాడు. భారత టెన్నిస్‌కు ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న తనకు భారత టెన్నిస్ సమాఖ్య ఘోరంగా అవమానిస్తుందన్నాడు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డుల కోసం తన పేరును ఇంత వరకు ప్రతిపాదించక పోవడం బాధగా ఉందన్నాడు. తనకంటే తక్కువ స్థాయి ప్రతిభను కనబరిచే ఆటగాళ్లు కూడా అర్జున అవార్డులు సొంతం చేసుకుంటున్న తరుణంలో తనకు ప్రతి సారి నిరాశే ఎదురవుతుందన్నాడు. దశాబ్ద కాలంగా భారత టెన్నిస్‌కు ఎంతో సేవలు అందిస్తున్న తనపై ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదన్నాడు.

ఎదురులేని విజేందర్



ముంబయి: చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైటియాలినితో జరిగిన ఉత్కంఠ పోరులో భారత స్టార్ ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ విజయం సాధించాడు. శనివారం రాత్రి ముంబయిలో జరిగిన హోరాహోరీ పోరులో విజేందర్ జయకేతనం ఎగురవేశాడు. పది రౌండ్ల పాటు నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో చివరి వరకు ఆధిక్యాన్ని నిల బెట్టుకున్న భారత స్టార్ విజేందర్ జయభేరి మోగించాడు. దేశ వ్యాప్తంగా లక్ష లాది మంది అభిమానులు ఎంతో ఆసక్తిగా తిలకించిన ఈ మ్యాచ్‌లో గెలిచి విజేం దర్ తన ఖాతాలో రెండో ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ సొం తం చేసుకున్నాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో విజేందర్‌కు ఇది వరుసగా తొమ్మిదో విజయం కావడం విశేషం.

ముంబా, యుపి యోధా జట్ల జయకేతనం

నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ సీజన్–5లో భాగంగా శనివారం జరిగిన మ్యాచుల్లో యు ముంబా, యుపి యోధా జట్లు విజయం సాధించాయి. నాగ్‌పూర్‌లోని మంకాపూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో యు ముంబా 36–22 పాయింట్ల తేడాతో దబాంగ్ ఢిల్లీను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే ముంబా ఈ మ్యాచ్‌లో చెలరేగి ఆడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ ముందుకు సాగింది. షబ్బీర్ కుమార్, అనూప్ కుమార్ అద్భుత ఆటతో జట్టుకు అండగా నిలిచారు. వీరిద్దరూ తలో ఏడేసి పాయింట్లు సాధించి జట్టును ఆదుకున్నారు. సురేశ్ కుమార్ నాలు, కుల్దీప్ మూడు పాయింట్లు సాధించి తమవంతు పాత్ర పోషించారు. కాగా, ఢిల్లీ జట్టులో మెరాజ్, నిలేష్ ఏడేసి పాయింట్లు సాధించారు. మిగతా వారు విఫలం కావడంతో జట్టుకు ఓటమి తప్పలేదు. ఇదిలావుండగా ముంబాకు ఇది రెండో విజయం కాగా, ఢిల్లీకి మూడో ఓటమి కావడం విశేషం.

ఎదురులేని యోధా...: మరో మ్యాచ్‌లో యూపి యోధా 32–27 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే యూపి ఆధిపత్యం కనబరిచింది. స్టార్ ఆటగాడు నితిన్ తోమర్ దూకుడైన ఆటతో యూపిని ఆదుకున్నాడు. తన మార్క్ ఆటతో చెలరేగిన తోమర్ ఏకంగా 9 పాయింట్లు సాధించాడు. రిశంక్ ఐదు పాయింట్లు సాధించి తనవంతు పాత్ర పోషించాడు. కాగా, రాజేష్ నర్వల్, జీవా కుమార్ మూడేసి పాయింట్లు నమోదు చేశారు. బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్ 11 పాయింట్లతో చెలరేగినా ఫలితం లేకుండా పోయింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.